డిసెంబర్
2025

236


సంపుటి : 21 సంచిక : 7 వెల రు. 15/-

## ఈ సంచికలో........

సోషలిజానికి మళ్లీ పెరుగుతున్న ఆదరణ
కార్మికులకు ఏ హక్కులూ లేకుండా చేసే కుట్ర
సోషలిజానికి పురోగమనమా, ఆటవికతకు తిరోగమనమా
విజయనగర, బహమనీ సామ్రాజ్యాలు
ఇన్‌ఫ్లుయన్సర్ల శకంలో మేధావుల పాత్ర
రాష్ట్రాల హక్కులపై గవర్నర్ల దాడులు : సుప్రీంకోర్టు తీర్పు
చైనా 15వ పంచవర్ష ప్రణాళిక
వెనిజులా కమ్యూనిటీ ప్రాజెక్టు
గాంధీజీ హత్య : సావర్కర్ కపట నాటకాలు

**ఆర్ఎస్ఎస్ తప్పుడు సిద్ధాంతాలు - 2**

# గాంధీజీ హత్య: సావర్కర్ కపట నాటకాలు



రచయిత హైదరాబాద్ ఇసిఐఎల్‌లో రిటైర్డ్ సీనియర్ మేనేజర్

**పిబి చారి**

న్యూఢిల్లీలో బిర్లా హౌస్ ప్రాంగణంలో గాంధీజీ ప్రార్థన సమావేశంలో పాల్గొంటున్న సమయంలో నాథూ రామ్ వినాయక గాడ్సే వరుసగా మూడుసార్లు ఆయనపై పిస్టల్ పేల్చి హత్యగావించాడు. అది జరిగింది 1948 జనవరి 30 సాయంకాలం ఐదు గంటలకు. గాంధీజీ హత్యానంతరం దేశం మొత్తం దుఃఖ సముద్రంలో మునిగి ఉంటే ఆర్ఎస్ఎస్. సంఘ పరివార్ శాఖలు మిఠాయిలు పంచుకుని ఉత్సవాలు, సంబరాలు జరుపుకున్నాయి. క్రూర హంతకుడైన గాడ్సేను ఈ ఆర్ఎస్ఎస్ సంఘ పరివార్ వీరుడుగా కొలుస్తున్నాయి. గాంధీజీ హత్యకు ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం, వాళ్లు రెచ్చగొట్టిన మతోన్మాదం, వాళ్లు బోధించిన ఉన్మాదాలే కారణం. గాంధీజీ హత్యానంతరం ఆర్ఎస్ఎస్ నిషేధించబడింది. ఈ హత్య కేసులో విడి సావర్కర్ ఏడవ ముద్దాయి. గాంధీజీ హత్యకు ఆయన రహస్యంగా నాథూరామ్ గాడ్సే, నారాయణ ఆప్టేలతో కలసి కుట్ర పన్నాడని, అందువల్ల ఆ హత్యకు చట్టబద్ధంగా సావర్కర్ బాధ్యుడని ప్రాసిక్యూషన్ వాదించింది. ఆ కేసులో అప్రూవర్‌గా మారిన మరొక నిందితుడు దిగంబర రామచంద్ర బాడ్గే, గాంధీజీ హత్య ఉదంతాన్ని అందులో సావర్కర్ పాత్రను పూసగుచ్చినట్లు కోర్టులో చెప్పాడు. నాథూరాం వినాయక్ గాడ్సేను, నారాయణ ఆప్టేను సావర్కర్ కలిసి గాంధీజీ హత్యకు సావర్కర్ ఇంట్లోనే కుట్ర పన్నారని, మీరు విజయులై తిరిగిరండి (యశస్వి హోనా యా) అని ఆశీర్వదించాడని దిగంబర్ బాడ్గే కోర్టులో స్పష్టంగా చెప్పాడు. తర్వాత మేము నలుగురం అంటే నారాయణ ఆప్టే, గాడ్సే, శంకర్, నేను టాక్సీలో ఎక్కి రుయా కాలేజ్ వైపుకు బయలుదేరాము. గాంధీజీకి నూరేళ్ల నిండాయని సావర్కర్ జోస్యం చెప్పాడని నారాయణ ఆప్టే అన్నాడు. ఆ పని విజయవంతంగా పూర్తి చేయబడుతుందనే విషయంలో నాకుసందేహం లేదు అని కూడా అన్నాడు. ఈ విషయాలన్నింటినీ కోర్టులో దిగంబర బాడ్గే స్పష్టంగా వివరించాడు. జడ్జిగా ఉన్న ఆత్మ చరణ్, బాడ్గే వాంగ్మూలాన్ని విశ్లేషించి అతను చెబుతున్నది అక్షర సత్యం అని విశ్వసిస్తున్నట్లుగా ప్రకటించాడు. అయితే కోర్టు ప్రొసీజర్ ప్రకారం అప్రూవర్ సాక్ష్యంతో పాటు దానిని బలపరిచే మరో సాక్ష్యం కావలసి వచ్చింది. అప్రూవర్ సాక్షానికి మద్దతుగా మరొక సాక్ష్యం ఉండాలని రూల్ ఆఫ్ లా అయింది. మరొక సాక్ష్యం దొరకనందువలననే సావర్కర్ ఆ కేసు నుంచి బయటపడ్డాడు. నాథూరామ్ గాడ్సే కు, ఆప్టేకు ఉరి శిక్ష విధించింది కోర్టు. మిగిలిన వారికి యావజీవ కారాగార శిక్ష వేసింది.

సావర్కర్‌ను ఈ కేసు నుండి తప్పించడానికి హిందూ మహాసభ నాయకుడైన శ్యాంప్రసాద్ ముఖర్జీ పడరాని పాట్లు పడ్డాడు. తన పలుకుబడినంతా పణంగా పెట్టాడు. తాను హోంమినిస్టర్ సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఆత్రుతగా ఒక ఉత్తరం రాస్తూ గాంధీజీ హత్య కేసులో సావర్కర్ పేరు కూడా వినవస్తున్నది, ఆయనకు వ్యతిరేకంగా ఏమి సాక్ష్యం దొరికిందో నాకు తెలియదు, గాంధీజీకి వ్యతిరేక రాజకీయ విశ్వాసాల కారణంగా ప్రాసిక్యూషన్ నడిచింది అని భావించే ఆస్కారమిచ్చే ఏ పని మీరు తలపెట్టవద్దు, ఈ విషయంలో నిర్ణయం తీసుకునే ముందు రికార్డులన్నీ మీరు పరిశీలిస్తారని ఆశిస్తున్నాను, గతంలో సావర్కర్ త్యాగాలు చేశాడు, ఎన్నో బాధలు అనుభవించాడు, అందువలన కేసుకు అనుకూలమైన సాక్ష్యం ఉంటే తప్ప ఈ వయసులో హత్యకు కుట్ర చేశాడన్న నేరం మీద విచారించడం మంచిది కాదు.. అని వాపోయాడు. దానికి బదులుగా పటేల్ ముఖర్జీకి ఉత్తరం రాస్తూ ఈ విషాదం తర్వాత హిందూ మహా సభసభ్యులు గణనీయమైన సంఖ్యలో సంబరపడి కేరింతలు కొట్టి మిఠాయిలు పంచుకున్న విషయం పట్ల కళ్ళు మూసుకొని ఉండగలమా? దేశంలోని అన్ని భాగాల నుండి మాకు విశ్వసనీయమైన సమాచారం అందింది. అన్నీ ఆలోచించి సాక్షులను విచారించిన తర్వాతనే చర్యలు తీసుకుంటాం అంటూ ఘాటైన సమాధానం ఇచ్చాడు. సావర్కర్ ప్రత్యక్షనాయకత్వాన గల హిందూ మహాసభలో ఉన్మాద విభాగం ఈ కుట్ర పన్ని అమలు జరిపింది. గాంధీజీ ఆలోచనా విధానాలను గట్టిగా వ్యతిరేకించే ఆర్ఎస్ఎస్, హిందూ మహాసభ సభ్యులంతా ఆయన హత్యకు స్వాగతం పలికారు అని సర్దార్ వల్లభాయ్ పటేల్ అభిప్రాయపడ్డాడు.

సావర్కర్ కోర్టులో తన వాదనను సమర్థించుకునేందుకు ఒక రాతపూర్వక ప్రకటన చేశాడు. అందులోని విన్యాసాలు చూస్తే ప్రతి ఒక్కరూ విస్తు పోవాల్సిందే. తాను మహాత్మాజీని ఆరాధించే వాడినని, ఆయనను పదేపదే కీర్తించే వాడినని, అలాంటి తనపై స్వతంత్ర భారత ప్రభుత్వం, అలాంటి మహానుభావుడిని హత్య చేసినట్లు తనపైనే ఆరోపణ చేసినందుకు విలవిల్లాడిపోతున్నాను అంటూ కోర్టులో తన ప్రకటన చదివాడు. ప్రకటనలో ఆ భాగం చదివేటప్పుడు బుగ్గలపై కన్నీటి దారలు తుడుచుకున్నట్లు నటించాడు. వాస్తవానికి నేరం మనస్తత్వంలో నుండి పుట్టుకొచ్చిన భయంతో సావర్కర్ వణికిపోతున్న మనిషిగా ఉన్నాడు. ఈ విషయం గురించి “రాబర్ట్ పయనే”, “ఇమాన్ దార్” అనేవాళ్లు సావర్కర్ నటనను ప్రత్యక్షంగా చూసి పై మాటలు రాశారు.

నాథూరామ్ గాడ్సే ఆర్ఎస్ఎస్ సభ్యుడు అనేది అసలు ఆరోపణ. ఈ ఆరోపణను సంఘ పరివార్ శక్తులు గొంతు చించుకొని చాలా కాలం నిరాకరించాయి. చివరకు వీళ్ల ఫాసిస్టు ముసుగును గాడ్సే తమ్ముడైన గోపాల్ గాడ్సేనే తొలగించాడు. 1991 జూన్ 5వ తేదీన పుణేలో జరిగిన పత్రికా గోష్టిలో నాథూరామ్ గాడ్సే ఆర్ఎస్ఎస్ వాలంటీర్ అని, మేము మా కుటుంబ సభ్యులంతా ఆర్ఎస్ఎస్ వాళ్లమే అని ప్రకటించాడు. అంతేకాదు అదే ప్రెస్ మీట్‌లో విలేకరులు అడిగిన ప్రశ్నలకు

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


**1. గాంధీజీ హత్య : సావర్కర్ కపట నాటకాలు**

పిబి చారి.........2

**2. సోషలిజానికి మళ్లీ పెరుగుతున్న ఆదరణ**

బివి రాఘవులు.....4

**3. కార్మికులకు ఏ హక్కులూ లేకుండా చేసే కుట్ర**

ఎస్ వీరయ్య ......9

**4. సోషలిజానికి పురోగమనమా, ఆటవికతకు తిరోగమనమా**

ఎరిక్ రోజ్ .....11

**5. విజయనగర, బహమనీ సామ్రాజ్యాలు**

ఎంవిఎస్ శర్మ.....15

**6. ఇన్‌ఫ్లుయన్సర్ల శకంలో మేధావుల పాత్ర**

సభా గుర్మత్.........18

**7. రాష్ట్రాల హక్కులపై గవర్నర్ల దాడులు: సుప్రీంకోర్టు తీర్పు**

ఎ కోటిరెడ్డి........23

**8. చైనా 15వ పంచవర్ష ప్రణాళిక**

ఎస్ వెంకట్రావు........27

**9. వెనిజులా కమ్యూనిటీ ప్రాజెక్టు**

ఏంజెల్ ప్రాడోతో ఇంటర్వ్యూ......31



**సంపాదకుడు :**

**ఎస్.వెంకట్రావు**

**సంపాదక వర్గం :**

**బి.వి.రాఘవులు**

**తమ్మినేని వీరభద్రం**

**ఎస్.వీరయ్య**

**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**

సంపాదకుడు : **ఎస్.వెంకట్రావు**

**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)

**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**

email:venkataraosankarapu@gmail.com

email:marxistap@gmail.com

visit cpi(m) site at : cpim.org


# దగా కోడ్‌లు

కార్మికుల భద్రతనూ, సంక్షేమాన్నీ, సుదీర్ఘకాలం పోరాడి సాధించుకున్న హక్కులనూ చట్టాల పరిధి నుండి తొలగించి యజమానుల దయాదాక్షిణ్యాలకు వదిలిపెట్టే లేబర్ కోడ్‌లపై కార్మికలోకంలో ఎంతటి వ్యతిరేకత ఉందో నవంబర్ 26వ తేదీన దేశవ్యాపితంగా కార్మికవర్గం నిర్వహించిన నిరసన కార్యక్రమాలు తెలియజేశాయి. కార్మికుల ప్రయోజనం కోసమే 29 కార్మిక చట్టాలను 'సరళీకరించి' నాలుగు కోడ్‌లుగా మార్చామని కేంద్ర ప్రభుత్వం చెప్పే దగాకోరు మాటలను కార్మికవర్గం నమ్మబోవడం లేదని కూడా ఈ నిరసన కార్యక్రమాలు వెల్లడించాయి. ప్రభుత్వం ఇంతకాలం ఆగి బీహార్‌లో ఎన్నికల ఫలితాలు తమకు అనుకూలంగా వచ్చిన వెంటనే వాటి అమలుకు నోటిఫికేషన్ జారీచేసింది.


కార్మిక చట్టాలను ఆధునీకరించేందుకే కోడ్‌లు తీసుకువచ్చినట్లు ప్రభుత్వం సమర్ధించుకుంటోంది. ఇవి కార్మికులకే అనుకూలమని వాదిస్తోంది. కానీ కార్మికులపై కార్పొరేట్ దోపిడీని మరింత పెంచడమే ఈ కోడ్‌ల లక్ష్యం. జాతీయ, అంతర్జాతీయ బడా పెట్టుబడిదారుల లాభాలను ఇబ్బడి ముబ్బిడిగా పెంచడం కోసం పూర్తి స్థాయి కాంట్రాక్టీకరణ, హైర్ అండ్ ఫైర్ విధానాన్ని ప్రవేశపెట్టడానికి ఈ కోడ్‌లు మార్గం సుగమం చేస్తాయి. పారిశ్రామిక వివాదాల చట్టం, ఫాక్టరీ చట్టం, గనుల చట్టం, కాంట్రాక్టు లేబర్ (రెగ్యులేషన్ అబాలిషన్) చట్టం మొదలైన వాటి ద్వారా కార్మికులకు లభిస్తున్న రక్షణలను ఎత్తివేయడానికి లేబర్ కోడ్‌లు ఒక సాధనంగా ఉపయోగపడతాయి. ఎందుకంటే ఈ కోడ్‌లు ప్రస్తుతమున్న కొద్దిపాటి లేబర్ డిపార్ట్‌మెంట్‌ల పాత్రను ఇకపై లేకుండా చేస్తాయి. కార్మికులకు చట్టపరమైన ఉద్యోగ భద్రతను ఎత్తివేస్తాయి. గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులతో సహా కార్మికులందరికీ సార్వత్రిక సామాజిక భద్రతను అమలు చేస్తామని సామాజిక భద్రత కోడ్‌లో ప్రభుత్వం పేర్కొంటున్నది. అది కూడా మోసపూరితమే. ఎందుకంటే ఈ కోడ్‌లోని 109 నుండి 114 వరకు ఉన్న సెక్షన్లలో గిగ్, ప్లాట్‌ఫార్మ్ కార్మికులకు కొన్ని స్కీములు పెడతామని మాత్రమే చెబుతున్నది. కానీ వాటికి నిధుల కేటాయింపు గురించిగానీ, కార్మికులకొచ్చే లబ్దిగురించిగానీ, ఒక నిర్ధిష్ట కాల పరిమితి గురించి గానీ ఏమీ చెప్పలేదు. ఈ కార్మికులు ఏ కంపెనీకి పనిచేసినా వారి ఆధార్‌ల ఆధారంగా సర్వీసు గుర్తిస్తామని చెబుతోంది. కానీ యజమానుల చట్టబద్ధమైన బాధ్యతలను కోడ్‌లో పేర్కొనలేదు. ఎంప్లాయిమెంటు రికార్డుల గురించిగానీ, సరైన అమలు యంత్రాంగం గురించి గానీ దానిలో నిర్దిష్టంగా లేదు.

మహిళలను ఎటువంటి భద్రతా ఏర్పాట్లు చేయకుండానే రాత్రి షిఫ్టులో పనికి నియమించుకోడానికి ఈ కోడ్‌లు అనుమతిస్తున్నాయి. ప్రమాదకరమైన చిన్న మధ్యతరగతి పరిశ్రమలు, గనుల్లో లేబర్ డిపార్ట్‌మెంట్ తలిఖీలకు తిలోదకాలిచ్చి స్వీయ సర్టిఫికేట్లు ఉంటే చాలంటున్నాయి. చట్టాల అమలు నీరుగారడం వల్ల ఇప్పటికే ఈ పరిశ్రమల్లో పెద్ద ఎత్తున ప్రమాదాలు జరిగి అనేక మంది కార్మికులు చనిపోతున్నారు, గాయాల పాలవుతున్నారు. ఇప్పుడు వాటిని ఎత్తివేస్తే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పరిశ్రమల్లో ఫిర్యాదు ఆధార తనిఖీ స్థానంలో ఒకే కేంద్రం నుండి రాండమ్ (అనిర్దిష్ట) తనిఖీ పద్ధతి ప్రవేశపెడతారు. ఇన్‌స్పెక్టర్ల స్థానంలో ఫెసిలిటేటర్లను (ఇరువైపులా సహకరించేవారిని) పెడతారు. అంటే పరిశ్రమలను పూర్తిగా డిరెగ్యులరైజ్ చేస్తారు. దీనివల్ల కార్మికుల వేతనాలు, భద్రతా ప్రమాణాలు, పనిగంటలు, సాంఘిక భద్రత విషయంలో యజమానుల ఇష్టారాజ్యం పెరిగిపోతుంది. 10 శాతం మంది కార్మికులు సభ్యులుగా ఉంటేనే కార్మిక సంఘం పెట్టుకోడానికి అనుమతి ఉంటుంది. దీనివల్ల కార్మిక సంఘాలు పెట్టుకోవడం దుర్లభమవుతుంది. పారిశ్రామిక సంబంధాల కోడ్ సెక్షన్ 62 ప్రకారం సమ్మెకు 14 రోజుల ముందు నోటీసు ఇవ్వాలి. రాజీ ప్రయత్నాలు జరుగుతున్న కాలంలో సమ్మె నిషేదించబడింది. అంటే ప్రభుత్వం కావాలని రాజీ ప్రయత్నాల కాలాన్ని పొడిగిస్తూ సమ్మెను అడ్డుకునే అవకాశం ఉంది. ఇదంతా కార్మికుల సమ్మె హక్కును కాలరాయడానికే.

ఏతావాతా లేబర్ కోడ్‌లు కార్పొరేట్ దోపిడీని పెంచి, వారికి గరిష్ట లాభాలు చేకూర్చేందుకు కార్మికులపై వేసిన ఉచ్చులే మినహా కార్మిక వర్గానికి ఏమాత్రం లాభం చేకూర్చేవి కావన్నది పచ్చినిజం. అందువల్ల ఈ దగా'కోడ్'లను తిప్పికొట్టి తమ హక్కులను, ఉద్యోగ, సామాజిక భద్రతను కాపాడుకునేందుకు అన్ని పరిశ్రమలు, అన్ని సంఘాలకు చెందిన కార్మిక వర్గం ఐక్యంగా ప్రతిఘటించాల్సిన అవసరం ఉంది.

**ఈ మాసం ముఖ్యాంశం**

# సోషలిజానికి మళ్లీ పెరుగుతున్న ఆదరణ



రచయిత సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు

**బివి రాఘవులు**

**(గుంటూరు నగరంలో గత నెల అక్టోబర్ విప్లవదినోత్సవం సందర్భంగా జరిగిన సభలో సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు చేసిన ప్రసంగ పాఠాన్ని మార్చిస్టు పాఠకులకు అందజేస్తున్నాం....సంపాదకుడు)**

1917 అక్టోబర్‌లో రష్యాలో జయప్రదం అయిన సోషలిస్టు విప్లవం పెట్టుబడిదారీ వ్యవస్థకు ఒక పెద్ద గండి కొట్టింది. అప్పటి నుండి ప్రపంచంలోని అనేక దేశాలు సోషలిజం వైపు ప్రయాణించడానికి అది మార్గం చూపించింది. రెండో ప్రపంచ యుద్ధం జరిగాక మరిన్ని దేశాలు పెట్టుబడిదారీ విధానాన్నీ, భూస్వామ్య విధానాన్ని దెబ్బతీసి సోషలిజం వైపుకు వచ్చాయి. 1949లో చైనాలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సోషలిస్టు ప్రభుత్వ ఏర్పడిన సంగతి మనందరికీ తెలుసు. 1945 నాటికి వియత్నాం ఉత్తర ప్రాంతం కమ్యూనిస్టుల అధికారం క్రిందకు వచ్చినప్పటికీ దక్షిణ ప్రాంతం 1975కు కమ్యూనిస్టుల వశం కాలేదు. 1975 నాటికి మొత్తం వియత్నాం పూర్తిగా సోషలిస్టు దేశం అయింది. 1959లో క్యూబాలో ఫైడల్ కాస్ట్రో, చే గువేరాల నాయకత్వంలో సోషలిస్టు ప్రభుత్వం ఏర్పడింది. వియత్నాం విప్లవానికి అనుబంధంగానే లావోస్, కాంబోడియా దేశాల్లో సోషలిస్టు ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఆ విధంగా అక్టోబర్ విప్లవం ఇచ్చిన ఉత్తేజం, ప్రోత్సాహంతో సోషలిజం క్రమంగా ప్రపంచ వ్యాపితంగా విస్తరిస్తూ వచ్చింది. ప్రపంచ సోషలిజం సామ్రాజ్యవాదాన్నీ, అమెరికా ఆధిపత్యాన్నీ సవాలు చేస్తూ ఎదురు నిలిచింది.

అయితే పెట్టుబడిదారులు ఆయా దేశాల్లో తమ ఆధిపత్యం పోతూ ఉంటే కళ్లప్పగించి చూస్తూ ఊరుకోలేదు. ఏదో ఒక విధంగా సోషలిస్టు ఆశల్ని వమ్ము చేయడానికీ, సోషలిజం కోసం పోరాడేవారిని ఎదుర్కోడానికీ ప్రయత్నాలు చేస్తూనే వచ్చారు. మామూలుగా కాదు, అత్యంత ఘోరమైన ప్రయత్నాలు చేశారు. విప్లవాలు జయప్రదమైన దేశాల్లో ఎన్ని దుర్మార్గాలు చేశారు అన్నదాన్ని పక్కన పెడితే, సోషలిజం వస్తుందనే భయంతో 1950 దశకంలో గ్రీసు దేశంలో వేలాది మంది కమ్యూనిస్టులను ఊచకోతకోసి విప్లవాన్ని అణచివేసింది అమెరికా. 1965లో ఇండోనేషియాలో ఒక్క సంవత్సరంలో 10 లక్షల మంది కమ్యూనిస్టులను ఊచకోత కోసి చంపారు. ఆ విధంగా ఇండోనేషియాలో కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వం రాకుండా అడ్డుకున్నది అమెరికన్ సామ్రాజ్యవాదం. అంతటితో ఆగలేదు. మన పక్కనే ఉన్న ఆఫ్ఘనిస్తాన్‌లో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో విప్లవం వచ్చింది. ఆ విప్లవాన్ని నాశనం చేయడానికి అమెరికా పూనుకుంది. అక్కడ తాలిబాన్లను ప్రోత్సహించి, వారికి ఆయుధాలు సరఫరా చేసింది. అమెరికా గూఢచారి సంస్థ సిఐఎ తాలిబాన్లకు కమ్యూనిస్టుల అడ్రసులు ఇచ్చింది. ఆఫ్ఘన్ కమ్యూనిస్టు పార్టీకి చెందిన ముగ్గురు ప్రధాన కార్యదర్శులతో సహా అనేక మందిని ఊచకోత కోసి చంపారు. ఆఫ్ఘనిస్తాన్ ఇప్పుడు మనకు ఇస్లామిక్ దేశంగా కనిపించ వచ్చు కానీ ఒకప్పుడు అది కమ్యూనిస్టు దేశం. మతం పేరుతో తాలిబాన్లను ప్రోత్సహించి కమ్యూనిస్టు దేశాన్ని నాశనం చేసింది అమెరికాయే. నేడు ఇస్లామిక్ దేశంగా చెప్పుకుంటున్న ఇరాక్‌లో ఒకనాడు టుడే పార్టీ పేరుతో వామపక్ష పార్టీ చాలా బలంగా ఉండేది. సద్దాం హుస్సేన్‌ను ఉపయోగించుకుని, సిఐఎ ద్వారా అతనికి ఆయుధాలు ఇచ్చి అమెరికా అక్కడ కమ్యూనిస్టు పార్టీని సర్వనాశనం చేసింది. అదే సద్దాం హుస్సేన్ ఆ తరువాత అమెరికాకు ఎదురుతిరిగాడు అది వేరే కథ. అమెరికా దురాగతాలు ఇంతటితో ఆగలేదు. సిరియాలో నేడు ఒక మతవాది అధికారంలో ఉన్నాడు. కానీ ఆ దేశంలో ఒకనాడు బలమైన కమ్యూనిస్టు పార్టీ ఉండేది. వారు అధికారంలోకి వచ్చే పరిస్థితి ఉండేది. అక్కడ కూడా మత ఛాందస వాద పార్టీలను ప్రోత్సహించి కమ్యూనిస్టు పార్టీని నాశనం చేశారు.

పైన చెప్పనవన్నీ అమెరికా తన దేశం బయట జరిపిన దురాగతాల్లో కొన్ని మాత్రమే. ఇవి కాకుండా అమెరికా లోపల అది చేసిన దురాగతాలెన్నో. ఆ దేశంలో కూడా సోషలిస్టులు, కమ్యూనిస్టులు బలంగా ఉండేవారు. 1950 కాలంలో మెకార్థీ అనే అమెరికా మంత్రి, ఆ దేశంలో కమ్యూనిస్టులను, సోషలిస్టులను వేటాడి, వెంటాడి, వేధించి కమ్యూనిజాన్ని అణచివేయడానికి ప్రయత్నించారు. గొప్ప హాలీవుడ్ నటుడు చార్లీ చాప్లిన్ సినిమాలు మీరు చూసి ఉంటారు. ఆయన ఒక కమ్యూనిస్టు. ఆయన్ను కూడా వెంటాడి, వేధించి అమెరికా నుండి స్విట్జర్లాండు పారిపోయి అక్కడ బ్రతకాల్సిన పరిస్థితులు సృష్టించారు. అలాగే అనేక మంది శాస్త్రవేత్తలు ఆ రోజున కమ్యూనిస్టులుగా ఉండేవారు. వారిని కూడా తీవ్రమైన వేధింపులకు గురిచేశారు. అనేక మంది సినిమా నటులు, డైరెక్టర్లు, రచయితలు కమ్యూనిస్టులు, వామపక్ష వాదులుగా ఉండేవారు. వాళ్లను కూడా వేధించి, కేసులు పెట్టి అణచివేయడానికి ప్రయత్నించారు. ప్రపంచంలో సోషలిజం అనేది ఆశామాషీగా రాలేదని చెప్పడానికే నేను ఇదంతా చెబుతున్నాను. సోషలిజం వచ్చిన దేశాల్లో దాన్ని తీసుకు రావడానికి కమ్యూనిస్టులు, ప్రజలు ఎన్ని త్యాగాలు చేశారో అంతే మోతాదులో సోషలిజం రాని దేశాల్లో కూడా దానికోసం ప్రజలు అనేక త్యాగాలు చేశారు. ఆ దేశాలన్నిటిలో కూడా సోషలిజాన్ని అణచివేయడం కోసం అమెరికా రక్తం ఏరులై పారించింది. లక్షల్లో కమ్యూనిస్టులను చంపేసింది. ఇవన్నీ జరగకుండా ఉంటే ఈ సరికి ప్రపంచ వ్యాపితంగా సోషలిజం విస్తరించి ఉండేది.

పెట్టుబడిదారీ విధానానికి సోషలిజం అంటే అంత కోపం ఎందుకు? పెట్టుబడిదారీ విధానం మంచిది కాదని చెప్పే కమ్యూనిస్టులు, సోషలిస్టులు, వామపక్షవాదులంటే అంత ద్వేషం ఎందుకు? అవసరమైతే వాళ్లను ఊచకోతకోసి చంపి, నామరూపాలు లేకుండా చేయాలన్న పగ ఎందుకు? ఎందుకంటే సోషలిజం వస్తే పెట్టుబడిదారులకు వారి పెత్తనం పోతుంది. వారు ప్రజల పొట్టలు కొట్టి సంపాదించుకున్న లాభాలు పోతాయి. సోషలిజంలో పెట్టుబడి దారులకు మనుగడ ఉండదు. సోషలిజంలో భూస్వాములుండరు. ఆ వ్యవస్థలో కష్టపడకుండా తినికూర్చునే వారుండరు. అక్కడ ప్రజలు ఎంతకష్టపడితే వారికి అంత గౌరవం దక్కుతుంది. ఇతరులు కష్టపడి పనిచేసి సంపద సృష్టిస్తే దాన్ని మరికొందరు అనుభవిస్తూ కాళ్లమీద కాళ్లువేసుకుని కూర్చుని అనుభవించే అవకాశం ఉండదు. అందుకే తాము కష్టపడకుండా ఇతరుల కష్టం మీద ఆధారపడి బ్రతికే ఈ వారందరికీ సోషలింజం అంటే ద్వేషం. అందుకే వాళ్లు సోషలిజం రాకుండా ఉండడం కోసం ఎంత ఘోరానికైనా ఒడిగడతారు. ఎంతటి నీచ ప్రయత్నాలైనా చేస్తారు. వారి ఈ ప్రయత్నాలు ఎంతవరకు పోయాయంటే సోషజం వచ్చిన దేశాలను కూడా వాళ్లు వదిలిపెట్టలేదు. సోష్టలిస్ట దేశలను కూడా కుట్రలతో, కుతంత్రాలతో దెబ్బతీసి అక్కడ సోషలిజాన్ని నాశనం చేయడానికి ప్రయత్నిస్తూనే వచ్చారు.

ఈ ప్రయత్నాలతో వాళ్లు రష్యాలో సోషలిజం వచ్చిన 70 సంవత్సరాల తరువాత అక్కడ సోషలిజాన్ని దెబ్బతీశారు. కమ్యూనిస్టు పార్టీని దెబ్బతీసి 1989లో పెట్టుబడిదారులను మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చారు. రష్యాకు ఇప్పుడు అధిపతిగా ఉన్న పుతిన్ వంటి వారంతా ఒకప్పుడు కమ్యూనిస్టులే. ఆయన రష్యా గూఢచారి సంస్థ కెజిబి అధిపతిగా పనిచేశారు. గతంలో పాలించిన గోర్బచెవ్, ఎల్ట్సిన్ వంటివారిని లోబరుచుకుని కమ్యూనిస్టు పార్టీని దెబ్బతీశారు. అయితే ఇప్పటికీ అక్కడ కమ్యూనిస్టు పార్టీ అంటే, సోషలిజం అంటే ప్రజలకు అభిమానం పోలేదు. ఇప్పటికీ లెనిన్ మాసోలియం అక్కడే ఉంది. ఇప్పటికీ ఫాసిజంపై స్టాలిన్ నాయకత్వంలో కమ్యూనిస్టులు, ఎర్రసైన్యం సాధించిన విజయాలను ప్రజలు గౌరవిస్తూనే ఉంటారు. విజయోత్సవాలు జరుపుకుంటూ ఎర్రజెండాలతో ప్రదర్శనలు జరుపుతూనే ఉంటారు. అయినప్పటికీ అక్కడ సోషలిజం దెబ్బతిన్నదన్న మాట వాస్తవం.

ప్రపంచమంతా సోషలిజం విస్తరిస్తున్న తరుణంలో రష్యాలో సోషలిజం దెబ్బతినడంతో కమ్యూనిస్టులు, వామపక్ష వాదులు తీవ్ర నిరాశకు గురయ్యారు. నిరాశ ఎంతో సహజం. మనమంతా ఆశపెట్టుకున్న సోషలిజం పుట్టిన గడ్డమీదనే దెబ్బతింటే సహజంగానే మనకు నిరాశ కలుగుతుంది. చాలా మంది కమ్యూనిస్టులు ఈ నిరాశతో అసలు కమ్యూనిస్టు పార్టీనే వదిలేశారు. కొన్ని కమ్యూనిస్టు పార్టీల పేర్లు మార్చుకుని కొత్త కొత్త పేర్లు పెట్టుకున్నారు. పేరు మార్చుకుంటే మళ్లీ ప్రజలు కమ్యూనిస్టు పార్టీ వైపు వస్తారేమోనని ఆశపడ్డారు.

> **“ ఈమధ్య అమెరికాలో ఫ్యూ అనే ఒక సంస్థ యువకులలో ఒక సర్వే నిర్వహించింది. అందులో 20 నుండి 30 ఏళ్ల యువకుల్లో 60 శాతం మంది మాకు సోషలిజం కావాలి అని చెప్పారు. అది మనలాంటి దేశంలో కాదు, ప్రపంచ పెట్టుబడిదారీ విధానానికి నాయకుడైన, పెట్టుబడిదారీ విధానం ప్రమాదంలో ఉన్నదనుకున్న చోట్లకు సైన్యాన్ని పంపి తిరుగుబాటు నాయకులను హత్యలు చేసి, తిరుగుబాట్లను అణచి వేసే ప్రయత్నాలు చేస్తున్న అమెరికాలో జరుగుతోందన్న విషయం గుర్తుపెట్టుకోవాలి. ”**

ఆ సమయంలో పెట్టుబడిదారీ విధానంతో చరిత్ర ఆగిపోయిందని, ఇంక సోషలిజం అనేది లేదని ఒక చరిత్రకారుడు రాశాడు. ఆయన పేరు ఫ్రాన్సిస్ ఫుకుయామా. ఆయనే ఈ మధ్య మళ్లీ ఒక గ్రంథం రాశాడు. ఈ పెట్టుబడిదారీ విధానానికి భవిష్యత్తు ఉందా అని ఆయన రాశాడు. అంటే 1989లో ఏర్పడిన వాతావరణం నుండి ప్రపంచం మళ్లీ తేరుకుని పెట్టుబడిదారీ విధానం శాశ్వతం కాదు, పెట్టుబడిదారీ విధానం నశించి సోషలిజం వస్తేగానీ ప్రజల సమస్యలు తీరవు అనే వాతావరణం క్రమంగా రావడం ప్రారంభించింది. అందులో భాగంగానే సోషలిజానికి అనుకూలంగా అనేక పరిణామాలు నేడు ప్రపంచ వ్యాపితంగా జరుగుతున్నాయి. ఆ పరిణామాల్లో ఒక పరిణామమే నేడు అమెరికా ఆర్థిక రాజధాని, ప్రపంచ పెట్టుబడిదారీ కేంద్రమైన న్యూయార్క్ నగర మేయర్‌గా సోషలిస్టు భావజాలం గల మమ్దానీ గెలుపొందడం. మేయర్‌గా మమ్దానీ గెలిచినంతమాత్రాన అమెరికాలో సోషలిజం వచ్చేయదు. కానీ, ఒక నగర మేయర్‌గా ఒక సోషలిస్టు గెలిచినంత మాత్రాన దేశాధ్యక్షుడైన ట్రంప్ ఎందుకంత భయపడిపోతున్నాడు? నిజానికి అది మమ్దానీని చూస్తే వచ్చే భయం కాదు, మమ్దానీ చెబుతున్న సోషలిజం అంటే భయం. ట్రంప్ అంటే ఒక వ్యక్తి కాదు, ఆయన ప్రపంచంలో పెట్టుబడదారులకు ఒక ప్రతినిధి. ప్రపంచంలో పెట్టుబడిదారులను ఎలా కాపాడాలి, వారి ఆస్తులను ఎలా రక్షించాలి అని ఆలోచించే శక్తులకు ట్రంప్ ప్రాతినిధ్యం వస్తున్నాడు. అంటే ప్రపంచ పెట్టుబడిదారుల భయాలను ట్రంప్ వ్యక్తం చేస్తున్నాడు.

ఈమధ్య అమెరికాలో ఫ్యూ అనే ఒక సంస్థ యువకులలో ఒక సర్వే నిర్వహించింది. అందులో 20 నుండి 30 ఏళ్ల యువకుల్లో 60 శాతం మంది మాకు సోషలిజం కావాలి అని చెప్పారు. అది మనలాంటి దేశంలో కాదు, ప్రపంచ పెట్టుబడిదారీ విధానానికి నాయకుడైన, పెట్టుబడిదారీ విధానానికి రక్షకుడుగా ఉన్న, పెట్టుబడిదారీ విధానం ప్రమాదంలో ఉన్నదనుకున్న చోట్లకు సైన్యాన్ని పంపి తిరుగుబాటు నాయకులను హత్యలు చేసి, తిరుగుబాట్లను అణచి వేసే ప్రయత్నాలు చేస్తున్న అమెరికాలో జరుగుతోందన్న విషయం గుర్తుపెట్టుకోవాలి. అందువల్లనే ట్రంప్ న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన ఒక చిన్న వ్యక్తిమీద చిందులు వేస్తున్నాడు. నిజానికి ట్రంప్ తలచుకుంటే మేయర్‌ను పనిచేయనీయకుండా, తను చేసిన వాగ్దానాలను అమలు చేయనీయకుండా అడ్డుకోవచ్చు. నిధులు రాకుండా అడ్డుకోవచ్చు. ఫెడరల్ (కేంద్ర ప్రభుత్వ) దళాలను పంపి తన ఆధిపత్యాన్ని కొనసాగించవచ్చు. అయినప్పటికీ అంత చిన్న వ్యక్తిపై ట్రంప్ అంతటి ఆగ్రహం ప్రదర్శించడానికి కారణం ఏమిటి? ఏమిటంటే, మమ్దానీ సోషలిస్టునని చెప్పడమే. తను అధికారంలోకి వస్తే కార్మికుల కోసం పనిచేస్తానని చెప్పడమే. అన్ని దేశాలనుండి వలసలు వచ్చిన ప్రజల కోసం పనిచేస్తాననీ, న్యూయార్క్ నగరంలో పెట్టుబడిదారుల కోసం పనిచేసే రవాణా, విద్యా, వైద్య వ్యవస్థలను ప్రజల కోసం పనిచేసేట్లు మారుస్తాననీ చెప్పడమే. ఈ వాగ్దానాలు చెప్పినందుకే న్యూయార్క్ ప్రజలు మమ్దానీకి ఓట్లేశారు.

నేడు అమెరికాలోనే కాదు, ఐరోపాలోనూ, ప్రపంచ మంతటా ఇదే పరిస్థితి ఉంది. ఢిల్లీలోని జెన్‌యులో కొద్దిరోజుల క్రితం జరిగిన విద్యార్థి సంఘ ఎన్నికల్లో ఎబివిపిని ఓడించి వామపక్ష

> **"నేడు అమెరికాలోనే కాదు, ఐరోపాలోనూ, ప్రపంచ మంతటా ఇదే పరిస్థితి ఉంది. ఢిల్లీలోని జెఎన్‌యులో కొద్దిరోజుల క్రితం జరిగిన విద్యార్థి సంఘ ఎన్నికల్లో ఎబివిపిని ఓడించి వామపక్ష విద్యార్థి సంఘాలు అఖండ విజయం సాధించాయి. పుదుచ్చేరి విశ్వవిద్యాలయంలో జరిగిన ఎన్నికల్లో కూడా వామపక్ష విద్యార్థి సంఘాలు ఘన విజయం సాధించాయి. మన దేశంలో కూడా అనేక యూనివర్శిటీల్లో విద్యార్థులు మళ్లీ సోషలిజం వైపుకీ, వామపక్షం వైపుకీ మొగ్గుతున్న విషయాన్ని మనం గమనిస్తున్నాం."**

విద్యార్థి సంఘాలు అఖండ విజయం సాధించాయి. పుదుచ్చేరి విశ్వవిద్యాలయంలో జరిగిన ఎన్నికల్లో కూడా వామపక్ష విద్యార్థి సంఘాలు ఘన విజయం సాధించాయి. మన దేశంలో కూడా అనేక యూనివర్శిటీల్లో విద్యార్థులు మళ్లీ సోషలిజం వైపుకీ, వామపక్షం వైపుకీ మొగ్గుతున్న విషయాన్ని మనం గమనిస్తున్నాం. 1970, 80 దశకాల్లో సోషలిజం భావజాలంవైపుకి విద్యార్థులు, యువకులు పెద్ద ఎత్తున ఆకర్షించబడేవారు. కానీ, తరువాతి కాలంలో కొన్ని దశాబ్దాల పాటు నిరాశ ఏర్పడింది. మళ్లీ ఇప్పుడు ఆ నిశాశ నుండి బయటపడి విద్యార్థి, యువజనులు సోషలిజం వైపుకు చూస్తున్నారు. ఎందుకిలా జరుగుతున్నది? ఈ రోజున పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో ఉంది. ప్రజలు ఈ వ్యవస్థవల్ల సమస్యలు పరిష్కారం కావు అని నిర్ధారణకు వస్తున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో ఉందని ఎలా చెప్పగలం? కొన్ని విషయాల ద్వారా దాన్ని నిర్ధారించగలం.

మొదటిది, పెట్టుబడిదారీ విధానం ఆర్థికవ్యవస్థను అభివృద్ధి చేయలేకపోతున్నది. 20 సంవత్సరాల క్రితం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 4 శాతం అభివృద్ధి సాగించేది, ఇప్పుడది రెండు శాతం కన్నా తగ్గిపోయింది. దీనివల్ల ఉద్యోగావకాశాలు తగ్గిపోయాయి. ఎక్కడైనా అభివృద్ధి జరిగినా ఉపాధిరహిత అభివృద్ధి కారణంగా ఉద్యోగాలు పెరగడం లేదు. ఉదాహరణకు విశాఖలో నెలకొల్పబోత్ను గూగుల్ డేటా సెంటర్‌లో దాదాపు 15 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడి పెడుతున్నారంటున్నారు. మామూలు పరిశ్రమల్లో కోటి రూపాయల పెట్టుబడికి వందమందికి ఉద్యోగాలు వస్తాయి. అత్యాధునిక కంపెనీల్లో అయితే ఒక కోటి రూపాయలకు కనీసం ఒక్క ఉద్యోగమైనా వస్తుంది. కానీ గూగుల్ డేటా సెంటర్‌లో 15 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు పెడితే వచ్చే ఉద్యోగాలు 300 మాత్రమే. ఈ మాత్రం దానికోసం చంద్రబాబు ప్రభుత్వం వారికి 500 ఎకరాలు ఉచితంగా దారాదత్తం చేస్తోంది. ఇదో విషయం అయితే, ఆ డేటాసెంటర్ వస్తే విశాఖపట్న మొత్తానికి అవసరమైన విద్యుత్తు ఒక్క డేటా సెంటర్‌కే కావలసి వస్తుంది. విశాఖపట్నం మొత్తానికి అవసరమైన నీరు ఆ ఒక్కడేటా సెంటర్‌కే అవసరమవుతుంది. ఇంత చేసినా దాని వల్ల ఉద్యోగ కల్పన మాత్రం శూన్యం. ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థ మొత్తంగా రోబోట్లు, ఆధునిక యంత్రాల మీద ఆధారపడుతోంది గనుక అది ఉద్యోగాలు కల్పించలేకపోతోంది. అందువల్లనే ఇటువంటి పెట్టుబడిదారీ వ్యవస్థ తమకు వద్దని యువత అంటోంది. రెండో అంశం, ట్రంప్ ప్రారంభించిన టారిఫ్ యుద్ధం లేక వాణిజ్య యుద్ధం. ప్రపంచంలో వ్యాపారం బాగా జరుగుతుంటే ఆర్థిక వ్యవస్థ ముందకు పోతుంది. గత పది సంవత్సరాల నుండి ప్రపంచ వ్యాపారం బాగా దెబ్బతినిపోయింది. దాదాపు నాలుగో వంతుకు పడిపోయింది. ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడం వల్ల వ్యాపారం పడిపోయింది. ఆర్థిక మాంద్యం ఏర్పడింది. దీని వల్ల యువతకు ఉద్యోగాలు లేకుండా పోయాయి. అందువల్లనే ప్రపంచ వ్యాపితంగా అన్ని దేశాల్లో ఆందోళనలు, అల్లర్లు, సమ్మెలు ఎక్కువైనాయి. మూడో విషయం, ప్రపంచంలో అమెరికా పెత్తనం తగ్గిపోతున్నది. అమెరికా డాలరు మీద నమ్మకం పోయి అనేక దేశాల బ్యాంకులు డాలర్లను అమ్మేసి బంగారం కొని నిల్వ చేసుకుంటున్నాయి. అందుకే మార్కెట్లో బంగారం ధరలు పెరిగిపోయాయి. డాలరు పెత్తనం తగ్గడం అంటే అమెరికా పెత్తనం తగ్గడమే. డాలరు స్థానంలో ఈరోజు చైనా కరెన్సీ యువాన్ మీద క్రమంగా నమ్మకం పెరుగుతోంది.

అందుకనే అమెరికాకి చైనా మీద కోపం పెరుగుతోంది. దాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తోంది. చైనాలో సోషలిజం ఉంది. దాన్ని ఇప్పుడే దెబ్బతీయకపోతే ప్రజలకి దానిమీద, సోషలిజం మీద నమ్మకం పెరిగిపోతుందని అమెరికా భయపడుతోంది. చైనాను ఇప్పుడే దెబ్బతీయకపోతే ప్రజలు సోషలిజాన్ని కోరుకుంటారని భయపడుతోంది. చైనాను దెబ్బతీయాలంటే ఒక మార్గం దానిపై యుద్ధం చేసి దెబ్బతీయాలి. కానీ అమెరికా ఇప్పుడా పని చేయలేదు. ఎందుకంటే అమెరికా వియత్నాంలో యుద్ధం చేసింది. ఓడిపోయింది. ఆఫ్ఘనిస్తాన్‌మీద యుద్ధం చేసింది. ఓడిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో చైనా మీద యుద్ధం చేసి గెలుస్తానన్న నమ్మకం దానికి లేదు. అందుకని చైనాతో ఎవరూ వ్యాపారం చేయకుండా, దానికి ఎవరూ సహకరించకుండా, చైనాను వెలివేసి, ఒంటరి చేసి దెబ్బతీయాలని ప్రయత్నం చేస్తోంది. అందుకనే చైనా మీద అనేక ఆంక్షలు విధించింది. 135 శాతం సుంకాలు విధించింది. ప్రపంచ ఫాక్టరీగా ఉన్న చైనా సరుకులను ఎవరూ కొనకుండా చేయాలని దానిపై సుంకాలు విధించింది. కానీ చైనా సరుకులు చౌకగా ఉన్నప్పుడు ఎవరు కొనకుండా ఉంటారు? కానీ, చైనా సరుకులు కొనేవారిపై ఆంక్షలు విధిస్తానని బెదిరించి చైనాను దెబ్బతీయాలని ట్రంప్ బెదిరిస్తున్నారు. ఏదో ఒక మిషతో చైనాతో యుద్ధాన్ని సృష్టించి దాన్ని దెబ్బతీయాలని చూస్తున్నాడు. చైనాతో యుద్ధానికి ఫిలిప్పీన్స్, జపాన్, దక్షిణ కొరియా తదితర దేశాలను అమెరికా రెచ్చగొడుతున్నది. కానీ చైనాతో అత్యధిక దేశాలు మంచి సంబంధాలు పెట్టుకుంటున్నాయి. ఎందుకంటే సోషలిస్టు దేశమైన చైనా ఇతర దేశాలతో వాణిజ్యం జరపడమే కాదు ఆయా దేశాల్లో ప్రాథమిక సదుపాయాలు అంటే రైల్వేలు, వంతెనలు, రోడ్లు వంటివి నిర్మిస్తూ వాటికి తోడ్పడుతున్నది.

అందువల్ల ఈ రోజు మొత్తంగా చూసుకున్నప్పుడు పెట్టుబడిదారీ విధానానికి పెద్ద సమస్య వచ్చింది. దానిపై ప్రజలకు నమ్మకం పోతోంది. దేశాలకు నమ్మకం పోతోంది. చైనావైపు మొగ్గుచూపుతున్నారు. అందుకే అమెరికా చైనాపై కోపంగా ఉంది. ఇటీవలి కాలంలో ఎలక్ట్రానిక్ చిప్స్ తయారీలో చైనా వెనుకబడి ఉందని తెలుసుకుని దానికి చిప్స్ తయారీ టెక్నాలజీని ఇతరులు ఇవ్వకుండా ఆంక్షలు పెట్టింది అమెరికా. కృత్రిమ మేధతో టెక్నాలజీ రూపకల్పనకు ఆధునిక చిప్స్ చాలా అవసరం. అమెరికా ఆంక్షలను అధిగమించడం కోసం తన స్వంత చిప్స్‌ను మరింత మెరుగైన మార్గంలో చైనా తయారు చేసుకోవడం ప్రారంభించింది. అమెరికా కృత్రిమ మేధతో చాట్ జిపిటి తయారు చేస్తే చైనా చాలా చౌకగా

డీప్ సీక్ తయారు చేసి ప్రపంచ దేశాలకు చౌకగా ఇవ్వడం ప్రారంభించింది. ఈ రోజు ఎలక్ట్రానిక్ వాహనాలకు ఉపయోగించే బ్యాటరీలు, రోబోట్లు వ్యవసాయ రంగంలో ఉపయోగపడే బయో టెక్నాలజీ వగైరా అనేక రంగాల్లో అమెరికా కన్నా చైనా మెరుగైన టెక్నాలజీని రూపొందించి ప్రపంచానికి అందిస్తోంది. అందుకనే చైనా అంటే అమెరికాకు కోపం. దాన్ని యుద్ధంతో, ఆంక్షలతో దెబ్బతీయాలనుకుంటోంది అందుకోసమే. కానీ సాధ్యం కావడం లేదు. అందువల్లనే ఈ రోజు అమెరికా ఏం చేయాలో తోచని పరిస్థితుల్లో పడిపోయింది. అమెరికా పతనం అంచుకు చేరుకుంటోందనీ, పెట్టుబడిదారీ విధానం రోడ్డు చివరకు చేరుకున్నదని చాలా మంది ఆర్థిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పెట్టుబడిదారీ విధానం ఇంక ముందుకు పోలేని పరిస్థితి ఏర్పడింది. అందువల్లనే ప్రపంచంలో సోషలిజం పట్ల మొగ్గు పెరుగుతున్నది.

అయితే, పెట్టుబడిదారీ విధానం అంత సులువుగా తన పెత్తనాన్ని వదిలి పెట్టదు. ప్రజలు సోషలిజం వైపు ఆకర్షితులవకుండా వారి ఆలోచనలను గందరగోళ పరచడం కోసం, వారి మధ్య చీలికలు సృష్టించడం కోసం పెట్టుబడిదారీ విధానం అనేక విధాలుగా ప్రయత్నిస్తోంది. దానికోసం పెట్టుబడిదారీ వర్గం ఆయా దేశాల్లో ఉన్న అత్యంత క్రూరులు, అత్యంత నిరంకుశులను పరిపాలనలో ముందుకు తెస్తున్నది. భారత దేశంలో మోడీని ముందుకు తేవడం, అమెరికాలో ట్రంప్‌ను, ఇతర అనేక యూరోపియన్ దేశాల్లో మితవాత నాయకులను, జపాన్‌లో తకాయిచీ వంటి వారిని ముందుకు తీసుకురావడం వెనుక కారణం ఇదే. మన దేశంలో కార్పొరేట్ శక్తులన్నీ మోడీ, బిజెపి వెనుక చేరాయి. సోషలిజం పట్ల మళ్లీ అభిమానం పెరుగుతున్న తరుణంలో దాన్ని పెరగకుండా చేయడానికి కార్పొరేట్ శక్తులన్నీ మోడీ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచాయి. ఎందుకంటే బిజెపి–ఆర్ఎస్ఎస్ వాళ్లు మతం, కులం, ప్రాంతం, భాష వంటివాటిపై చర్చ లేవనెత్తి, ప్రజలను మతోన్మాదంతో రెచ్చగొట్టి, వారిలో వారు కొట్టుకునేట్లు చేయగల సమర్థులు కనుక వారికి కార్పొరేట్లు సంపూర్ణ మద్దతిస్తున్నాయి. అలాగే సైన్సు పట్ల, శాస్త్రీయత పట్ల నమ్మకం లేకుండా మూఢనమ్మకాలపట్ల నమ్మకాన్ని పెంచే పనిని కూడా ఆర్ఎస్ఎస్–బిజెపి చేయగలదు. ప్రజలు తమ మీద తమకు నమ్మకం లేకుండా అతీత శక్తుల మీద నమ్మకం కలిగి ఉండడం పెట్టిబడిదారులకు ప్రయోజనకరం కనుక వారు వాటిని ప్రోత్సహిస్తున్నారు.

కానీ ప్రజలను ఈ నమ్మకాలతో ఎంతో కాలం మోసగించలేరు. కష్టాలు, బాధలు పెరుగుతున్న కొద్దీ ప్రజల్లో ఈ నమ్మకాలు సృష్టించిన భ్రమలు తొలగిపోతాయి. ఆర్ఎస్ఎస్–బిజెపి పట్ల కూడా ప్రజలకు క్రమంగా భ్రమలు తొలగిపోతున్నాయి. 2024 ఎన్నికల్లో బిజెపికి ఓట్లు తగ్గాయి, సీట్లు కూడా తగ్గాయి. కారణం దాని పట్ల భ్రమలు తగ్గడమే. అందువల్ల క్రమేణా భారత దేశంలో కూడా మార్పు వస్తున్నదన్న విషయాన్ని మనం గమనించాలి. రాబోయే రోజుల్లో మోడీ తీసుకోబోతున్న కొన్ని నిర్ణయాలతో ప్రజల్లో భ్రమలు మరింత తొలగిపోడానికి అవకాశాలున్నాయి. రానున్న శీతాకాల సమావేశాల్లో మోడీ విద్యుత్ చట్టానికి సవరణలు తీసుకు రాబోతున్నారు. ఇప్పటి వరకు విద్యుత్ ఉత్పత్తిని అదానీ, అంబానీ వంటి ప్రయివేటు వారికి

> “ అయితే, పెట్టుబడిదారీ విధానం అంత సులువుగా తన పెత్తనాన్ని వదిలి పెట్టదు. ప్రజలు సోషలిజం వైపు ఆకర్షితులవకుండా వారి ఆలోచనలను గందరగోళ పరచడం కోసం, వారి మధ్య చీలికలు సృష్టించడం కోసం అనేక విధాలుగా ప్రయత్నిస్తోంది. దానికోసం ఆయా దేశాల్లో ఉన్న అత్యంత క్రూరులు, అత్యంత నిరంకుశులను పరిపాలనలో ముందుకు తెస్తున్నది. భారత దేశంలో మోడీని , అమెరికాలో ట్రంప్‌ను, ఇతర అనేక యూరోపియన్ దేశాల్లో మితవాత నాయకులను ముందుకు తీసుకురావడం వెనుక కారణం ఇదే. ”

**2025 New York Marxist School: Training Bolsheviks in the Capital of Capitalism**



న్యూయార్క్‌లో రివల్యూషనరీ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ అమెరికా (ఆర్‌సిఎ) రాజకీయ తరగతులకు హాజరైన యువ కమ్యూనిస్టులు

> **❝ అందువల్ల పెట్టుబడిదారీ విధానం అంటే సూటిగా చెప్పాలంటే పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చి ప్రజలకు నష్టాలపాలు చేసేది. ఇటువంటి విధానం వల్ల క్రమంగా ప్రజల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉంది. అయితే మనమొక విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. పెట్టుబడిదారీ విధానానికి భవిష్యత్తు లేదు అంటే అర్ధం అది రేపోమాపో నాశనం అయిపోతుందనికాదు. కానీపెట్టుబడిదారీ విధానం మీద క్రమంగా ప్రజల అభిమానం తగ్గిపోతున్న విషయం వాస్తవం. ❞**

ఇచ్చారు. రేపు విద్యుత్ పంపిణీ వ్యవస్థ నంతటినీ ప్రయివేటు వారికి ఇవ్వడానికి సవరణలు తెస్తున్నారు. ప్రస్తుతం స్మార్ట్ మీటర్లను హడావిడిగా బిగించడానికి కారణం అదే. గతంలో జగన్మోహన రెడ్డి ప్రభుత్వం హడావిడిగా స్మార్ట్ మీటర్లు బిగించింది. ఇప్పుడు చంద్ర బాబు ప్రభుత్వం అదే చేస్తోంది. అదానీలు, అంబానీలు పంపిణీ రంగంలోకి రావాలంటే వారికి స్మార్ట్ మీటర్లు కావాలి. ఇప్పుడు మోడీ ప్రభుత్వం ఏకంగా చట్టమే చేయబోతున్నది. ఈ చట్టం వస్తే రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చే పరిస్థితి ఉండదు. పేద వాళ్లకు రెండువందల యూనిట్ల వరకు క్రాస్ సబ్సిడీ ఇస్తున్నారు. అది ఎగిరిపోతుంది. ఇప్పుడు ప్రభుత్వం వేసిన ప్రభుత్వ విద్యుత్ లైన్లను ప్రయివేటు వాళ్ళు వాడుకుంటారు. తెలంగాణాలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో ఎత్తుగడ వేసింది. సబ్సిడీ ఇచ్చే విద్యుత్ కనెక్షన్లన్నిటికీ వేరుగా విద్యుత్ కంపెనీ పెడుతున్నారు. అంటే సబ్సిడీలు ఇచ్చే కనెక్షన్లను ప్రభుత్వం వద్ద ఉంచుకుని, డబ్బులు సంపాదించే కనెక్షన్లను ప్రయివేటు వారికి అప్పగించేస్తారన్నమాట. ఇటువంటి ప్రమాదకరమైన సంస్కరణలు రాబోతున్నాయి. విద్యుత్ అనేది అందరికీ అత్యవసరమైనది. టాటా దగ్గరినుండి పేదవానివరకు అది లేకపోతే గడవదు. అలాంటప్పుడు గూగుల్ వంటి డేటా సెంటర్‌కు విద్యుత్ అంతా ఇచ్చివేస్తే ప్రజలకు ఏం మిగులుతుంది. రానున్న కాలంలో రాష్ట్రంలో మరో 3500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తామని చంద్ర బాబు నాయుడు చెప్పడం దీనికోసమే.

అందువల్ల పెట్టుబడిదారీ విధానం అంటే సూటిగా చెప్పాలంటే పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చి ప్రజలకు నష్టాలపాలు చేసేది. ఇటువంటి విధానం వల్ల క్రమంగా ప్రజల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉంది. అయితే మనమొక విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. పెట్టుబడిదారీ విధానానికి భవిష్యత్తు లేదు అంటే అర్ధం అది రేపోమాపో నాశనం అయిపోతుం దని కాదు. కానీ పెట్టుబడిదారీ విధానం మీద క్రమంగా ప్రజల అభిమానం తగ్గిపోతున్న విషయం వాస్తవం. అటువంటి పరిస్థితుల్లో ప్రజలు ముఖ్యంగా యువతరం పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయ మార్గాలను వెదుక్కుంటారని మనం అర్ధం చేసుకోవాలి.

చివరిగా మనం చెప్పుకోవలసింది, సోషలిజం వస్తే ప్రజలకు ఏం జరుగుతుంది అని. సోషలిజం వస్తే కార్మికులు, రైతులు, ఇతర కష్టజీవుల హక్కులు పూర్తిగా సంరక్షించబడతాయి. ఈ రోజు మోడీ ప్రభుత్వం యూనియన్లను లేకుండా చేస్తేస్తోంది. సమ్మెహక్కు తీసేస్తోంది. బోనస్‌లు లేకుండా చేస్తోంది. పనిగంటలు పెంచుతోంది. ఆధునిక యంత్రాలు వస్తే పెట్టుబడిదారీ విధానంలో కార్మికులను పనుల్లోనుండి తొలగిస్తారు. కానీ, సోషలిజంలో యంత్రాలు వచ్చాక, కార్మికుల పనిగంటలు తగ్గుతాయి, పనులు పోవు. మిగిలిన గంటలు విశ్రాంతి, వినోద, సాంస్కృతిక అభివృద్ధికి వెచ్చించు కోవచ్చు. సోషలిజంలో రైతులకు భూమి గ్యారంటీ ఉంటుంది, వ్యవసాయ కార్మికులకు భూమి ఇస్తుంది. రష్యాలో 1917లో సోషలిస్టు విప్లవం వచ్చినం వెంటనే ప్రజలందరికీ తిండి గ్యారంటీ, భూమి, శాంతి గ్యారంటీ చేస్తూ లెనిన్ ప్రకటన చేశాడు. భూస్వాముల దగ్గరున్న లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిపెట్టాడు. యుద్ధంలో ఉన్న రష్యాలో యుద్ధాన్ని ఆపేసి ప్రజలకు శాంతి సమకూర్చాడు. అందుకని ఈ రోజు మనకు సోషలిజం వస్తే ప్రజలందరికీ హక్కులు గ్యారంటీ చేయబడతాయి. కార్మికులకు పని గ్యారంటీ, రైతులకు ధరలు గ్యారంటీ, యువతకు ఉద్యోగాలు గ్యారంటీ చేయబడతాయి. సోషలిజంలో చదువు కొనక్కోవడం ఉండదు. అందరికీ ప్రభుత్వం ఆధునిక ఉచిత విద్య అందిస్తుంది. అలాగే సోషలిజంలో డబ్బులేకపోతే వైద్యం లేదు అనే పరిస్థితి ఉండదు. వైద్యం ఒక హక్కుగా ఉంటుంది. గృహవసతి హక్కుగా ఉంటుంది. మన రాజ్యాంగంలో వీటిని ఆదేశిక సూత్రాల్లో రాశారు. అంటే ఇస్తే ఇవ్వొచ్చు లేకపోతే లేదు. అందుకనే అప్పుడప్పుడు పథకాల రూపంలో ఇస్తూ ఉంటారు. కానీ సోషలిజంలో అలా కాదు. ఇవన్నీ రాజ్యాంగ హక్కులుగా మనకు అందుతాయి. అంతే కాకుండా స్త్రీలకు పురుషులతో సమానమైన హోదా సోషలిజంలోనే లభిస్తుంది. ఉదాహరణకు సోషలిస్టు చైనాలో పనిచేసే వాళ్లల్లో 72 శాతం మంది పురుషులు కాగా మహిళలు 70 శాతం మంది ఉన్నారు. అంటే దాదాపు పురుషులతో సమానంగా స్త్రీలు పనిచేస్తున్నారు. కానీ మన దేశంలో పురుషుల్లో 71 శాతం మంది పనిచేస్తుండగా మహిళలు కేవలం 14 శాతం మంది మాత్రమే పనిచేస్తున్నారు. అందువల్ల ఆడవాళ్లను మన దేశంలో ఇంటికే పరిమితం చేస్తున్నారు. మన దేశంలో ఇంకో సమస్య కూడా ఉంది. అది కుల వ్యవస్థ. ఈ కుల వ్యవస్థ మూలంగా మనం శ్రమ చేసేవారిని గౌరవించడం లేదు. పనిచేయని వారికి ఇక్కడ గౌరవం ఎక్కువ. కష్టపడేవారికి గౌరవం తక్కువ. మన దేశంలో పాయిఖాన పనిచేసేవారు, రోడ్లు శుభ్రం చేసేవారిలో ఇంకా దళితులు ఎక్కువ మంది ఉంటారు. అటువంటి వారికి తక్కువ వేతనం ఇస్తారు. హీనంగా చూస్తారు. కానీ సోషలిజంలో ఈ పనులు చేసేవారికి అధిక వేతనాలు ఇస్తారు. అందువల్ల వారికి గౌరవం పెరుగుతుంది. పిల్లలను చది వించుకుంటారు. ఆ విధంగా సమాజంలో ఉన్నత స్థానాలకు ఎదిగే అవకాశం వారికి లభిస్తుంది. స్త్రీలకు పనిచేసేందుకు అవకాశాలు కల్పించని దేశం, పనిచేసేవారికి గౌరవం ఇవ్వని దేశం సూపర్ పవర్‌గా ఎదిగే అవకాశం ఉండదు.

అందువల్ల మన దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఎప్పుడు పోతుంది, సోషలిజం ఎప్పుడు వస్తుంది అనే ప్రశ్నకు సమాధానం కన్నా పెట్టుబడిదారీ వ్యవస్థ ఉండాలా, సోషలిజం ఉండాలా అన్న ప్రశ్నకు సమాధానం ముఖ్యమైనది. పెట్టుబడిదారీ వ్యవస్థ మన సమస్యలను పరిష్కరించేలేదు, సోషలిజంలో మాత్రమే మన సమస్యలు పరిష్కారం అవుతాయి అన్న విషయాన్ని గ్రహించాలి. ఆ నమ్మకంతో మనం మన దేశంలో సోషలిజాన్ని సాధించుకోడానికి ఉద్యమాలను ముమ్మరం చేయడం కోసం, ప్రజలకు ఈ విషయాలు తెలియజేయడం కోసం మనకు ఎంత సమయం వీలైతే అంతసమయాన్ని వెచ్చించాలి. *

శ్రామిక వాణి

# కార్మికులకు ఏ హక్కులూ లేకుండా చేసే కుట్ర

ఎస్ వీరయ్య



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, తెలంగాణా రాష్ట్ర కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు

"శ్రమ శక్తి నీతి - 2025" పేరుతో మోడీ ప్రభుత్వం కార్మిక విధానం ముసాయిదాను ప్రకటించింది. ఇప్పటికే 29 కార్మిక చట్టాలను రద్దు చేసింది. వాటి స్థానంలో కోరలు లేని నాలుగు లేబర్ కోడ్స్ విడుదల చేసింది. ఇప్పుడు " శ్రమ శక్తి నీతి" పేరుతో విధానం రూపొందించవలసిన అవసరం ఏమిటి? అంతేకాదు, నేటి శ్రమ శక్తికి సంబంధించిన విలువల మూలాలు స్మృతులలోను, కౌటిల్యుని అర్థశాస్త్రంలోనే ఉన్నాయని కూడా చెప్పింది. కార్మిక శాఖ బాధ్యతలకు సంబంధించిన అనేక ప్రశ్నలను ముందుకు తెచ్చింది. ఇప్పటి వరకు కేంద్ర కార్మిక సంఘాల భాగస్వామ్యంతో నిర్వహించే ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సహకారంతో కేంద్ర ప్రభుత్వం కార్మిక విధానం రూపొందించేది. ఇప్పుడు అలాంటి ప్రయత్నమేమీ లేకపోగా కనీసం కేంద్ర కార్మిక సంఘాలను సంప్రదించ లేదు. ప్రజాస్వామ్య బద్ధంగా జరగవలసిన సంప్రదింపుల ప్రక్రియను కూడా పక్కనబెట్టి ఇంతటి కీలకమైన విధానం ప్రకటించవలసిన అవసరం ఏమొచ్చింది? ఇవన్నీ లోతుగా పరిశీలించటం అవసరం.

స్వాతంత్ర్యానికి ముందు భారతదేశంలో చాలాకాలం కార్మికుల కోసం చట్టాలు లేవు. కార్మికుల సమస్యల మీద కంపెనీ యజమాని చేసే నిర్ణయం న్యాయమూర్తి తీర్పుతో సమానం. ప్రపంచంలో పరిశ్రమల అభివృద్ధితో పాటు కార్మికులు యంత్రాలకు కట్టిపడేసిన బానిసలుగా పనిచేసే విధానం కూడా మొదలైంది. రోజుకు 16-18 గంటల వరకు పని చేయవలసి వచ్చేది. క్రమంగా కార్మికవర్గం 8 గంటల పనిదినం కోసం గళమెత్తింది. 8 గంటలు పని, 8 గంటలు వినోదం, 8 గంటలు విశ్రాంతి అన్న నినాదం ముందుకొచ్చింది. 1917లో రష్యన్ విప్లవం మానవజాతి చరిత్రలో ఒక పెద్ద మలుపు. కార్మికవర్గమే అధికారంలోకి వచ్చింది. చరిత్రలో మొదటిసారి 8 గంటల పనిదినం చట్టబద్ధమైంది. కార్మికవర్గం కోసం ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీ రాజ్యాధికారంలోకి రావటం, శ్రామికులకు అనుకూలమైన చట్టాలు చేయటం ప్రపంచ వ్యాపితంగా పెద్ద ప్రభావమే చూపింది. ఈ నేపథ్యంలోనే అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో కూడా ఇలాంటి తిరుగుబాట్లు రాకుండా చూడటం కోసం తామే కార్మికులకు హక్కులు కల్పిస్తామనే భ్రమలు కల్పించటం మొదలైంది. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ కూడా ఆవిర్భవించింది. ఇందుకు అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు కూడా సహకరించాయి. ఈ పరిణామాల ప్రభావం భారతదేశం మీద కూడా ఉన్నది. కార్మికోద్యమం ఊపందుకున్నది. ట్రేడ్ యూనియన్ చట్టంతో సహా కొన్ని కార్మిక చట్టాలు సాధించుకున్నది. స్వాతంత్ర్యానంతరం ఈ ప్రక్రియ మరింత ముందుకు సాగింది. కార్మిక మంత్రిత్వ శాఖ ఏర్పడింది. కార్మిక చట్టాలు అమలు జరిగేటట్టు చూడటం, తనిఖీలు చేయటం, కార్మిక వివాదాలలో జోక్యం చేసుకొని యాజమాన్యానికి, కార్మిక సంఘాలకు మధ్య మధ్యవర్తిత్వం చేయటం, తీర్పులివ్వటం వంటి బాధ్యతలు చూస్తున్నది. అంటే కార్మిక శాఖ అధికారులు గానీ, మంత్రులు గానీ, కార్మికులకు న్యాయం చేయడం కోసం కృషి చేయాలి. కానీ,1990వ దశకం నుండి సరళీకృత ఆర్థిక విధానాలు మొదలైన తర్వాత క్రమంగా కార్మిక శాఖ ఆచరణలో యజమానుల శాఖగా మారుతున్నది. యజమానులే కార్మిక శాఖ మంత్రులుగా అవతారమెత్తుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, విభజనానంతరం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇదే తంతును గమనించవచ్చు. ఇప్పుడు శ్రమశక్తి నీతి-2025 పేరుతో కేంద్ర ప్రభుత్వం కార్మిక శాఖను యజమానుల శాఖగా స్థిరీకరించడానికి పూనుకున్నది.

ఈ విధాన పత్రంలో తనిఖీల వ్యవస్థకు కాలం చెల్లిందని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. దీనికి సాంకేతిక అంతరాలు తోడై ఏకీకృత జాతీయ చట్రం అవసరం ఏర్పడిందని మోడీ ప్రభుత్వం చెప్తున్నది. కార్మిక చట్టాలు అమలులో ఉండగానే 8 గంటల పనిదినం స్థానంలో 12 గంటల పనిదినం అమలులోకి వచ్చింది. కాంట్రాక్టీకరణ విస్తరించింది. ఏ కంపెనీ చూసినా దాదాపు సగం మంది వలస కార్మికులే. కనీస వేతనాలు గానీ, సమాన పనికి సమాన వేతనం గానీ, వేతన చెల్లింపుల చట్టం గానీ, ఇఎస్ఐ, పి.ఎఫ్ లాంటి సంక్షేమ చట్టాలు గానీ సక్రమంగా అమలు కావడంలేదు. కార్మిక చట్టాలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. తనిఖీలు చేసి యజమానులను కట్టడి చేయవలసిన కార్మిక శాఖ యజమానుల సేవలో తరిస్తున్నది. తనిఖీల వ్యవస్థకే కాలం చెల్లిందని ఇప్పుడు మోడీ ప్రభుత్వం చెప్పేసింది. అంటే కార్మికుల హక్కులు, సంక్షేమం యజమానుల దయాదాక్షిణ్యాలకు వదిలివేయటమే. భారత రాజ్యాంగంలో కార్మికశాఖ ఉమ్మడి జాబితాలో ఉన్నది. కానీ, ఇప్పుడు ఏకీకృత జాతీయ చట్రం పేరుతో కేంద్రం పట్టు బిగిస్తున్నది. రాష్ట్రాల్లో ప్రజానుకూల ప్రభుత్వాలు ఎక్కడైనా ఏర్పడినా కార్మికవర్గం కోసం సానుకూలంగా వ్యవహరించే అవకాశాలు పరిమితం చేస్తున్నది. కార్మిక హక్కులు, సంక్షేమం అమలు జరిగేటట్టు చూడటం కార్మికశాఖ బాధ్యత. కానీ ' ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ' కోసమే శ్రమశక్తి నీతి రూపొందించామని ఈ విధాన పత్రంలో చెప్పారు. అంటే, వ్యాపారాన్ని సులభతరం చేయడం కోసం తప్ప, కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం ఇక నుండి కార్మిక శాఖ పనిచేయదు. కార్మికుల ప్రయోజనాల కోసం కాకుండా వ్యాపార ప్రయోజనాల కోసం పనిచేస్తుందన్నమాట! ఈ విధానంలో అటు యజమానులకు, ఇటు కార్మికులకు పట్టు విడుపులకు అవకాశం ఉంటుందట! అంటే ఏమిటి? యజమానుల ఇష్టానుసారం కార్మికులను ఎప్పుడైనా తొలగించవచ్చు. కార్మికులు

**" శ్రమ గురించిన భారతీయ భావన భిన్నమైనదని ఈ విధాన పత్రంలో చెప్పారు. శ్రమ ఫలితం ప్రపంచంలో ఎక్కడైనా ఒక్కటే. సంపద సృష్టించటం, అభివృద్ధి చేయటమే దాని పని. కానీ శ్రమ గురించిన భారతీయ భావన ఆర్థిక కోణాన్ని మించి ఉన్నదని మోడీ ప్రభుత్వం చెబుతున్నది. భారతదేశ కార్మికులు శ్రమించ టాన్ని తమ నైతిక బాధ్యతగా భావిస్తారట! అంటే వేతనాల గురించి అడగవద్దన్నమాట! "**

ఎప్పుడైనా రాజీనామా చేసి వెళ్ళిపోవచ్చు. ఇరుపక్షాలకు సమాన అవకాశాలు. దీని మర్మమేమిటో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదుగదా! ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించవలసి వచ్చినప్పుడు కొంత మంది కార్మికుల తొలగింపు అనివార్యమని కూడా చెప్పారు. కార్మిక శాఖ ఉపాధికి వెసులుబాటు కల్పించే (ఫెసిలిటేటర్) బాధ్యత తీసుకుంటుం దంటున్నారు. అంటే, ఉపాధి కల్పించడం కాదు. ఉపాధి అవకాశాల సమాచారం అందజేసే ఏజెన్సీగా ఉంటుంది. ఈ పేరుతో కార్మికవర్గం కోసం కార్మిక మంత్రిత్వశాఖ ప్రత్యేకంగా అవస రం లేదని ప్రభుత్వం చెప్పకనే చెబుతున్నది.


శ్రమ గురించిన భారతీయ భావన భిన్నమైనదని ఈ విధాన పత్రంలో చెప్పారు. శ్రమ ఫలితం ప్రపంచంలో ఎక్కడైనా ఒక్కటే. సంపద సృష్టించటం, అభివృద్ధి చేయటమే దాని పని. కానీ శ్రమ గురించిన భారతీయ భావన ఆర్థిక కోణాన్ని మించి ఉన్నదని మోడీ ప్రభుత్వం చెబుతున్నది. భారతదేశ కార్మికులు శ్రమించ టాన్ని తమ నైతిక బాధ్యతగా భావిస్తారట! అంటే వేతనాల గురించి అడగవద్దన్నమాట! అర్థించటమే తప్ప హక్కుగా భావించకూడ దన్నమాట! ఈ విధానం వల్ల సమాజంలో సామరస్యం, ఆర్థిక శ్రేయస్సు, సమిష్టి అభివృద్ధి సాధ్యమౌతుందని మోడీ ప్రభుత్వం సుద్దులు చెబుతున్నది. ఈ విధాన పత్రంలో కౌటిల్యుని అర్థశాస్త్రాన్ని కూడా ప్రస్తావించింది ఇందుకే నేమో! " లాభాలు ఆర్జించేవాడు చేసే పనిలో అన్ని కార్యాలూ సరైనవే " అంటాడు కౌటిల్యుడు. అంటే, ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అధిక లాభాలు గడించేందుకు యజమానుల ప్రయత్నంలో కార్మికుల పట్ల అనుసరించే విధానాలన్నీ సరైనవేనని కార్మికులు ఒప్పుకోవాలి. కౌటిల్యుడి అర్థశాస్త్రం చెప్పిందిదే కదా! అందుకే మోడీకి కూడా నచ్చింది. యజమానుల లాభార్జనకోసం ఏం చేసినా ప్రశ్నించవద్దంటున్నారు. తలవంచుకొని పనిచేయాలంటున్నారు. 'యజమాని– కార్మికు లు' అన్న సంబంధం ఈ విధాన పత్రంలో వెతికినా కన్పించదు. సహజంగానే ఒప్పందా లకు ఇక తావులేదు. ద్వైపాక్షిక, త్రైపాక్షిక చర్చలు, ఒప్పందాలు ఇక గతకాలపు జ్ఞాపకాలే. కార్మికుల సంక్షేమం గురించి యాజమాన్యాలు స్వచ్ఛందంగా బాధ్యతలు తీసుకుంటాయట! ఇది కార్మికులు నమ్మాలట! ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త మాధవ్ సదాశివగోల్వాల్కర్ చెప్పిన సిద్ధాంతాన్నే ఇప్పుడు మోడీ ప్రభుత్వం ఈ విధాన పత్రంలో చొప్పించింది. కార్మికుల సంక్షేమం చూసుకునే విధంగా యజమానుల మానసిక పరివర్తన కోసం కృషి చేయాలని గోల్వాల్కర్ చెప్పాడు. దీనికోసం కార్మిక చట్టాలు కానీ, వాటిని అమలు చేసే యంత్రాంగం గానీ ఇక అవసరం లేదు. ఇప్పుడు మోడీ ప్రభుత్వం కూడా ఇదే చెబుతున్నది. యాజమాన్యాలకు నిరంతరం అవగాహనా కార్యక్రమాలను ప్రభుత్వమే నిర్వహిస్తుందట! ఇంతటి కీలకమైన విధానపత్రం రూపొందించే ముందు కేంద్ర కార్మిక సంఘాలను సంప్రదించలేదు. స్వతంత్ర భారత దేశంలో ప్రభుత్వాలు ఎప్పుడూ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించ కుండా ఇలాంటి మౌలిక మార్పులు చేయలేదు. కానీ, మోడీకి కార్మిక సంఘాలతో సంప్రదిం పులు గిట్టవు. అందుకే కేంద్రంలో మోడీ నాయకత్వంలో బి.జె.పి. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ఊసు లేదు. ప్రభుత్వమే ఏకపక్షంగా విధానం రూపొంది స్తున్నది. ముసాయిదా పత్రం విడుదల ఒక తంతు మాత్రమే. దీని అమలుకోసం మాత్రం త్రైపాక్షిక కమిటీలు వేస్తారట! ఈ కమిటీలో ప్రభుత్వ, యాజమాన్య ప్రతినిధులతోపాటు కార్మిక ప్రతినిధి కూడా ఉంటారు. యజమా నులకోసం రూపొందించిన ఈ విధానాన్ని అమలు జరిగేటట్టు చూసే బాధ్యత ఈ కమిటీది. కార్మికుల సమస్యల గురించి ఈ కమిటీ చర్చోపచర్చలు చేస్తుంది. కో–ఆపరేటివ్ ఫెడరలిజం పేరుతో ఈ కమిటీలో చర్చలే తప్ప కార్మికుల పోరాటానికి స్థానం లేదు. దీని పర్యవసానాలు అర్థం కానివేమీ కాదు.

ఈ విధానాలకు ప్రాతిపదిక స్మృతులలోనే ఉన్నదని చెప్పారు. మనుస్మృతి, యాజ్ఞవల్క్య స్మృతి, నారదస్మృతి, శుక్రనీతిలోనే ఆధునిక శ్రమ శక్తి విధానానికి సంబంధించిన మూలాలు న్నాయని చెప్పుకొచ్చారు. రాజధర్మం ప్రాతిపది కగానే శ్రమశక్తి నీతి రూపొందిం చామన్నారు. అందుకేనేమో.... స్వాతంత్ర్యా నంతరం తొలి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పురావస్తు శాలలో భద్రపరిచిన రాజుల కాలం నాటి రాజదండాన్ని మోడీ ప్రభుత్వం పార్లమెంటులో పెట్టింది. రాచరికాలకు కాలం చెల్లిందని, ఇక నుండి భారతదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ అమలులో ఉంటుందని నెహ్రూ భరోసా ఇచ్చా రు. ఇందుకు భిన్నంగా తమ పాలన రాచరికాన్నే పోలి ఉంటుందని రాజదండాన్ని ముందుకు తేవడం ద్వారా మోడీ ప్రభుత్వం తేల్చి చెప్పింది. స్మృతులలో శ్రమ సంబంధాల గురించి కూడా ఉంటుందన్నది నిజమే. కానీ, అది ఆ కాలం నాటికి సంబంధిం చినది. క్రీ.పూ. 2 శతాబ్దం నుండి క్రీ.శ. 6వ శతాబ్దం మధ్య స్మృతులు గ్రంథస్థమైనాయని చరిత్రకారులు అంచనా వేశారు. మనుస్మృతి 2వ శతాబ్దం తర్వాత రూపొందిందని కూడా అంచనా. అంటే, సమాజంలో భూస్వామ్య సంబంధాలు బలపడుతున్న కాలంలో ఉన్న శ్రమ సంబంధాలవి. నేడు ఆధునిక సమాజంలో ఉ న్నాం. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం కృత్రిమ మేధస్సు స్థాయికి చేరుకున్నది. నాలుగు పారిశ్రామిక విప్లవాలు దాటి 5వ పారిశ్రామిక విప్లవం వైపు అడుగులు వేస్తున్నాం. పెట్టుబడి దారీ వ్యవస్థ ప్రపంచీకరణ దశకు చేరింది. కుల, మతాలతో సంబంధం లేని ఉత్పత్తి రంగంలోకి వచ్చింది. తొలి పారిశ్రామిక విప్లవ కాలంలో ముందుకొచ్చిన నినాదం 8 గంటల పనిదినం. నేడున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఫలితంగా ఉత్పత్తి, లాభాలు అనేక రెట్లు పెరిగాయి. సహజంగానే నైతిక బాధ్యత, కుల వృత్తి స్థానంలో కార్మికుల హక్కులు ముందుకొచ్చాయి. మనుస్మృతి ప్రకారం బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలున్నాయి. శూద్రులే శ్రామికులుగా పనిచేస్తారు. ఇప్పుడు ఆధునిక సమాజంలో, కార్మికులంతా "శూద్ర" కులాల నుంచే ఉండరు కదా! బ్రాహ్మణ కుటుం బీకులు కూడా కార్మికులుగా పనిచేస్తున్నారు. "చాకలి తదితర నీచ జాతులతో కూడి ఉండ రాద"ని మనుస్మృతి 4వ అధ్యాయంలో, 81వ

(మిగతా 22వ పేజీలో)

ఈ మాసం ప్రత్యేకం

# సోషలిజానికి పురోగమనమా ఆటవికతకు తిరోగమనమా



రచయిత అమెరికాలోని మసాచుసెట్స్ యూనివర్సిటీలో చరిత్ర పరిశోధకుడు, సామాజిక కార్యకర్త, రచయిత

**ఎరిక్ రోజ్**

మొదటి ప్రపంచయుద్ధంలో జరుగుతున్న మానవ మారణ హోమానికి వ్యతిరేకంగా ఏ మాత్రం రాజీలేకుండా పోరాటం చేసినందుకు రోజా లగ్జెంబర్గ్‌ను నిర్బంధించారు. ''పెట్టుబడిదారి విధానం ఆటవికతకు తిరోగమించటమా లేక సోషలిజానికి పురోగమించటమా అన్న సంధికాలంలో ఉన్నది'' అని జైలు నుండి రోజా లగ్జెంబర్గ్ ఒక శతాబ్దానికి ముందే హెచ్చరించారు. ఆమె చేసిన హెచ్చరిక ప్రాధాన్యత ఈ రోజుకూ తగ్గలేదు.

అమెరికాలో చాలా కాలానికి ముందే మనం అటవికతకు సాగిపోయే మార్గాన్ని ఎంచుకున్నాం. మన పతనానికి ట్రంప్, ఆయన మద్దతుదారులే ప్రేరకులు. వారే దానికి ప్రధాన కారణం, ఆ ధోరణికి సంబంధించిన లక్షణాలను వ్యక్తం చేసేవారూను. ప్రపంచాన్ని చుట్టుముడుతున్న పర్యావరణ విధ్వంసం, అసాధారణంగా పెరుగుతున్న అసమానతలు, అంతం లేని యుద్ధాలు పొరపాటుగా సంభవిస్తున్నవి కావు. హింసాపూరితంగా దోపిడిపై ఆధారపడిన, ప్రజల సంక్షేమం కన్నా లాభాలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్న పెట్టుబడిదారీ విధానపు సహజ పర్యవసానాలే ఇవి.

మన జాతీయ జీవనంలో ఆర్థిక పరిస్థితులు భరింపశక్యం కాని స్థితికి చేరాయి. ప్రజాస్వామ్యాన్ని వమ్ము చేయడం, మానవత్వాన్ని హరించటంతో పాటు మన సంస్థలు, భూగోళాన్ని వినాశనం వైపు తీసుకెళుతున్నాయి. ఈ రోజు మనం సామూహికంగా ఆత్మహత్యలు చేసుకోవలసిన పరిస్థితిలో ఉన్నాం. ఇందుకు ఏది కారణమంటే అది అణు విధ్వంసం కావచ్చు, పర్యావరణ విలయం కావచ్చు, లేదా కృత్రిమ మేధ ద్వారా జరిగే వినాశనం కావచ్చు, ఎవరూ స్పష్టంగా విశ్లేషణ చేయలేకపోతున్నారు.

అంతా విధికి వదిలివేసి, ఇలాగే జరుగుతుందని భావించటం సరైంది కాదు. మన దేశం, ప్రపంచం ప్రత్యామ్నాయ మార్గంలో ప్రయాణించటం సాధ్యమే. అమెరికా ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని, విధ్వంసాన్ని నివారించాలి. ఆ విధంగా చేస్తే ఈ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా రోజా లగ్జెంబర్గ్ సూచించిన సోషలిజం మనకు అత్యంత ఆశావహంగా, అంతిమ లక్ష్యంగా ఉంటుంది.

న్యూయార్క్ నగర మేయర్‌గా పోటీ చేస్తున్న జోహ్రాన్ మమ్దాని (ఎన్నికలలో మేయర్‌గా ఆయన ఘన విజయం సాధించాడు-సంపాదకుడు) ఈ అంశాలను సజీవంగా ప్రచారం చేస్తున్నాడు. నిరాశామయమైన రాజకీయ పరిస్థితులలో అతను నిజమైన ఆశాకిరణంలా కనిపిస్తున్నాడు. అతడు చేస్తున్న ప్రచారానికి ఉన్నత వర్గాల నుండి తీవ్ర వ్యతిరేకత ఎదురౌతున్నది. ఇస్లాం వ్యతిరేక ప్రచారం, గుత్తాధిపతుల ధనాన్ని, రహస్య కుట్రలను ఆయన ఎదుర్కొంటున్నాడు. న్యూయార్క్‌లో ప్రజల జీవితాన్ని మెరుగుపరచడానికి అవసరమైన నిధుల కోసం ధనికులపై ఎంత పన్ను పెంచాలని తాను భావిస్తున్నారో దానికన్నా చాలా ఎక్కువగా తనకు వ్యతిరేకంగా ప్రచారం చేయటానికి ఖర్చు చేస్తున్నారని మమ్దాని గమనించాడు. ట్రంప్ ఈ ప్రచారంలో పూర్తిగా మునిగిపోవటం ఏ మాత్రం ఆశ్చర్యం కలిగించదు. డెమొక్రటిక్ పార్టీ నాయకత్వం పిరికిపందల్లా మౌనంగా, ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

మమ్దానిపై వ్యతిరేకత కేవలం "సోషలిస్టు" అన్న ముద్ర వలన మాత్రమే కాదు. సోషలిజం కాగితాలపై బాగానే ఉంటుంది కానీ ఆచరణలో ఉపయోగపడదనే మాటలను ప్రతి అమెరికన్ వినే ఉంటాడు. పెట్టుబడిదారీ విధానం పని చేస్తుంది అనేది ఈ వాక్యానికి ట్యాగ్‌లైన్‌గా ఉంటుంది. విపరీతంగా సంపద పోగుచేసుకున్న పాలకవర్గాలు తమ అధికారాన్ని మరింత విస్తరింపజేసుకోవటానికి దానిని ఉపయోగించుకొంటారు. వారి ప్రయోజనాలకు అనుగుణంగానే పెట్టుబడిదారీ విధానం పని చేస్తుంది. 2010లో సుప్రీంకోర్టు ప్రత్యేకంగా ఇచ్చిన సిటిజెన్స్ యునైటెడ్ డెసిషన్ తర్వాత ఎన్నికలలో ప్రైవేటు పెట్టుబడులు చెప్పలేనంత ఎక్కువ ఆధిపత్యాన్ని నెరపుతున్నాయి. కార్పొరేట్ల ధన ప్రవాహంలో సామాన్యుల గొంతుకలు మునిగిపోతున్నాయి.

మమ్దాని తన ఎన్నికల ప్రచారంలో పెట్టుబడిదారీ విధానాన్ని విమర్శించటం కాకుండా, నిజమైన ప్రజాస్వామ్యానికై పట్టుపట్టటం.. యథాతథ పరిస్థితులు కొనసాగాలని కోరుకుంటున్న పెట్టుబడిదారులకు కలవరం కలిగించింది. ప్రపంచంలో కెల్లా సంపద్వంతమైన దేశంలోని అత్యంత ధనిక నగరంలోని ప్రతివ్యక్తీ మౌలిక వసతులు పొందటానికి అర్హత కలిగివున్నాడన్న ( దేశవ్యాపితంగా కూడా ప్రతివారికీ ఆ హక్కు ఉన్నది) సాధారణాంశాల ప్రాతిపదికగా ఆయన ప్రచారం సాగింది. ఆయన ''తీవ్రవాద'' అజెండాను ముందుకు తేలేదు. ప్రత్యేక హక్కులు ఉన్న కొందరికే కాకుండా రాజకీయాలు అందరికీ ఉపయోగపడాలని, ప్రజాస్వామ్యం కేవలం వాగాడంబరంగా మాత్రమే కాకుండా వాస్తవరూపం ధరించాలని చేసిన ప్రచారం రాజకీయ పార్టీల నాయకత్వాన్ని ఆందోళనకు గురి చేసింది.

నవంబరు ఎన్నికలలో మమ్దాని ఓడిపోవచ్చు లేదా గెలవవచ్చు. కానీ, చాలాకాలం నుండి మరుగునపడి ఉన్న సాంప్రదాయ అమెరికన్ వామపక్ష రాజకీయనిప్పు కణికలను తిరిగి రగిలించటానికి ఆయన దోహదం చేస్తున్నాడు. ఈ దేశంలో సోషలిజాన్ని తిరిగి పునరుద్ధరించాలంటే ఎరుపంటే ఉన్న భయం, ప్రచ్ఛన్నయుద్ధ కాల మానసిక స్థితి అయిన "ఎరుపు రంగుకు మారటం కన్నా చావటం నయం" అన్న మానసిక రోగం (హిస్టిరియా) నుండి బయటపడాలి. చాలా

> **“ తర్వాతి దశాబ్దాలలో ఈగెన్ వి డెబ్స్ నాయకత్వంలో వామపక్ష సోషలిస్టులు సంఘటితం కావటానికి ప్రయత్నిం చారు. ఆయన సిద్ధాంతాలను అధ్యయనం చేయటం ద్వారా కాక, అమెరికన్ రైల్వే యూనియన్‌లో సంపాదించిన అనుభవం ద్వారా సోషలిజం వైపుకు వచ్చాడు. “ప్రతి బాయ్‌నెట్ పోటు, ప్రతి రైఫిల్ నుండి వచ్చే మెరుపు వర్గ పోరాటాన్ని తీవ్రం చేస్తాయి. సోషలిజాన్ని ఆ పేరుతో పిలుస్తారని నాకు తెలియనప్పటికీ, ఇది నా మొదటి ఆచరణాత్మక పాఠం” అని ఆయన చెప్పాడు. ”**

కాలం నుండి మన జాతీయ అనుభవాలలో, ప్రజాస్వామ్య పరిశోధనలలో సోషలిజం భాగంగా ఉన్నది. భవిష్యత్‌లో ప్రజాస్వామ్య సోషలిజంలో భాగంగా ఉంటేనే 21వ శతాబ్దంలో ప్రజాస్వామ్యం బతుకుతుంది.

**అమెరికన్ సోషలిజం పునాదులు**

19వ శతాబ్దం చివరి, 20వ శతాబ్దం ప్రారంభంలో జరిగిన భారీ వలసలతో అమెరికా సంయుక్త రాష్ట్రాలలోకి లక్షలాది మంది కార్మికులు వలస వచ్చారు. వారితో పాటు యూరప్‌లో చిగురిస్తున్న అతివాద భావాలను కూడా తీసుకొచ్చారు. కానీ అటువంటి భావాలు ఈ దేశానికి బయటివి కావు. కార్మిక సంఘాల పెరుగుదల, వామపక్ష రాజకీయాలు విదేశాల నుండి దిగుమతి అయినవి కావు. అమెరికాలో పారిశ్రామిక పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి క్రమంలో ఎదుర్కొన్న భయానక జీవన పరిస్థితుల ఉప ఉత్పత్తులుగా అవి ఇక్కడ ఆవిర్భవించాయి.

అమెరికా 1900 సంవత్సరానికి తన యూరోపియన్ పోటీదారులను అధిగమించి, ప్రపంచంలో మొదటి పారిశ్రామిక దేశంగా అవతరించింది. 1913 నాటికి బ్రిటన్, జర్మని, ఫ్రాన్స్ దేశాలు కలిపి చేస్తున్న ఉత్పత్తిని అధిగమించి, అమెరికా ప్రపంచ పారిశ్రామికోత్పత్తిలో మూడో వంతు ఉత్పత్తి చేస్తున్నది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసే నాటికి మొత్తం ప్రపంచ ఉత్పత్తిలో అమెరికా వాటా దాదాపు సగానికి పెరిగింది. అయినప్పటికీ గుట్టలు పడుతున్న ఈ సంపదను ఉత్పత్తి చేస్తున్న వారితో పంచుకోలేదు. అతి తక్కువ వేతనాలతో ఎక్కువ గంటలు పని చేస్తున్న అమెరికా కార్మికులు తీవ్ర దారిద్ర్యం, అనిశ్చిత ఉపాధితో అల్లాడిపోయారు. వారికి కొద్దిపాటి రక్షణలు మాత్రమే కల్పించారు. ప్రపంచంలోని అన్ని దేశాల కార్మికుల కన్నా అమెరికా కార్మికులు అత్యధికంగా ప్రమాదాలకు గురయ్యారు.

కార్మికులు ఈ పరిస్థితులను ఐక్యంగా వ్యతిరేకించినపుడు గిల్డు సమాజంలో ఉన్న గుత్త పెట్టుబడిదారీ సంస్థల వ్యతిరేకతతో పాటు, అనమానతలతో కూడిన వ్యవస్థను కొనసాగించటానికి ఏర్పాటు చేసిన ఈ ఆర్థిక, రాజకీయ నిర్మాణాన్ని కూడా వారు ఎదుర్కోవాల్సి వచ్చింది. మార్కెట్ పోటీకి వ్యతిరేకంగా తీసుకున్న చర్యలతో సంపద అత్యధికంగా కేంద్రీకరణ అయింది. అప్పుడు అమెరికాలో అత్యంత ధనికులుగా ఉన్న 10 శాతం మంది చేతుల్లో 90 శాతం ఆస్తులు కేంద్రీకృతం అయ్యాయి. ఆ ధనాన్ని ఉపయోగించి అధికారాన్ని కొనుగోలు చేశారు. కార్మికవర్గాన్ని హింసాకాండతో అణచివేయటానికి, పెట్టుబడిని కాపాడటానికి ప్రభుత్వ యంత్రాంగాన్ని వినియోగించారు. “వాల్‌స్ట్రీట్ దేశాన్ని గుత్తకు తీసుకుంది. ప్రభుత్వం ఎంత మాత్రం ప్రజల చేత, ప్రజల వలన, ప్రజల కొరకు ఎన్నుకోబడినదిగా లేదు. వాల్‌స్ట్రీట్ చేత, వాల్‌స్ట్రీట్ వలన, వాల్‌స్ట్రీట్ కొరకు ఉన్న ప్రభుత్వంగా మారింది” అని 1900 సంవత్సరంలో ప్రజా నాయకురాలు మేరీ ఎలిజబెత్ లీజ్ విమర్శించారు.

1877లో రైల్‌రోడ్ కార్మికుల దేశవ్యాపిత సమ్మె సందర్భంలో ఇది స్పష్టంగా వెల్లడైంది. ఈ సమ్మెను అణచటానికి పంపిన ప్రభుత్వ దళాలు 100 మంది కార్మికులను చంపి, వారాల తరబడి హింసాకాండను కొనసాగించాయి. సమానత్వాన్ని బోధిస్తున్న కార్మికవర్గ నాయకులు ఈ హింసాకాండ తర్వాత కార్మికులను సంఘటితం చేయటానికి పూనుకున్నారు. కానీ 1886లో జరిగిన హే మార్కెట్ సంఘటన-షికాగోలో జరిగిన మేడే ప్రదర్శన సందర్భంగా బాంబు పేలటంతో ప్రభుత్వం హింసాకాండకు పాల్పడటానికి సాకు దొరికింది. అణచివేతను తీవ్రం చేయటానికి, అరాచకత్వం, తీవ్రవాదాలంటూ కార్మికవర్గ ఉద్యమాలను నిందించటానికి ప్రభుత్వం పూనుకుంది.

ఇది జరిగిన తర్వాతి దశాబ్దాలలో ఈగెన్ వి డెబ్స్ నాయకత్వంలో వామపక్ష సోషలిస్టులు సంఘటితం కావటానికి ప్రయత్నించారు. ఆయన సిద్ధాంతాలను అధ్యయనం చేయటం ద్వారా కాక, అమెరికన్ రైల్వే యూనియన్‌లో సంపాదించిన అనుభవం ద్వారా సోషలిజం వైపుకు వచ్చాడు. “ప్రతి బాయ్‌నెట్ పోటు, ప్రతి రైఫిల్ నుండి వచ్చే మెరుపు వర్గ పోరాటాన్ని తీవ్రం చేస్తాయి. సోషలిజాన్ని ఆ పేరుతో పిలుస్తారని నాకు తెలియనప్పటికీ, ఇది నా మొదటి ఆచరణాత్మక పాఠం” అని ఆయన చెప్పాడు.

1901లో సోషలిస్ట పార్టీ ఆఫ్ అమెరికాను స్థాపించటానికి డెబ్స్ సహాయం చేశాడు. తర్వాతి రెండు దశాబ్దాలలో దేశవ్యాపితంగా సోషలిస్టు పార్టీ అభ్యర్థులు స్థానిక ఎన్నికలలో గెలవటం ద్వారా మేయర్లు, అమెరికా కాంగ్రెస్ (పార్లమెంటు) ప్రతినిధులుగా ఎన్నికయారు. 1912లో మూడవ అధ్యక్ష అభ్యర్థిగా ఎన్నికలలో నిలబడిన డెబ్స్ దాదాపు పది లక్షల ఓట్లు, (తిరిగి 1920లో జైలులో ఉండి కూడా) దేశంలోని మొత్తం ఓట్లలో ఆరు శాతం సాధించాడు. ఆ సమయంలో సోషలిజం అనేది అమెరికా ప్రజాస్వామ్యం నుండి విడదీయలేనిదిగా కనిపించింది.

**“ఇది మనకోసం జరిగే యుద్ధం కాదు”**

మొదటి ప్రపంచయుద్ధం సమయంలో సోషలిజం అత్యంత కఠిన పరీక్షను ఎదుర్కొన్నది. ఇది ధనికుల కోసం జరుగుతున్న యుద్ధమని, వారి కోసం పేదలు పోరాడుతున్నారని అనేకమంది సోషలిస్టులు యూరప్, అమెరికాలలో యుద్ధ వ్యతిరేక ప్రచారం చేశారు. ఈ ప్రచారం అమెరికా ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేసింది.

వర్గ వ్యతిరేకత కన్నా సోషలిస్టు విమర్శ లోతుగా చొచ్చుకెళ్ళింది. దేశంలో కార్మికులను పరాన్నజీవుల వలె పీల్చిపిప్పి చేయటం, విదేశాలను కొల్లగొడుతూ చేస్తున్న విస్తరణల మధ్య ఉన్న సంబంధాన్ని సోషలిస్టులు అనేక దశాబ్దాల పాటు ప్రచారం చేశారు. యూరోపియన్ సామ్రాజ్యవాద దేశాలు జాతీయ ఔన్నత్యం పేరుతో తాము ఆక్రమించిన దేశాలలోని ప్రజల ప్రాణాలను గడ్డిపోచల కన్నా హీనంగా చూశాయి. సామ్రాజ్యవాదం ఉన్నతస్థాయికి చేరిన19వ శతాబ్దం చివరిలో పెట్టుబడిదారీ తర్కానికి, సామ్రాజ్యవాదం చేస్తున్న దుష్కృత్యాలకు సంబంధం లేదని అభ్యుదయ, సోషలిస్టు రచయితలు తమ

> **1919 సంఘటనల తర్వాత ఎర్రరంగుపై భయాన్ని పెంచి, 1950లలో మెక్‌కార్థీయిజం, ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో సృష్టించిన ఉన్మాదపూరిత వాతావరణం, అణచివేతలతో అమెరికాలో సోషలిజం అంటే నేరపూరితమైనదని ముద్రవేశారు. రాజకీయాలలో దానిని ఒక మచ్చగా ప్రచారం చేసి, ప్రధాన స్రవంతి నుండి దూరంగా పెట్టారు. కమ్యూనిజానికి వ్యతిరేకంగా తీవ్రంగా ప్రచారం చేస్తున్నప్పటికీ కొందరు ప్రధానమైన వ్యక్తులు సోషలిజాన్ని బలపరుస్తూ ముందుకు వచ్చారు.**




న్యూయార్క్ మేయర్ ఎన్నికల ప్రచారంలో మమ్దాని

రచనలలో పేర్కొన్నారు.

రష్యన్ కమ్యూనిస్టు, విప్లవ నాయకుడైన వ్లదిమీర్ లెనిన్ దీనిని "పెట్టుబడిదారి విధానం యొక్క గుత్తాధిపత్య దశ" అని చెప్పాడు ("నాగరికతను విస్తరింపజేయటం కోసం" చేసినదని పెట్టుబడిదారులు ముద్ర వేసుకున్నారు). దేశ ప్రయోజనాల కోసం కాకుండా ఉన్నత వర్గాలు తమ ఆర్థిక ఆధిపత్యాన్ని మరింతగా విస్తరించుకోవటానికి అవసరమైన ముడి సరుకులు, కొత్త మార్కెట్ల కోసం ప్రభుత్వం తన అధికారాన్ని వినియోగిస్తున్నదని బ్రిటిష్ ఆర్థికవేత్త జాన్ హాబ్సన్ పేర్కొన్నాడు. ''సామ్రాజ్యవాదం ఆధిపత్యం సాధించటం నాగరికతను విస్తరింపజేయటం కోసం కాదని, ఆధిపత్యంలో ఉన్న వర్గాలకు భౌతికంగా ప్రయోజనం కలిగించటం కోసం ప్రజలను దాసులుగా చేసుకుంటున్నదని", ఇదే సామ్రాజ్యవాదానికి ఆర్థికంగా "తల్లివేరు" అని ఆయన తెలిపాడు.

అమెరికా సంయుక్త రాష్ట్రాలలో పౌరహక్కుల ఉద్యమ నాయకుడు డబ్ల్యు ఇ బి డుబొయిస్ జాతులు, వలసలపై ఆధిపత్యం చెలాయించటం కోసం జరుగుతున్న సుదీర్ఘ పోరాటంలో ఈ యుద్ధం భాగమని చెప్పాడు. మొత్తం ఆఫ్రికా ఖండాన్ని నిస్సహాయ పరిస్థితులలోకి నెట్టి, మనుషులను బానిసలుగా పట్టుకెళుతూ, దురాక్రమణ, దోపిడీలను కొనసాగించిన భయానకమైన కాలంలో ఈ యుద్ధం ప్రారంభమైందని, తమ ఇష్టం వచ్చినట్లు ఆఫ్రికాను కొల్లగొట్టారని ఆయన వెల్లడించాడు. సామ్రాజ్యాన్ని విస్తరించుకోవటం కోసం చేస్తున్న వివిధ రకాల ప్రయత్నాలలో యుద్ధం ఒక భాగమని చెప్పాడు. "యుద్ధంలో ఉపయోగించే ఉక్కు, తుపాకి మందు కోసం చేసే కొన్ని వందల కోట్ల రూపాయల ఖర్చుకు ప్రతిగా వజ్రాలు, కోకోవా రూపంలో వేలకోట్ల రూపాయలు వస్తుంటే యుద్ధ పర్యవసానాలను గురించి దేశాలెందుకు ఆలోచిస్తాయి?" అని ఆయన ప్రశ్నించాడు.

అశక్తులుగా ఉన్నవారి కోసం పనిచేసే నాయకురాలు, సోషలిస్టు, అమెరికన్ పౌరహక్కుల సంఘం వ్యవస్థాపక సభ్యులలో ఒకరైన హెలెన్ కెల్లర్ ఇటువంటి విమర్శలే చేశారు. 1916లో ఆమె ఈ విధంగా రాశారు: "ప్రతి ఆధునిక యుద్ధ పునాదులు దోపిడిపై ఆధారపడి ఉన్నాయి. పశ్చిమ ప్రాంతాలను దక్షిణాదిలో ఉన్న బానిస యజమానులు దోపిడీ చేయాలా లేక ఉత్తరాదిలోని పెట్టుబడిదారులు చేయాలా అన్నది నిర్ణయించటం కోసమే యుద్ధం జరిగింది. క్యూబా, ఫిలిప్పీన్స్‌లను అమెరికాయే దోపిడీ చేయాలన్న అంశాన్ని అమెరికా-స్పానిష్ యుద్ధం నిర్ణయించింది. మొదటి ప్రపంచయుద్ధంలో లభించిన దోపిడి సొమ్ము పట్ల కార్మికులు ఏ మాత్రం ఆసక్తి చూయించలేదు. దానిలో ఎటువంటి భాగాన్ని వారు పొందలేదు" అంటూ ఆమె ముగించింది.

వాషింగ్టన్ యుద్ధంలోకి ప్రవేశించిన తర్వాత గూఢచారుల నుండి సేకరించిన సమాచారం, దేశద్రోహ చట్టాలను ఉపయోగించి భిన్నాభిప్రాయాలను నేరంగా మార్చింది. ఈ దుష్కృత్యాలను బట్టబయలు చేస్తున్న డేనియల్ ఎల్స్‌బర్గ్, ఎడ్వర్డ్ స్నోడెన్, డేనియల్ హేల్ లాంటి వారిపై నేరాలను ఆరోపించి, వారిపై " అత్యవసర చర్యలు" తీసుకున్నట్లుగానే భవిష్యత్ యుద్ధాలలో కూడా చేస్తారు. సోషలిస్టులు వారి మొదటి లక్ష్యంగా ఉంటారు.

యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ 1918లో ప్రసంగం చేసిన తర్వాత డెబ్స్‌ను జైలులో పెట్టారు. "దేశసంపద కోటీశ్వరులకు మాత్రమే కాకుండా ప్రజలందరికీ చెందాలి" అని డెబ్స్ ప్రకటించాడు. ''పెట్టుబడిదారుల నాయకత్వంలో యుద్ధానికి వెళ్ళటం, చనిపోవటం నీ దేశభక్తిని నిరూపించుకొనే కర్తవ్యం అని బోధిస్తూ పాలకవర్గాలు నీకు శిక్షణ ఇస్తాయి. కానీ ప్రపంచ చరిత్రలో యుద్ధాన్ని ప్రకటించటంలో సామాన్య ప్రజలకు ఎన్నడూ ఎటువంటి పాత్రా లేదు. సమాజంలోని కొద్దిమంది లాభాల కోసం కాకుండా ప్రజలందరి కోసం మనం ఉత్పత్తి చేయాలి" అంటూ రాసిన వాక్యాలు ఎప్పటికీ ప్రాధాన్యతను కలిగి ఉంటాయి.

**ఎరుపు రంగుపై భయం పెంచిన తర్వాత సోషలిజం**

1919 సంఘటనల తర్వాత ఎర్రరంగుపై భయాన్ని పెంచి, 1950లలో మెక్‌కార్థీయిజం, ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో సృష్టించిన ఉన్మాదపూరిత వాతావరణం, అణచివేతలతో అమెరికాలో సోషలిజం అంటే నేరపూరితమైనదని ముద్రవేశారు. రాజకీయాలలో దానిని ఒక మచ్చగా ప్రచారం చేసి, ప్రధాన స్రవంతి నుండి దూరంగా పెట్టారు. కమ్యూనిజానికి వ్యతిరేకంగా తీవ్రంగా ప్రచారం చేస్తున్నప్పటికీ కొందరు ప్రధానమైన వ్యక్తులు సోషలిజాన్ని బలపరుస్తూ ముందుకు వచ్చారు.

ఆరు కోట్ల మంది ప్రాణాలు తీసి, మానవులను ఆస్విట్జ్, హిరోషిమాల

**❝ అమెరికా మరోసారి కూడలిలో నిలబడింది. పెట్టుబడిదారీ విధానం మనల్ని పర్యావరణ, ఆర్థిక, నైతిక పతనానికి తెచ్చింది. నేడు 93% ప్రజలకన్నా, 1% ధనికులు ఎక్కువ సంపద కలిగి ఉన్నారు. ఈ పరిస్థితిని ఏ మాత్రం భరించ లేం. కొత్త రూపంలో ప్రజాస్వామ్యాన్ని అభివృద్ధి చేయటానికి పునాదిగా సోషలిజాన్ని అంగీకరించటమా, లేక దాన్ని తిరస్కరించి, ఆటవికతకు తిరోగమించటం ద్వారా మూల్యం చెల్లించు కోవటమా అన్న దానికి వందేళ్ల క్రితమున్న అవకాశమే నేడూ ఉన్నది. ❞**

హత్యాకాండకు గురిచేయటంలో నిజమైన దోషి "పెట్టుబడిదారి విధానం" అని 1949లో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ చెప్పాడు. "మానవ శరీర నిర్మాణం వలన మానవజాతి నాశనం కాదు. ఒకరినొకరు నాశనం చేసుకోవటం, లేదా క్రూర పాలకుల దయపై ఆధారపడటం వలన ఆ విధంగా జరగవచ్చు" అని ఆయన నొక్కి చెప్పాడు. సోషలిస్టు ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవటమే దీనికి ప్రత్యామ్నాయం అని, విజయాలనూ, అధికారాన్నీ కీర్తించే విద్యకు బదులుగా మానవుల మధ్య సంబంధాలను పెంపొందించే విద్యా విధానాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఆయన చెప్పాడు.

పెట్టుబడిదారీ విధానం, జాత్యహంకారం, యుద్ధానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఈ పోరాటాన్ని మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్ ముందుకు తీసుకుపోయాడు. డబుల్ వి ప్రచార వారసత్వ పురోగమనంలో భాగంగా దేశంలో తెల్లజాతి ఆధిపత్యానికి, విదేశాలలో సామ్రాజ్యవాదం సాగించే దురాగతాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఆయన చెప్పాడు. తాను సోషలిస్టునని బహిరంగంగా చెప్పుకోనప్పటికీ, అన్యాయంగా జరుగుతున్న సంఘటనల మధ్య అంతస్సంబంధాన్ని సోషలిస్టు దృక్పథంతో అన్వేషించాడు. సగం స్వాతంత్ర్యం, విముక్తి ఉండవని, ఆర్థికన్యాయం లేకుండా రాజకీయ హక్కులు పైపైన మాత్రమే అమలవుతాయని, వర్గ సమానత్వం లేకుండా జాతుల మధ్య సమానత్వం సాధ్యం కాదని కింగ్ చెప్పాడు,

"ప్రజాస్వామ్యం అని పిలిచినా లేదా ప్రజాస్వామిక సోషలిజం అని పిలిచినా, ఆ విధానంలో ఈ దేశంలోని దేవుని పిల్లలందరికీ సంపద ఎక్కువ న్యాయంగా పంచబడుతుంది" అని ఆయన చెప్పాడు. పెట్టుబడిదారీ విధానంలో మనుషులు స్వయంగా సంపద్వంతులౌతారనే కట్టుకథలను ఆయన తుత్తునియలు చేశాడు. "బూట్లు ఉన్న వ్యక్తికి తన బూటు లేసులు పట్టుకొని పైకి లేవమని చెప్పవచ్చు. కాని బూట్లు లేని వ్యక్తిని బూటు లేసులు పట్టుకొని పైకి లేవమని చెప్పటం క్రూరమైన జోకు వేయటమేనని" ఆయన చెప్పాడు.

1967లో రివర్‌సైడ్ చర్చి ప్రసంగంలో వియత్నాంపై అమెరికా చేస్తున్న యుద్ధాన్ని కింగ్ జూనియర్ ఖండించాడు. సామాజిక అభివృద్ధి కోసం చేసే ఖర్చుకన్నా యుద్ధం కోసం ఎక్కువ ఖర్చు చేసే సమాజం భావజాల పరంగా మరణానికి చేరువౌతుందని ఆయన ప్రకటించాడు. అమెరికాలో ఉన్నతమైన విలువల కోసం విప్లవం జరగాలని, సరుకుల కన్నా మనుషులను ప్రధానంగా చూసేలా మార్పు జరగాలని చెప్పాడు. త్రిశక్తులుగా ఉన్న జాతి ఆధిక్యత, భౌతిక సంపదలకు ప్రాధాన్యత ఇవ్వటం అనేవాటిని సైనికీకరణ ద్వారా సాధించలేమని చెబుతూ ఆయన ప్రసంగాన్ని ముగించాడు.

**దేశాన్ని, ప్రపంచాన్ని మరింత ఉన్నతంగా మార్చటం సాధ్యమే**

అధికారంలో ఉన్నవారి నిరంకుశ విధానాలను సవాలు చేస్తున్న జోహ్రాన్ మమ్దాని, బెర్ని శాండర్స్, అలెగ్జాండ్రియా ఒకాసియో-కార్టెజ్, రషీదా ట్లైబ్ లాంటి డెమోక్రటిక్ సోషలిస్టులను పనికిరాని వారంటూ ముద్ర వేయటం కొత్త విషయం ఏమీ కాదు. ప్రజాస్వామ్యానికి అర్థం ఏమిటన్న దానిపై జరుగుతున్న ప్రస్తుత పోరాటాన్ని అది ప్రతిబింబిస్తుంది. ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు జరపటం, ప్రత్యేక హక్కులు ఉన్న కొద్దిమంది ధనికుల కోసం కాకుండా విస్తృతమైన ప్రజానీకం కోసం పని చేయటమనే విధానాన్ని సుదీర్ఘకాలం నుండి పక్కన పెట్టారు. నిజంగా ప్రజల కోసం పనిచేసే సమాజాన్ని నిర్మించాలంటే ఆ సాంప్రదాయాన్ని పునరుద్ధరించటం అవసరం. అటువంటి దృక్పథం సమాజంలో వేరూనుకోకపోతే మమ్దాని, ఆయన మద్దతుదారులు ఈ విధానానికి వ్యతిరేకంగా పని చేయటం సాధ్యం కాదు.

అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న ప్రతీఘాతుక విధానాలతో ప్రజాస్వామిక సంస్థలు వేగంగా క్షీణించిపోతున్నాయి. ప్రజాస్వామిక విధానాలను అమలు చేసే మేయర్లున్న నగరాలను ఆక్రమించుకోవటానికి సైన్యాన్ని ఉపయోగిస్తున్నారు. చట్టబద్ధమైన పాలన స్థానంలో నిరంకుశ విధానాలను అమలు చేస్తున్నారు. నియంతృత్వం కన్నా, వామపక్షాలంటే ఎక్కువగా భయపడే ధనికుల మద్దతు లేకుండా ఫాసిజం ఎక్కడా జయప్రదం కాలేదు. హిట్లర్, ముసోలినీలు శూన్యం నుండి అధికారానికి రాలేదు. ప్రజాస్వామ్యంలో ఉన్న అనిశ్చితి కన్నా నియంతృత్వ ప్రభుత్వానికి ప్రాధాన్యత ఇచ్చిన ప్రజాస్వామిక వ్యవస్థలోని పై తరగతి వారు వారిని అధికారానికి తీసుకువచ్చారు.

ఈనాటి సంక్షోభ పరిస్థితులను ఎదుర్కోవాలంటే ముక్కముక్కలుగా చేసే సంస్కరణలు సరిపోవు. రాజకీయ దృక్పథంలో సమూలంగా మార్పు రావాలి. శతాబ్దాలుగా ఉన్న సామ్రాజ్యవాదం ఫాసిజం రూపంలో తిరిగి వచ్చింది. దానిని భరిస్తున్న పెట్టుబడిదారీ విధానాన్ని నాశనం చేయకుండా, ఫాసిజాన్ని నిర్మూలించలేం. దాని నేతృత్వంలో ఉన్న ఆర్థికవ్యవస్థను ప్రజాస్వామ్యీకరించకుండా పెట్టుబడిదారీ విధానంలో మార్పు తీసుకురాలేం.

ఈ దేశం తిరిగి మరోసారి కూడలిలో నిలబడింది. పెట్టుబడిదారీ విధానం మనల్ని పర్యావరణం, ఆర్థిక, నైతిక పతనం అంచులకు తీసుకొచ్చింది. ఈరోజు అమెరికాలోని 93 శాతం ప్రజల కన్నా, ఒక శాతం మంది ధనికులు ఎక్కువ సంపద కలిగి ఉన్నారు. ఈ పరిస్థితిని ఏ మాత్రం భరించలేం. నూతన రూపంలో ప్రజాస్వామ్యాన్ని అభివృద్ధి చేయటానికి పునాదిగా సోషలిజాన్ని అంగీకరించటమా, లేక దానిని తిరస్కరించి, ఆటవికతకు తిరోగమించటం ద్వారా మూల్యం చెల్లించుకోవటమా అన్న వాటికి ఒక శతాబ్దం క్రితం ఉన్న అవకాశమే ఈనాడూ ఉన్నది. అమెరికాలో ప్రజాస్వామ్యం మనగలుగుతుందా అన్నది ఈనాడు ప్రశ్నకాదు. సోషలిజం లేకుండా అమెరికాలో ప్రజాస్వామ్యం మనగలుగుతుందా అన్నదే ఈనాటి ప్రశ్న.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

చరిత్ర

# విజయనగర, బహమనీ సామ్రాజ్యాలు

## (క్రీ.శ.1350-1565)

ఎంవిఎస్ శర్మ



రచయిత ప్రజాశక్తి మాజీ ఎడిటర్

దక్షిణ భారత భూభాగంలో దాదాపు 200 సంవత్సరాలపాటు విజయనగర, బహమనీ సామ్రాజ్యాల ఆధిపత్యం నడిచింది. ఆ కాలంలో ఉత్తర భారతంలో డిల్లీ సుల్తానుల ఆధిపత్యం బలహీనపడి విచ్ఛిన్నమౌతూవుంటే అందుకు భిన్నంగా దక్షిణాపథాన సుస్థిర ప్రభుత్వాలు దాదాపు రెండువందల సంవత్సరాలపాటు కొనసాగాయి.

### పూర్వరంగం

దక్షిణ భారతంలో క్రీ.శ.1150-1323 మధ్య కాలంలో కాకతీయ సామ్రాజ్యం విలసిల్లింది. దాదాపు తూర్పు దక్కను ప్రాంతాన్నంతటినీ కాకతీయులు తమ ఆధీనంలోకి తెచ్చుకోగలిగారు. ఈ కాకతీయులు తొలుత పశ్చిమ చాళుక్యులకు సామంతులుగా ఉండేవారు. క్రీ.శ.1162లో ఒకటవ ప్రతాప రుద్రుడు తిరుగుబాటు చేసి చాళుక్యులను ఓడించి స్వతంత్ర రాజ్యాన్ని ప్రకటించాడు. రాజధానిని హనుమకొండ నుండి ఓరుగల్లుకు (వరంగల్) మార్చాడు.

అతడి తర్వాత రాజైన గణపతిదేవుడు, తదనంతరం సింహాసనమెక్కిన రుద్రమదేవి తమ పాలనాకాలంలో దాదాపు తెలుగు మాట్లాడే ప్రాంతాన్నంతటినీ తమ ఆధీనంలోకి తెచ్చారు. కాకతీయుల కాలంలో కళలు, సాహిత్యం బాగా పెంపొందాయి. కాకతీయులు శైవులు. అయినా, వైష్ణవ, జైన మతాలను కూడా సమానంగా ఆదరించారు. వందలాదిగా దేవాలయాలను నిర్మించారు. ఆ క్రమంలో శిల్పకళ అభివృద్ధి చెందింది. వరంగల్‌లోని వెయ్యి స్తంభాల మంటపం వీరి కాలం నాటిదే.

రుద్రమదేవి మనుమడైన రెండవ ప్రతాప రుద్రుడు డిల్లీ సుల్తానుల దాడులను పలుమార్లు జయప్రదంగా తిప్పికొట్టగలిగాడు. అయితే, అనేకరెట్లు సైనికబలం అధికంగా ఉన్న డిల్లీ సేనలముందు నిలవడం అసాధ్యం అయింది. మహమ్మద్‌బిన్ తుగ్లఖ్ నాయకత్వం లోని డిల్లీ సేనలు వరుస దాడులు జరిపి కాకతీయ సైన్యాన్ని ఓడించి ప్రతాపరుద్రుడిని బందీగా పట్టుకున్నాయి. దాంతో కాకతీయ సామ్రాజ్యం డిల్లీ సుల్తానుల పెత్తనంలోకి వచ్చింది. ఆ తర్వాత క్రమంగా బలహీనపడిపోయింది.

### విజయనగర సామ్రాజ్య స్థాపన

కాకతీయులవద్ద హరిహర రాయలు, బుక్కరాయలు అనే సోదరులు సామంతులుగా ఉండేవారు. దక్షిణాపథం మీద డిల్లీ సేనలు పదే పదే జరుపుతూవచ్చిన దాడులలో కాకతీయ సామ్రాజ్యంతోబాటు దేవగిరిని పాలించిన యాదవరాజులు కూడా బలహీన పడ్డారు. ఆ పరిస్థితుల్లో ముమ్మిడి సింగనాయ కుడు 1306లో కంపిలి రాజ్యాన్ని స్థాపించాడు. అతడి అనంతరం కంపిలిదేవుడు రాజైనాడు. ఐతే ఈ రాజ్యం అతి స్వల్పకాలం, 1327 వరకు మాత్రమే మనగలిగింది. ఈ కంపిలి రాజ్యంలో హరిహర, బుక్కరాయలు ఇద్దరూ మంత్రులుగా ఉండేవారు. తుగ్లఖ్ కంపిలిమీద దండయాత్ర చేసి రాజైన కంపిలిదేవుడిని హత మార్చి హరిహర, బుక్కరాయలలిద్దరినీ బందీలుగా పట్టుకున్నాడు. ఆ తర్వాత తిరుగు ప్రయాణం అవుతున్నప్పుడు తాను స్వాధీనం చేసుకున్న భూభాగంలో డిల్లీపై తిరుగుబాట్లు తలెత్తకుండా చూసే బాధ్యతను వారిద్దరికీ అప్పజెప్పాడు.

సరిగ్గా ఈ తరుణంలోనే ఉత్తరాపథంలో డిల్లీ సుల్తానుల ఆధిపత్యానికి పలువైపులనుండి సవాళ్ళు ఎదురయ్యాయి. ఆ కారణంగా వారికి దక్షిణ భారతం మీద దృష్టి సారించడం సాధ్యపడలేదు. దీనిని అవకాశంగా తీసుకుని 1336లో హరిహరరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించాడు. ఆదిలోనే అటు మైసూరుకు చెందిన హొయసల రాజ్యంతో, ఇటు మదురైని పాలించే సుల్తానులతో తలపడవలసివచ్చింది. హొయసల సేనలు డిల్లీ సైన్యపు దాడులను ఎదుర్కోలేక బలహీన పడిపోయాయి. ఆ అవకాశాన్ని అందిపుచ్చుకుని హొయసల రాజును హతమార్చి 1346 నాటికి మొత్తం హొయసల రాజ్యాన్నంతటినీ విజయనగర సామ్రాజ్యం ఆధిపత్యం కిందకు తీసుకువచ్చాడు హరిహరరాయలు. అతడి మరణం తర్వాత 1356లో బుక్కరాయలు సింహాసనమెక్కాడు.

1377 నాటికి మదురై సుల్తాను రాజ్యం తుడిచిపెట్టుకుపోయింది. దాంతో దక్షిణ భారతమంతా విజయనగర సామ్రాజ్యంలో భాగమైంది. తమిళనాడు రామేశ్వరం వరకు, పశ్చిమాన చేరరాజ్య ప్రాంతం (కేరళ)తో సహా అంతా విజయనగర సామ్రాజ్యంలో భాగం అయింది. ఆ తర్వాత ఈశాన్యదిశగా సముద్ర తీరం వరకూ తమ సామ్రాజ్య పరిధిని విజయ నగరరాజులు రెండవ హరిహరరాయలు కాలంలో (1372-1406) విస్తరించారు. బెల్గాం, గోవాలను స్వాధీనం చేసుకున్నారు. (చూ. మ్యాప్)

రెండవ హరిహర రాయల మరణం తర్వాత విజయనగరం సామ్రాజ్యంలో అంతర్గత ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఆ తర్వాత ఒకటవ దేవరాయలు (1404-1422) సింహాసనమెక్కాడు. తుంగభద్ర పరీవాహక ప్రాంతం మీద పట్టు సంపాదించడం కోసం బహమనీ సుల్తానులతో యుద్ధానికి తలపడ్డాడు. ఐతే ఆ యుద్ధంలో ఓడిపోయాడు. అప్పుడు తన కుమార్తెను బహమనీ సుల్తానుకు ఇచ్చి వివాహం చేశాడు. అలా కుదిరిన సంధి ఎక్కువకాలం నిలవలేదు. వరంగల్ పాలకులతో ఒప్పందం కుదుర్చుకున్న దేవరాయలు తన అల్లుడైన ఫిరోజ్‌షా(బహమనీ సుల్తాను)పై మళ్ళీ యుద్ధానికి దిగాడు. ఆ యుద్ధంలో మళ్ళీ కోలుకోలేని విధంగా ఫిరోజ్‌షాను దెబ్బ తీశాడు. విజయనగర సామ్రాజ్యాన్ని కృష్ణాతీరం వరకూ విస్తరించాడు.

అనంతరం గద్దెనెక్కిన రెండవ దేవరాయలు (1425-1446) తన సైన్యాన్ని మరింత బలోపేతం చేశాడు. ఇందుకోసం రెండువేల మంది సుశిక్షితులైన ముస్లిం అశ్విక విలుకాళ్ళను సైన్యంలో చేర్చుకున్నాడు. మేలుజాతి గుర్రాలను సేకరించాడు. శక్తివంతమైన నావికాదళాన్ని కూడా తయారుచేశాడు.

విజయనగర పాలకులు నీటిపారుదల వసతులను కల్పించి సంపద వృద్ధికి, రాజ్యం

> ❝ కృష్ణదేవరాయలి హయాం తెలుగు సాహిత్యంలో ఒక నూతన శకాన్ని ఆవిష్కరించింది. అనువాద రచనలకే పరిమితం అవుతూవచ్చిన తెలుగు కవులు అతడి కాలంలో పలు ప్రసిద్ధ స్వంత రచనలను చేశారు. అష్ట దిగ్గజాలుగా పేరు పొందిన అల్లసాని పెద్దన మొదలుగా గల కవులు రచించిన ప్రబంధకావ్యాలు తెలుగు సాహిత్యాన్ని ఉన్నత స్థాయికి చేర్చాయి. ❞

ఆదాయం పెంపుకు తోడ్పడ్డారు. 15వ శతాబ్దం నాటికి దక్షిణ భారతంలో విజయనగర సామ్రాజ్యం తిరుగులేని, బలమైన, సంపన్న రాజ్యంగా తయారైంది. ప్రపంచంలోని పేరెన్నిక గల నగరాల్లో ఒకటిగా విజయనగరం పేరు పొందింది. అది రోమ్ నగరం కన్నా కూడా పదిరెట్లు విశాలమైనదని ఇటలీ నుండి వచ్చిన యాత్రికులు తమ నివేదికల్లో పేర్కొన్నారు.

రెండవదేవరాయలు మరణించడంతో మళ్ళీ రాజ్యంలో అస్థిరత, అరాచకం నెలకొన్నాయి. ఎక్కడికక్కడ సామంతరాజులు స్వతంత్రం ప్రకటించుకోసాగారు. రాయల వంశ పాలన ముగిసింది. ఆ తర్వాత 'తుళు' వంశానికి చెందిన కృష్ణదేవరాయలు అధికారం చేపట్టాడు. 1509 నుంచి 1530 వరకూ పాలించిన కృష్ణదేవరాయలు విజయనగర పాలకులందరిలోకీ అత్యంత ప్రసిద్ధుడు.

ఒకవైపు బహమనీ సుల్తానులతో, మరో వైపు ఒరిస్సా పాలకులతో కృష్ణదేవరాయలు ఎడతెరిపి లేకుండా యుద్ధాలు చేశాడు. ఆ యుద్ధాలలో పైచేయి సాధించి కృష్ణానదీతీరం వరకూ గల ప్రాంతాన్ని తిరిగి చేజిక్కించుకున్నాడు. ఆ తర్వాత తుంగభద్ర పరీవాహక ప్రాంతాన్ని తిరిగి పొందడానికి బీజాపూర్‌పై దండయాత్ర జరిపి సుల్తానును ఓడించి ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నాడు. తన రాజ్యాన్ని తూర్పున విస్తరించే క్రమంలో గోదావరి నదిని సైతం దాటివచ్చి సింహాచలం వరకు జైత్రయాత్ర చేసి వెనక్కి మరలాడు. తన విజయయాత్రకు గుర్తుగా సింహాచలంలో ప్రసిద్ధి చెందిన వరాహ నరసింహస్వామి దేవాలయాన్ని నిర్మింపజేశాడు,

కృష్ణదేవరాయలు తన పాలనలో ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేశాడు. విజయనగరం సమీపంలో హంపీ అనే కొత్త రాజధానిని నిర్మించాడు. నేడు శిథిలావస్థలో ఉన్నప్పటికీ, అక్కడి ఆనవాళ్ళు ఆ కాలపు నిర్మాణ కౌశలాన్ని తెలియజేస్తాయి. కృష్ణదేవరాయలి హయాం తెలుగు సాహిత్యంలో ఒక నూతన శకాన్ని ఆవిష్కరించింది. అనువాద రచనలకే పరిమితం అవుతూవచ్చిన తెలుగు కవులు అతడి కాలంలో పలు ప్రసిద్ధ స్వంత రచనలను చేశారు. అష్ట దిగ్గజాలుగా పేరు పొందిన అల్లసాని పెద్దన మొదలుగా గల కవులు రచించిన ప్రబంధకావ్యాలు తెలుగు సాహిత్యాన్ని ఉన్నతస్థాయికి చేర్చాయి. కృష్ణదేవరాయలు స్వయంగా బహుభాషాకోవిదుడు. పలు గ్రంథాలను రచించాడు. వాటిలో ఆముక్త మాల్యద ప్రసిద్ధి చెందింది. తెలుగుపట్ల ఎక్కువ మక్కువ ప్రదర్శించినప్పటికీ అతడు వివిధ భాషల పండితులను ఆదరించాడు. ప్రజల మత విశ్వాసాల విషయంలో కృష్ణదేవరాయలు ఉదారంగా వ్యవహరించాడు. అతడి రాజ్యంలో పౌరులు స్వేచ్ఛగా జీవించారని బార్బోసా అనే విదేశీ యాత్రికుడు తన రాతలలో ప్రస్తావించాడు.

కృష్ణదేవరాయలి మరణానంతరం కొంతకాలం పాటు అధికారం కోసం మళ్ళీ సంఘర్షణలు జరిగాయి. మొత్తానికి 1543లో సదాశివరాయలు గద్దెనెక్కాడు. అతడు 1567 వరకూ పాలించాడు. గోల్కొండ, బీజాపూర్, అహ్మద్ నగర్ సుల్తానులను ఓడించాడు. అయితే కాలక్రమంలో ఆ రాజ్యాలు పుంజుకుని 1565లో తళ్ళికోట సమీపంలోని బన్నిహట్టి వద్ద విజయనగర సైన్యాలను చిత్తుగా ఓడించాయి. వేలాదిమందిని ఆ యుద్ధంలో హతమార్చడమే గాక విజయనగరాన్ని పూర్తిగా కొల్లగొట్టి శిథిలంగా మార్చేశారు.

ఆ తర్వాత కూడా విజయనగర సామ్రాజ్యం కొనసాగినా, దాని విస్తీర్ణం బాగా కుదించుకుపోతూవచ్చింది. దాని రాజు దక్షిణ భారత దేశంలో ఎటువంటి ప్రాధాన్యతా లేనివాడిగా మిగిలిపోయాడు.

### పాలనావ్యవస్థ

రాజుకు పాలనావ్యవహారాల్లో సలహా ఇచ్చేందుకు మంత్రిమండలి ఉండేది. అందులో వివిధ ప్రాంతాల మండలాధీశులు ఉండేవారు. రాజ్యాన్ని మండలాలుగా, మండలాలను నాడులు (జిల్లాలు)గా మళ్ళీ వాటిని స్థలాలు(ఉపజిల్లాలు)గా విభజించారు. స్థలాల కింద గ్రామాలు ఉండేవి. మండలాలకు అధిపతులుగా పూర్వపు రాకుమారులు (ఓడిపోయిన సామంత రాజులు) ఉండేవారు. ఆ పదవులు ఎక్కువగా వంశపారంపర్యంగా కొనసాగేవి. మండలాధిపతులకు పాలనావ్యవహారాల్లో పూర్తి స్వేచ్ఛ ఉండేది. వారు ప్రత్యేక సైనిక దళాలను కలిగివుండేవారు. పన్నులు విధించే అధికారం ఉండేది. భూసారం, పంట స్వభావం, సాగు నీటి పద్ధతులను బట్టి రైతుల పంటలమీద శిస్తు విధించేవారు. భూమి శిస్తుతోబాటు ఆస్తిపన్ను, అమ్మకం పన్ను, వృత్తిపన్ను, యుద్ధసమయాల్లో సైనిక విరాళం, వివాహం పన్ను వంటివి వసూలు చేసేవారు. నిర్ధారించిన మేరకు కేంద్రానికి పన్ను ఆదాయాన్ని, అవసరమైనపుడు సైనిక బలగాలను సమకూర్చేవారు. రాజ్యం మొత్తం ఆదాయంలో సగం వరకూ కేంద్రానికి చేరేది. తక్కినది మండలాలకు దక్కేది. గ్రామాల్లో ప్రజలు సాధారణ జీవితాన్ని గడిపేవారు. పట్టణాల్లో సంపన్నులు విలాసవంతంగా జీవించేవారు. నగర జీవనం, వ్యాపారం బాగా అభివృద్ధి చెందాయి. దేవాలయాలు చాలా ఎక్కువ సంఖ్యలో ఉండేవి. వాటికి వచ్చేవారు అధికసంఖ్యలో ఉండేవారు. దేవాలయాలు సంపన్నంగా ఉండేవి. కొన్ని వ్యాపారాలను కూడా నిర్వహించేవి.

రాను రాను, కేంద్రంలో అస్థిరత ఏర్పడినప్పుడల్లా ఈ మండలాధీశులను నియంత్రించడం కష్టతరం అవుతూవచ్చింది. ఇటు వంటి బలహీనతలు అంతిమంగా తళ్ళికోట యుద్ధంలో ఓటమికి దారి తీశాయి. విజయనగర సామ్రాజ్యం విచ్ఛిన్నం అయిన తర్వాత మదురై, తంజావూరు స్వతంత్ర రాజ్యాలుగా ఏర్పడ్డాయి.

### బహమనీ సామ్రాజ్యం

అల్లావుద్దీన్ హసన్ అనే ఆఫ్ఘన్ పోరాట వీరుడు బహమనీ రాజ్యానికి పునాది వేశాడు. గంగూ అనే బ్రాహ్మణుడి అండతో హసన్ ఉన్నత స్థాయికి ఎదిగాడని, అందుచేత అతడిని హసన్ గంగూ అని పిలవసాగారని, బ్రాహ్మణుడి పోషణలో ఎదిగాడు గనుక కృతజ్ఞతగా తన పేరు చివర బహమనీ అని చేర్చుకున్నాడని కథనం వాడుకలో ఉంది.

తమ రాజ్యానికి పొరుగునే ఉన్న విజయనగర సామ్రాజ్యంతో బహమనీ సుల్తానులకు నిరంతరం వైరం కొనసాగేది. దీనికి ముఖ్య కారణం చాలా కీలకమైన, సుసంపన్న మైన మూడు ప్రాంతాలమీద ఆధిపత్యం సంపాదించాలన్న కాంక్ష. తుంగభద్ర పరీవాహక ప్రాంతం, కృష్ణాగోదావరి పరీవాహక ప్రాంతం, మరఠ్వాడా గ్రామీణ ప్రాంతం అటువంటి కీలక ప్రాంతాలు. కృష్ణాగోదావరి ప్రాంతం అనేక ఓడరేవులు

కలిగివుండి విదేశీ వాణిజ్యానికి అనువుగా ఉండేది. మరఠ్వాడా ప్రాంతం అరేబియా సముద్ర తీరానికి అనుకుని వుండేది. అక్కడ గోవా ప్రధాన ఓడరేవుగా ఉండేది. ఆ రేవు ద్వారా అరబ్బీ గుర్రాలను పెద్ద సంఖ్యలో దిగుమతి చేసుకునేవారు. ఇరాన్, ఇరాక్ తదితర దేశాలతో ముమ్మరంగా వ్యాపారం జరిగేది. అందుచేత ఇరు రాజ్యాలకూ అవన్నీ కీలకం అయాయి.

విజయనగరం, బహమనీ రాజ్యాలమధ్య తరచూ జరిగిన యుద్ధాలలో ఎన్నో గ్రామాలు, పట్టణాలు ధ్వంసం అవుతూవచ్చాయి. విపరీతమైన ప్రాణనష్టం జరిగేది. యుద్ధాల్లో బందీలుగా పట్టుబడ్డవారిని బానిసలుగా అమ్మేయడం, చివరికి ఆడవారిని, చిన్న పిల్లలను సైతం బందీలుగా పట్టుకుపోయి అమ్మేయడం వంటివి చేసేవారు. యుద్ధాల్లో అలసిపోయినప్పుడు పరస్పరం శాంతి ఒప్పందాలు కుదిరేవి. కాని కొద్ది కాలంలోనే వాటిని ఉల్లంఘించేవారు. ఇటువంటి సందర్భాల్లోనే ఒకటవ దేవరాయలు తన కుమార్తెను బహమనీ సుల్తాను ఫిరోజ్ షాకు ఇచ్చి వివాహం జరిపించాడు. లక్షలాదిగా ధనాన్ని, విలువైన రత్నాలను, ఏనుగులను కానుకలుగా ఇచ్చుకున్నాడు.

**❝ విజయనగరం, బహమనీ రాజ్యాలమధ్య తరచూ జరిగిన యుద్ధాలలో ఎన్నో గ్రామాలు, పట్టణాలు ధ్వంసం అవుతూవచ్చాయి. విపరీత మైన ప్రాణనష్టం జరిగేది. యుద్ధాల్లో బందీ లుగా పట్టుబడ్డవారిని బానిసలుగా అమ్మేయడం, చివరికి ఆడవారిని, చిన్న పిల్లలను సైతం బందీలుగా పట్టుకుపోయి అమ్మేయడం వంటివి చేసేవారు. యుద్ధాల్లో అలసిపోయి నప్పుడు పరస్పరం శాంతి ఒప్పందాలు కుదిరేవి. కాని కొద్ది కాలంలోనే వాటిని ఉల్లంఘించేవారు. ❞**




ఫిరోజ్ షా (1397–1422) బహమనీ సుల్తానులలోకెల్లా ప్రముఖుడు. బహుభాషా పండితుడు. మత, న్యాయ శాస్త్రాల పట్ల మక్కువ కలిగివుండేవాడు. కవిత్వాన్ని కూడా రచించాడు. డిల్లీ సుల్తానుల ఆధిపత్యం దెబ్బ తినిపోవడంతో అక్కడి విద్యావేత్తలు, కవులు, పండితులు ఫిరోజ్‌షా కొలువులో చేరారు. ఫిరోజ్ షా క్రైస్తవ మత గ్రంధాలను కూడా అధ్యయనం చేశాడు.

తన కొలువులో హిందువులను అధిక సంఖ్యలో బాధ్యతలలో నియమించాడు ఫిరోజ్ షా. ముఖ్యంగా రెవెన్యూ విభాగంలో అధిక సంఖ్యలో బ్రాహ్మణులను నియమించాడు. అది వారి ప్రాబల్యాన్ని పెంచుకోడానికి తర్వాత కాలంలో ఉపయోగపడింది. దౌలతాబాద్ వద్ద ఫిరోజ్ షా ఒక అంతరిక్ష కేంద్రాన్ని కూడా స్థాపించాడు.

వాయవ్య దిశగా గుజరాత్ వైపు తన రాజ్యాన్ని ఫిరోజ్ షా విస్తరింపజేశాడు. ఖేర్లాకు చెందిన గోండ్ రాజు నరసింగరాయ్ ని ఓడించి అతడి కుమార్తెను వివాహం చేసుకున్నాడు.

1419లో ఫిరోజ్ షా దేవరాయలు చేతుల్లో ఓడిపోయాడు. ఆ తర్వాత అతడి సోదరుడు అహ్మద్ షా గద్దెనెక్కాడు. తన అన్న ఓటమిపాలు కావడంలో విజయనగర రాజులకు తోడ్పడిన వరంగల్ పాలకులమీద పగతీర్చుకునేందుకు వరంగల్ పాలకుడిపై యుద్ధం చేసి అతడిని తుదముట్టించాడు. అతడి పాలనలోని చాలా భూభాగాన్ని తన రాజ్యంలో కలుపుకున్నాడు. విస్తరించిన రాజ్యాన్ని పాలించడానికి వీలుగా రాజధానిని గుల్బర్గానుంచి బీదర్‌కు మార్చాడు. తనకు ప్రధానిగా సమర్ధుడైన మహమూద్ గవాన్ ను నియమించుకున్నాడు. గవాన్ ఆధ్వర్యంలో దాభోల్, గోవా వంటి కీలకమైన ఓడరేవులు బహమనీయుల వశం అయాయి. విజయనగరం వాణిజ్యపరంగా తీవ్రనష్టాన్ని చవిచూసింది. అదే సమయంలో బహమనీ రాజ్యం తన వాణిజ్యాన్ని బాగా ముమ్మరం చేయగలిగింది. ఆ తర్వాత మాళ్వ ప్రాంతం మీద, బేరార్, కొంకణ్ ప్రాంతాలమీద పట్టు సాధించగలిగారు.

ఈ యుద్ధాలన్నీ పరిశీలిస్తే అవేవీ మతం కోసం జరిగినవి కావని స్పష్టం అవుతోంది. పాలకుల ఆర్థిక, సైనికపర, పాలనాపర ప్రయోజనాలకోసమే యుద్ధాలు అన్నీ జరిగాయి. ఇరు సైన్యాలలోనూ హిందువులు, ముస్లింలు కూడా పెద్ద సంఖ్యలో భర్తీ అయ్యారు.


మహమూద్ గవాన్ మరణానంతరం బహమనీ రాజ్యం బలహీనపడింది. గోల్కొండ, బీజాపూర్, అహ్మద్ నగర్, బేరార్, బీదర్ అనే అయిదు ముక్కలుగా చీలిపోయింది. చివరికి అవన్నీ 17వ శతాబ్దం నాటికి మొగల్ సామ్రాజ్యంలో విలీనం అయిపోయాయి.

ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య సాంస్కృతిక వారధిగా బహమనీ రాజ్యం వ్యవహరించింది. అక్కడ ప్రత్యేకమైన సంస్కృతి విలసిల్లింది. ఇది ఉత్తరభారతదేశ సంస్కృతికంటే విభిన్నమైనది. ఆ సంస్కృతి, ఆచారాలు ఆ తర్వాత కాలంలో కూడా కొనసాగుతూవచ్చాయి.

(తరువాయి వచ్చే మాసం)

ఈ మాసం ప్రత్యేకం

# ఇన్‌ఫ్లుయన్సర్ల శకంలో మేధావుల పాత్ర



రచయిత ఢిల్లీకి చెందిన స్వతంత్ర జర్నలిస్టు

సభా గుర్మత్

**2014** అక్టోబరు నెలలో మోడీ ప్రధానిగా బిజెపి కేంద్రంలో అధికారం చేపట్టిన నాలుగు నెలల తర్వాత, ఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో ప్రముఖ చరిత్రకారిణి ప్రొఫెసర్ రొమిలా థాపర్ చేసిన ప్రసంగం నేడు గుర్తుచేసుకుంటే ఆమె భవిష్య వాణి చెప్పినట్లు అనిపిస్తుంది. నిఖిల్ చక్రవర్తి తృతీయ స్మారకోపన్యాసంలో ప్రసంగిస్తూ ఆమె భారత ప్రజాస్వామిక పరికల్పనకు కేంద్ర బిందువైన ప్రజారంగ మేధావుల పాత్ర ప్రమా దాన్ని ఎదుర్కోనున్నది అని హెచ్చరించారు.

''ఇవాళ మన దేశంలోని అనేక రంగాలలో గొప్పగొప్ప వృత్తి నిపుణులు ఉ న్నారు. కానీ ఇవాళ వారిలో చాలామంది తమ నైపుణ్యానికి సంబంధించిన పని పట్ల నిరాసక్తంగా ఉన్నారు. ప్రజారంగ మేధావుల పని వీళ్ళు తలకెత్తు కున్నట్లు చెప్పుకొస్తున్నారు. అయితే ఈ ఇద్దరూ ఒకటి కాదు. ఉదాహరణకి చూసుకుంటే గతంలో కంటే ఇవాళ విద్యావేత్తలు, మేధావులు తామరతంపరగా వెలుగులోకి వచ్చారు. కానీ వీళ్ళెవరూ అధికారాన్ని ప్రశ్నించరు. వాక్ స్వాతంత్ర్యాన్ని హరిస్తున్నా నోరు తెరవకుండా గమ్మున ఉ ండిపోతున్నారు" అని ఆ రోజునే రొమిలా థాపర్ హెచ్చరించారు.

ఆరోజు ఆమె చేసిన ఉపన్యాసం ఆ సాయంత్రంతో ముగిసిపోలేదు. మరుసటి ఏడాది వరకూ కొనసాగాయి. ఆ ప్రసంగ పాఠాలు వ్యాసాల రూపంలో 'ది పబ్లిక్ ఇంటలెక్చువల్ ఇన్ ఇండియా' పేరిట ఒక పుస్తకంగా వెలువడ్డాయి. ఇవాళ ఇంటర్నెట్ కనెక్షన్ ఉండి మైక్రోఫోన్ అందుబాటులో ఉ న్న ప్రతి ఒక్కరూ ప్రవచనకారుల్లా అత్యంత విశ్వాసంతో జనానికి ఏదో ఒకటి బోధిస్తూ ఉన్నారు. ఇక దశాబ్దం క్రితం అయితే రాజకీయ ఆవరణలో రచయితల, కళాకారుల, మేధావుల, ఆలోచనాపరుల పాత్ర ఏమిటి అన్న అంశంపై చర్చోపచర్చలు నడిచేవి. ఇవాళ ఆధునిక మేధావుల ఆవిర్భావాన్ని 19వ శతాబ్దంలో ఫ్రాన్స్‌లో జరిగిన డ్రేయిఫస్ వ్యవహారంతో పోల్చి చెప్పారు రొమిలాథాపర్. ఫ్రెంచి సైన్యంలో కెప్టెన్‌గా పనిచేసిన ఆల్ఫ్రెడ్ డ్రెయిఫస్ దేశద్రోహానికి పాల్పడ్డాడు అనే ఆరోపణ మీద శిక్షకు గురయ్యాడు. అతను నిరపరాధి అని ఒక వర్గం, అపరాధి అని మరో వర్గం వాదిస్తూ ఫ్రెంచి సమాజం నిట్టనిలువునా రెండుగా చీలిపోయింది. మిలిటరీ, చర్చి అతనిని దోషిగా భావిస్తే, పౌరసమాజం నిరపరాధిగా భావించింది. అంతిమంగా డ్రెయిఫస్‌ను పున: విచారణ చేసి నిరపరాధిగా తేల్చి తిరిగి సైన్యంలో నియమించారు. ఈ ఘటన తర్వాత ఫ్రెంచిలో రాజకీయాల నుండి మతాన్ని వేరు చేస్తూ చట్టం తీసుకువచ్చారు. ప్రముఖ రచయిత ఎమిలీజోలా ఈ వివాదంలో జోక్యం చేసుకుని ఒక బహిరంగ లేఖ రాస్తూ డ్రేయిఫస్‌ను శిక్షించడంలో ఫ్రెంచి సైన్యం, రాజకీయ నాయకులు, ఇతర అధికార గణం పక్షపాత ధోరణితో వ్యవహరించారని విమర్శించారు. దీంతో వందలాది మంది రచయితలు, కళాకారులు, మేధావులు ఎమిలీ జోలాతో గొంతు కలిపారు. అంతిమంగా ఇది ప్రజా ఉద్యమంగా మారి డ్రేయిఫస్‌ను నిర్దోషిగా తేల్చింది. ఈ పరిణామం తర్వాత 'ప్రజారంగ మేధావులు' అన్న భావనకు ఒక రూపం వచ్చింది. ప్రజారంగ మేధావి అంటే అతనో / ఆమో కేవలం ఒక పండితుడో, విద్యావేత్తో అయి తీరాలన్న నియమ నిబంధనలు ఏమీ లేవు. ఏ రంగంలో అయినా నిష్ణాతులుగా గుర్తింపబడినవారు ప్రజల పక్షాన జవాబుదారీ తనం కోసం నిలబడవచ్చు, అధికారాన్ని ప్రశ్నించవచ్చు, అసమ్మతిని ప్రకటించవచ్చు. ప్రత్యేకించి 'పౌరహక్కులు, సామాజిక పక్షాన గొంతు విప్పాలి' అంటారు రొమిలాథాపర్.

అయితే మన దేశంలో ప్రజారంగ మేధోసంస్కృతి నెలకొనడం అంత తేలిగ్గా సాధ్యపడలేదు. కుల, వర్గ, అసమానతలు, వివక్ష, పితృస్వామిక భావజాలం, పరిమితమైన మీడియా, అక్షరాస్యత, వనరుల అందుబాటులో నెలకొనివున్న అసమానతలు - ఇవన్నీ ఈ రకమైన సంస్కృతి పెంపొందడానికి అవరో ధాలుగా మారాయి. ఇన్ని ఆటంకాలను అధిగమిస్తూ డాక్టర్ అంబేద్కర్ వంటి ప్రజాపక్ష మేధావి తన రచనలు, ప్రసంగాల ద్వారా సమాజం ఆలోచనా ధోరణుల మీద గణనీ యమైన ప్రభావం చూపి అప్పటి వరకూ సమాజ విస్మరణకు సరయిన కులవివక్ష, అంటరానితనం సహా అనేక అంశాలను దేశవ్యాప్త చర్చకు దారితీసేలా చేసారు. 2,000వ సంవత్సరంలో అరుంధతీరాయ్, రామచంద్రగుహ ఒకరితో ఒకరు తలపడడం, భారతీయ పాఠకులు, మీడియా వీక్షకులు గమనించే ఉంటారు.

'బుకర్' బహుమతి గ్రహీత అయిన అరుంధతీరాయ్ తదనంతర కాలంలో రాజకీయ అధికార యంత్రాంగం పట్ల విమర్శనాత్మక ధోరణితో కూడిన కాల్పనికేతర సాహిత్యాన్ని విరివిగా వెలువరించారు. కశ్మీర్‌లో, ఛత్తీస్‌ఘడ్‌లో రాజ్యహింసను ఖండిస్తూ సాహిత్యం వెలువరించారు. 'నర్మదా బచావో ఆందోళన్'కు బాసటగా నిలిచారు. కేవలం రచనలకే పరిమితం కాకుండా బహిరంగ వేదికలు, హాల్ మీటింగ్స్‌లో ప్రసంగించారు. నిరసన కార్యక్రమాల్లో ప్రత్యక్షం గా పాల్గొన్నారు. అదే సందర్భంలో ప్రముఖ చరిత్రకారుడయిన రామచంద్ర గుహ హిందూ తదితర పత్రికలలో ఓపెన్-ఎడిటోరి యల్ కాలమ్‌లో అరుంధతీ రాయ్‌తో విభేదిస్తూ నర్మద వంటి భారీ డామ్‌ల నిర్మాణానికి అనుకూలంగా అనేక వ్యాసాలు రాసారు. ఈ వాదసంవాదాలు భారతీయ వ్యవస్థల పట్ల అతనికి నమ్మకం కలిగించాయి. ఉదారవాద ప్రజాస్వామ్యాన్ని తను బలపరచాలి అని భావించాడు.

వ్యాసాలు, ఇంటర్వ్యూలు, బహిరంగ వేదికల మీద చర్చలలో ఇలాంటి వాదసంవాదాలు చోటు చేసుకోవడం సహజం. ప్రముఖ సామాజికవేత్త ఆషిస్ నంది 2013లో జైపూర్ లిటరరీ ఫెస్టివల్‌లో చేసిన వ్యాఖ్యలు

పెద్ద అలజడి సృష్టించాయి. వారం రోజుల పాటు టీవీలలో చర్చోపచర్చలు నడిచాయి. 2016లో జీన్యూస్ తదితర న్యూస్ ఛానల్స్ జె.ఎన్.యు. విశ్వవిద్యాలయ విద్యార్థులు భారత వ్యతిరేక నినాదాలు ఇచ్చారని తప్పుడు వార్తలు ప్రసారం చేసి వారి మీద దేశద్రోహం కేసులు నమోదు అయ్యేలా కుట్ర పూరితంగా వ్యవహరించాయి. ఈ సందర్భంగా 'జె.ఎన్.యు.కు అండగా నిలబడదాం' పేరిట దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున సంఘీభావ ఉద్యమం నడిచింది. ఇందులో భాగంగా జాతీయత, అసమ్మతి, ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాలకు మద్దతు వంటి అంశాలపై బహిరంగ సభలు నిర్వహించబడ్డాయి. అనేక వ్యాసాలు, ఇంటర్వ్యూలు ప్రచురితం అయ్యాయి.

రోహిత్ వేముల బలవన్మరణం, జె.ఎన్.యు. విద్యార్థి ఉద్యమాల సందర్భంగా ఒక దశాబ్దం క్రితం జరిగిన సజీవమైన చర్చలు, వాదోపవాదాలకు ఇవాళ ఆస్కారం ఉండే పరిస్థితులు లేవు.

**కూలిన ప్రజా కూడలి**

ప్రజాక్షేత్రంలో మేధావులకు తగిన గుర్తింపు ఉండేది. అమర్త్యసేన్, అరుంధతిరాయ్, రామచంద్ర గుహ తదితర అనేక మంది మేధావులకు విశ్వవిద్యాలయాలు నీరాజనాలు పట్టేవి. ఇర్ఫాన్ హబీబ్, రొమిలా థాపర్ వంటి చరిత్రకారులు ప్రజాస్వామ్యం, అసమ్మతి వంటి భావాలకు నూతన వ్యాకరణం కల్పించారు. వీరి ఆలోచనలు ఆదివారం పత్రిక సంపాదకీయాలుగా, ప్రైమ్-టైమ్ చర్చలుగా, విశ్వవిద్యాలయాల్లో పాఠాలుగా అలరారాయి. విమర్శనాత్మక దృక్పథం జాతి నైతిక, రాజకీయ విలువలకు దిశానిర్దేశం చేస్తుంది అన్న సదుద్దేశ్యంతో కొంతమందే అయినప్పటికీ అటువంటి ఆలోచనాపరులు చర్చలు, సంవాదాలలో చురుగ్గా పాల్గొనేవారు.

ఇవాళ అటువంటి నిర్మాణాత్మక ప్రపంచం నిశ్శబ్దంగా కూలిపోయింది. ప్రజా క్షేత్రం ఆన్-లైన్‌కు బదిలీ అయ్యింది. వాదోపవాదాలు, చర్చల భాషా, భావ వినిమయం స్థానే ఇన్‌ఫ్లుయర్స్‌ల వ్యాకరణం వచ్చి చేరింది. పత్రికా ప్రచురణా రంగం అథోముఖం పట్టింది. మేధావుల స్థానాన్ని 'పాడ్‌కాస్ట్'లు చేసేవారు. మోటివేషనల్ స్పీకర్లు, లైఫ్‌స్టైల్ కామెంటేటర్లు, మితవాద శక్తుల ఐ.టి.సెల్‌లు ఆక్రమించాయి. వీళ్ళంతా విమర్శనాత్మక దృక్పథంతోనో, నూతన ఆలోచనలతోనో కాక కల్పిత బాధిత కథనాలతో, ఆహార్యం, ఉచ్ఛారణలతో ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

> **" ఇవాళ అటువంటి నిర్మాణాత్మక ప్రపంచం నిశ్శబ్దంగా కూలిపోయింది. ప్రజా క్షేత్రం ఆన్-లైన్‌కు బదిలీ అయ్యింది. వాదోపవాదాలు, చర్చల భాషా, భావ వినిమయం స్థానే ఇన్‌ఫ్లుయర్స్‌ల వ్యాకరణం వచ్చి చేరింది. పత్రికా ప్రచురణా రంగం అథోముఖం పట్టింది. మేధావుల స్థానాన్ని 'పాడ్ కాస్ట్'లు చేసేవారు, మోటివేషనల్ స్పీకర్లు, లైఫ్‌స్టైల్ కామెంటేటర్లు, మితవాద శక్తుల ఐ.టి.సెల్‌లు ఆక్రమించాయి. "**



**నర్మదా డామ్ నిర్మాణం మీద సుప్రీంకోర్టు తీర్పుని నిరసిస్తూ 2000 అక్టోబర్ 27న భోపాల్‌లో జరిగిన ప్రదర్శనలో మేధాపాట్కర్‌తో కలిసి పాల్గొన్న అరుంధతీ రాయ్**

ప్రస్తుతం యూట్యూబర్లు, కుహనా చరిత్రకారులు ఇన్‌స్టాగ్రాం ఇన్‌ఫ్లుయన్సర్ల హవా నడుస్తున్నది. విమర్శనాత్మక ఆలోచనావరులు, చైతన్యయుతమైన రచయితలు గతకాలపు వైభవాలుగా మిగిలారు. నూతన శకపు ఇన్‌ఫ్లుయన్సర్లు మేధస్సుతోనో అసమ్మతి గళం వినిపించడంతోనో కాక ఆన్‌లైన్ ఫాలోయర్ల సంఖ్యా విస్తృతి, ఆన్‌లైన్‌లో చురుగ్గా ఉండడం ద్వారా మేధావులుగా గుర్తింపు పొందుతున్నారు.

వైరల్ క్లిప్‌లు, మీమ్స్, లైక్స్, షేర్స్ వంటి అల్గరిథం ఆధారిత ఉనికి, ప్రశస్తిలు వివాదాస్పదమైన చర్చలను, సంవాదపూరిత రచనలను పక్కకి నెట్టేసాయి. దీంతో స్వయంప్రకటిత వింతవాద భావజాల మేధావులు పెద్దఎత్తున చలామణీలోకి వచ్చారు. ఇదే సందర్భంలో దేశవ్యాప్తంగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు అప్రకటిత నిషేధం నీడన మనుగడ సాగిస్తున్నాయి. ఇది యాధృచ్ఛికమైన విషయమయితే కాదు.

**విమర్శనాత్మక ఆలోచనాధోరణి వినోదభరిత 'హరాకిరి'యా?**

అమెరికన్ మీడియా సిద్ధాంతకర్త నీల్ పోస్ట్‌మాన్ 1985లో 'వినోదభరిత హరాకిరి : డాబులు ప్రదర్శించే శకంలో జన సంవాదం' పేరిట ఒక పుస్తకం వెలువరించాడు. మీడియాలో ప్రజాపక్ష సంవాదానికి గల అవకాశాల గురించి అప్పట్లోనే రాబోయే కాలంలో ఏం జరగనున్నదో సరిగ్గా అంచనా వేసి చెప్పాడు. మీడియా అనేది బహుళ ప్రజాదరణ పొందిన ఆడియో విజువల్ సంస్కృతి ద్వారా రాజకీయాల్ని, సమాజాన్ని, విద్యను కావల్సిన రీతిగా మలచడంలో, మరీ ముఖ్యంగా సమస్యలను పక్కదారి పట్టించడంలో ఎంత ప్రభావవంతంగా పనిచేస్తుందో వివరించాయి.

"జార్జి ఆర్వెల్ పుస్తకాలను నిషేధించే వారిపట్ల ఆందోళన వ్యక్తం చేసాడు. ఆల్డెక్స్ హక్స్‌లీ పుస్తకాల నిషేధానికి ఫలానా కారణం అని చెప్పనవసరం లేని రోజులు వస్తాయని ఆందోళన పడ్డాడు. పుస్తకాలు చదవాల్సిన అవసరం లేదనే పరిస్థితులు సృష్టించబడతాయి అని ఆందోళన చెందాడు. ఆర్వెల్ ప్రజా సామాన్యానికి సమాచారం అందుబాటులో లేకుండా చేస్తారని ఆందోళన పడ్డాడు. హక్స్‌లీ ఏమో గుట్టల కొద్దీ సమాచారం కుమ్మరించడం

> **“నీల్‌పోస్ట్‌మాన్ మన కాలపు భవిష్యత్తును ముందుగానే చెప్పాడు. ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో సుచింతన్‌దాస్ ఒక వ్యాసం రాస్తూ ‘ఆలోచనలకు స్వస్థి చెప్పి, ప్రజాహితం పట్ల ఎలాంటి పట్టింపు లేకుండా నిస్తేజంగా మారిన మన సమాజానికి ఇవాళ మరింత మంది ప్రజారంగ మేధావుల అవసరం ఉంది’ అని నొక్కి చెప్పాడు.”**

ద్వారా ప్రజలలో నిర్లిప్తత ఏర్పడి స్వాభిమానాన్ని కోల్పోయేలా చేస్తారని ఆందోళన పడ్డాడు. ఆర్వెల్ ఏమో ప్రజలకు ‘సత్యాన్ని’ అందకుండా చేస్తారని భయపడ్డాడు. హక్స్‌లీ ఏమో అసంగతమైన సమాచార ప్రవంతిలో పడి ‘సత్యం’ కొట్టుకుపోతుంది అని భయపడ్డాడు. ఆర్వెల్ ఏమో మనం అందరం బందిఖానా వంటి సంస్కృతిలో ఇరుక్కుపోతాం అని ఆందోళన చెందితే హక్స్‌లీ ఏమో మన మంతా సంస్కృతి బాధితులంగా తయారవు తామేమో అని భయపడ్డాడు” అని నీల్‌పోస్ట్‌మాన్ రాసుకొచ్చాడు.

నీల్‌పోస్ట్‌మాన్ మన కాలపు భవిష్యత్తును ముందుగానే చెప్పాడు. ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో సుచింతన్ దాస్ ఒక వ్యాసం రాస్తూ ‘ఆలోచనలకు స్వస్థి చెప్పి, ప్రజాహితం పట్ల ఎలాంటి పట్టింపు లేకుండా నిస్తేజంగా మారిన మన సమాజానికి ఇవాళ మరింత మంది ప్రజారంగ మేధావుల అవసరం ఉంది’ అని నొక్కి చెప్పాడు.

గత కొన్ని దశాబ్దాల భారతదేశ అనుభవాన్ని పరిశీలిస్తే అతి కొద్దిమంది వ్యక్తులు మాత్రమే రాజకీయ – సామాజిక కట్టుబాట్లను ప్రశ్నించడం, తెరమరుగు అయిపోతున్న ఆదర్శాలను, విశాల భావాలను తిరిగి ప్రజాక్షేత్రంలో నిలబెట్టడానికి ప్రయత్నించడం, సమాజం అంచులకు నెట్టివెయ్యబడిన అణగారిన ప్రజానీకం సమస్యలను లేవనెత్తడంలో అత్యంత క్రియాశీలంగా పనిచేస్తున్నారు. అయితే గత రెండు దశాబ్దాలుగా సాంస్కృతిక ప్రవచనకారులు, వాగుడుకాయలు బుల్లితెరను ఆక్రమించేసి ప్రజారంగ మేధావులుగా చలామణి అయిపోతున్నారు.

న్యూస్ ఛానళ్ళు గత దశాబ్దకాలంగా సుహేల్ సేథ్ వంటి కుహనా మేధావులను, ఆనంద్ రంగనాథన్ వంటి మితవాద శక్తుల వాగుడుకాయలను, సామాజిక మాధ్యమాల సెలబ్రిటీలను దేశ కాలమాన పరిస్థితులను విశ్లేషించే మేధావులుగా చలామణిలోకి తీసుకువచ్చాయి. సమాచారానికి, సమాజానికి మధ్య మధ్యవర్తిత్వం నెరపేవాళ్ళు వ్యాఖ్యాతలు, పండితులు, కుహనా చరిత్రకారుల అవతారం ఎత్తారు. టీవీ, యూట్యూబ్ ఛానళ్ళు ఇలాంటి ‘నిష్ణాతులను’ వందలు వందలుగా తెరమీదకి తీసుకువచ్చాయి.

మన దేశంలో టీవీ సంస్కృతి 90వ దశకంలోనే మొదలయినా 2000–2010 మధ్యకాలంలో ‘పాడ్‌కాస్ట్’ వంటి కొత్త మీడియా బాగా ఊపందుకున్నది. లోతైన పరిశీలన, పరిశోధన, విచికిత్సలతో జరగాల్సిన ఇంటర్వ్యూలు ప్రేమపూర్వక ఇచ్చకాలుగా, అమెరికా కేంద్రంగా ధృవ రాఘవన్, జోయోజీత్ పాల్‌లు సంయుక్తంగా ఈ మధ్యన సాగించిన పరిశోధనలో టీవీ, డిజిటల్ న్యూస్ మీడియాలు నిర్వహించే రాజకీయ ఇంటర్వ్యూలను యూట్యూబర్ల, ఇన్‌ఫ్లుయన్సర్ల ఇంటర్వ్యూలు దాదాపుగా పక్కకి నెట్టేసాయని తేల్చి చెప్పారు.

నిఖిల్ కామత్ అనే ఔత్సాహిక పారిశ్రామికవేత్త ఇన్వెస్టర్ డబ్ల్యూటిఎఫ్ పాడ్‌కాస్ట్‌ను నిర్వహిస్తున్నాడు. ఆ మధ్యన ప్రధాని నరేంద్ర మోడీతో నిర్వహించిన పాడ్‌కాస్ట్ చూస్తే అది డ్రాయింగ్‌రూం ముచ్చట్లుగా అనిపించాయి తప్ప మరొకటి కాదు. ప్రముఖ జర్నలిస్టు కరణ్‌థాపర్ మోడీతో చేసిన ఇంటర్వ్యూతో పోలిస్తే ఇది ఎంత పేలవంగా ఉందీ అర్థం చేసుకోవచ్చు. స్మితా ప్రకాష్ న్యూస్ మీడియాతో పాటు పాడ్‌కాస్ట్ కూడా నిర్వహిస్తుంది. ప్రకార్ గుప్తా, బీర్ బైసెప్స్, సందిష్ భాటియా వంటి యువతరం గుర్తింపు పొందిన సామాజిక వేత్తలు, రాజకీయ నాయకులతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. వీరిలో భాటియా మాత్రం విమర్శనాత్మక ప్రశ్నలు లేవనెత్తుతుంటాడు కానీ వీళ్ళలో ఎవరూ సమాచారాన్ని వినోదంగాను, శాస్త్రీయమైన విమర్శను సాదాసీదా సంవాదంగానూ మార్చేస్తున్న వైనాన్ని సవాలు చెయ్యడం లేదు. వాస్తవానికి ఇంటర్వ్యూలు స్నేహపూర్వక సంభాషణలకు బదులుగా అసౌకర్యాన్ని కలిగించే ప్రశ్నల పరంపర సంధించేలా కొనసాగాలి. ‘కాఫీ విత్ కరణ్’ పేరిట కరణ్‌థాపర్ నిర్వహించే ఇంటర్వ్యూలలో సాగే వాడివేడి చర్చలతో పోలిస్తే ఇవాళ పాడ్‌కాస్టర్లు పార్లమెంట్ సభ్యులతో ఇష్టపూర్వక సంభాషణలు జరిపి వాటినే ఇంటర్వ్యూలుగా మార్కెట్ చేస్తున్నారు.

అమెరికాలో అగ్రశ్రేణి దినపత్రిక అయిన న్యూయార్క్‌టైమ్స్, న్యూయార్కర్‌లతో పాటు మన దేశంలోని ప్రధానస్రవంతి దినపత్రికలు కూడా రీల్స్, షార్ట్స్, పాడ్‌కాస్ట్‌లు నడుపుతూ ఉన్నాయి. పత్రికా మాధ్యమం ఇవాళారేపూ సంక్లిష్టతలను ప్రోత్సహించడం లేదు. పుస్తకాలు, లోతైన సమాచారం, లెక్చర్లు – వీటన్నింటినీ 30 సెకండ్ల క్లిప్స్‌గా వేడివేడిగా వండి వార్చేస్తున్నారు.


ఉన్నతమైన అకడమిక్ చర్చలను అద్దాల మేడల్లో కూర్చున్నవాళ్ళ పాండితీప్రకర్షగా తీసిపారేస్తున్నారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గత ఏడాది నిర్వహించిన ‘ఐడియా ఎక్స్ఛేంజ్’ కార్యక్రమంలో పాల్గొన్న విలియం డార్లింపుల్ తన వ్యాఖ్యాలతో సంచలనాత్మక చర్చకు తెర లేపాడు. భారత దేశంలోని చరిత్రకారులు సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో రచనలు చెయ్యడంలో విఫలమయినందునే ఇవాళ దేశంలో వాట్సప్ యూనివర్సిటీ పంపిణీ చేసే చరిత్రయే అసలైన చరిత్రగా చలామణి అవుతోందని డార్లింపుల్ విమర్శించాడు. ఈ విమర్శను పూర్తిగా కొట్టిపారెయ్యడానికి లేదు. ఎందుకంటే ఇప్పటికీ అనేకమంది చరిత్రకారులు, మేధావులు తాము ప్రత్యేక తరగతికి చెందినవారం అనే రీతిలో నాటి మేధావుల సమీక్షకు, పొగడ్తలకు అర్హమైన, సామాన్యులకు అనువుగాని భాషలో రచనలు చేస్తున్నారు. అయితే స్క్రోల్ వెబ్‌పత్రికా విలేరి షోయబ్ డానియల్ మాత్రం “వాట్సప్ చరిత్ర ఆధిపత్య సామజిక, రాజకీయ శక్తుల సంకల్పిత సృష్టి” అంటాడు. ‘నెహ్రూ హయాంలో మనం ఇలాంటి పెదధోరణులను చూడం. ఆ కాలపు రాజకీయాలు ఇలాంటి తప్పుడు చరిత్రకు ఆస్కారం ఇచ్చేవి కావు. లోతైన పరిశోధనల ఆధారంగా రూపొందించిన ప్రామాణికమైన చరిత్రకు మాత్రమే స్థానం ఉండేది’ అని వివరించాడు.

ప్రపంచవ్యాప్తంగా ఇవాళ మితవాద, పచ్చి మితవాద శక్తుల ప్రాబల్యం పెరుగుతూ రావడం మూలంగా మేధోవ్యతిరేక ధోరణులు కూడా ప్రబలిపోతున్నాయి. అధికార వర్గాలు ప్రజారంగ మేధావులను, విమర్శనాత్మక

ధోరణులను పూర్వపక్షం చేసి డాబుసరి వాగుడుకాయలకు ఎక్కడలేని ప్రాధాన్యత కల్పిస్తున్నారు. నిబద్ధత స్థానే వాచాలత్వం సాధికారతగా చలామణి అవుతున్నది. ఇదేదో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన పర్యవసానంగా వచ్చిందని మనం భావించ కూడదు. పాలకశక్తులు తమ వర్గ ప్రయోజనాలకు అనుగుణంగానే ప్రజారంగ మేధావులను, సునిశిత ఆలోచనాపరులను పక్కకి తప్పించి ఇటువంటి ప్రతీపశక్తులను ప్రోత్సహిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే సాయిదీపక్, ఆనంద్ రంగనాథన్, విక్రమ్ సంపత్ వంటి వాద మితవాద భావజాల మేధావులుగా చలామణీ అవుతున్నారు. పాడ్‌కాస్ట్ సంస్కృతిని అపసవ్యమార్గం పట్టించడంలో వీళ్ళు ముందున్నారు.

పేరు తెచ్చుకోవడానికి ఏళ్లతరబడి అధ్యయనం, పరిశోధన, కార్యాచరణ ఇవేవీ అక్కర్లేదు. ఇప్పుడు నిమగ్నతా ప్రదర్శనా సామర్థ్యం ఉంటే చాలు. అధికారపు వెన్నుదన్ను ఉంటే చాలు. ఆల్గరిథమ్ ఆట నీకు అనుకూలంగా మారిపోతుంది. ఇటువంటి వాతావరణంలో అసమ్మతి మీద ఏదో ఒక ముద్ర వెయ్యడం సాదాసీదా అయిన విషయంగా మారిపోయింది.

“ పేరు తెచ్చుకోవడానికి ఏళ్లతరబడి అధ్యయనం, పరిశోధన, కార్యాచరణ ఇవేవీ అక్కర్లేదు. ఇప్పుడు నిమగ్నతా ప్రదర్శనా సామర్థ్యం ఉంటే చాలు. అధికారపు వెన్నుదన్ను ఉంటే చాలు. ఆల్గరిథమ్ ఆట నీకు అనుకూలంగా మారిపోతుంది. ఇటువంటి వాతా వరణంలో అసమ్మతి మీద ఏదో ఒక ముద్ర వెయ్యడం సాదాసీదా అయిన విషయంగా మారిపోయింది. ”



**2016 మార్చి 6వ తేదీన ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయం వద్ద ప్రదర్శనలో ప్రముఖ చరిత్రకారిణి రొమిలా థాపర్, హర్బన్స్ ముఖియా తదితరులు**

### ప్రభుత్వ విశ్వవిద్యాలయాల క్షీణదశ – చెరసాల పాలవుతున్న అసమ్మతి

ఇది కేవలం సాంస్కృతిక మార్పుకాదు. ఇది లోతైన రాజకీయ ప్రక్రియ. బడాబడా టెక్ కంపెనీలు లాభాలు పోగేసుకోవడం కోసం ప్రజల వ్యక్తిగత గోప్యతను దురాక్రమిస్తున్నాయి. కమ్యూనిటీ తత్వాన్ని ప్రోది చెయ్యడానికి బదులు పరాయీకరణకు గురిచేస్తున్నాయి. అన్ని నైతిక విలువలకూ తిలోదకాలు ఇచ్చేసి కృత్రిమ మేధను ముందుకు తీసుకువచ్చాయి. టెక్ వేదికలు మానవీయ సంబంధాలను, విమర్శనాత్మక ఆలోచనా ధోరణులను, సృజనాత్మక శక్తిని, అసమ్మతిని డొల్ల చేసి పారేస్తున్నాయి.

ఈ వేదికలు తప్పుడు ఆలోచనలకు కావల్సినంత స్థానం కల్పిస్తున్నాయి. కబుర్ల రాయుళ్ళు హీరోలుగా వెలిగిపోతున్నారు. ఒకప్పుడు భారతీయ మేధోజీవితా‘లకు ప్రతిరూపాలయిన సంస్థలను గుల్లబార్చేస్తున్నారు. శూన్యాన్ని మిగిల్చి పేరుప్రతిష్టలకోసం సందేహాలకు ఆస్కారం ఇవ్వని ఆలోచనలను విడతలు విడతలుగా ప్రత్యామ్నాయాలుగా ముందుకు తీసుకువస్తున్నారు.

ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు మేధో నిలయాలుగా, అసమ్మతి కేంద్రాలుగా విలసిల్లేవి. ఉన్నత విద్యను ప్రేవేటీకరించడం ద్వారా చర్చలకు, ప్రజాస్వామిక విమర్శనాత్మక ఆలోచనలకు స్థానం లేకుండా చేస్తున్నారు. విశ్వవిద్యాలయాలు ఇవాళ సైద్ధాంతిక ఘర్షణలకు యుద్ధక్షేత్రాలుగా మారాయి. అత్తెసరు జీతాలు తప్ప శాశ్వత ప్రయోజనాలు పొందలేని అడ్‌హాక్ బోధనా సిబ్బందితో తరగతుల నిర్వహణ నడిచి పోతోంది. విశ్వవిద్యాలయాలలో భావ ప్రకటనా స్వేచ్ఛకు అంటకత్తెర వేస్తున్నారు. విశ్వవిద్యాలయ పాలనా యంత్రాంగం, రాజకీయాధికార యంత్రంగా రెండూ కలిసి బోధనా స్వేచ్ఛను కట్టడి చేస్తున్నాయి. ప్రభుత్వం నుండి కేటాయించాల్సిన నిధుల్లో కోత విధిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న హిందూత్వ జాతీయవాద ప్రభుత్వం జామియా మిలియా, అలీఘర్ ముస్లిం యూనివర్సిటీల పట్ల శత్రుపూరిత వైఖరిని అవలంబిస్తున్నది. అశోక, అజీమ్ ప్రేమ్‌జీ వంటి ప్రైవేటు విశ్వవిద్యాలయాలు ఉదారవాద ధోరణులతో కూడిన కోర్సులు నిర్వహిస్తున్నప్పటికీ మెజారిటీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో రిజర్వేషన్లు అమలు కాకపోవడం, చదువులు ప్రియం కావడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి.

ఇక మీడియా సంగతి చెప్పనక్కర్లేదు. ఇది కార్పొరేట్ సంస్థలకు, అధికార పార్టీకి ఊడిగం చేస్తోంది. జర్నలిస్టులకు, ‘కంటెంట్’ ఉత్పత్తి చేసేవాళ్లకు మధ్యన తేడా తెలియకుండా పోతోంది. పత్రికలను గుప్పిట్లో పెట్టుకోవడానికి వాటికి వచ్చే ప్రకటనల ఆదాయానికి గండికొట్టడం పరిపాటిగా మారింది. దానికి తోడు అప్రకటిత సెన్సార్‌షిప్ కొనసాగుతోంది. ఈ కారణాల రీత్యా ప్రధాన స్రవంతి పత్రికలు పరిశోధనాత్మక కథనాలకు, విమర్శనాత్మక సంపాదకీయాలకు స్వస్థి పలికేసాయి. వ్యాసాలు, ఓపెన్ ఎడిటోరియల్స్ రూపంలో మాత్రమే ప్రభుత్వ విధానాలపై విమర్శలను అచ్చేస్తున్నాయి.

ఒక విధమైన నిశ్శబ్దం తాండవిస్తోంది. ఇవాళ విశ్వవిద్యాలయాల నుండి ఒక ఇర్ఫాన్ హబీబ్, ఆనంద్ తెల్తుంబ్డే వంటి చరిత్రకారులు తయారవుతారని కానీ, అలాంటి వారికి స్థానం ఉంటుందని కానీ ఆశించడం అత్యాశే. మెయిన్‌స్ట్రీమ్ వారపత్రిక వ్యవస్థాపక సంపాదకుడు నిఖిల్ చక్రవర్తి, పత్రికా స్వేచ్ఛను ఎలుగెత్తి చాటిన వైర్ వెబ్‌పత్రిక సంపాదకుడు సిద్ధార్థ వరద రాజన్‌ల మీద కేసుల మీద కేసులు మోపి ప్రభుత్వం వేధిస్తున్నది. భారతదేశ శిఖర

> **"అసమ్మతి అనేది సౌందర్యాత్మ కంగా ఆహ్లాదాన్ని పంచే అంశం కాదు. ఆలోచనలు అనేవి సరుకులు కాదు, మేధోపర మైన ప్రక్రియలు. ఉమర్ ఖాలిద్, గౌతమ్ నవ్‌లఖా, ఆనంద్ తెల్తుంబ్డే వంటి స్కాలర్లు, రచయితలు, సామాజిక కార్య కర్తలు నిర్బంధానికి గురయి జైళ్ళ పాలయి ఉన్నారంటే దాని అర్థం భారతదేశ ప్రజారంగ మేధావులు యూట్యూబ్ వీడియో లోనో, ఇన్‌స్టా రీల్స్‌లోనో కనబడడానికి బదులు ఏ జైలుకొట్టం లోనో మనకు దర్శనమిస్తారు."**

సమానమైన చరిత్ర కారిణి రొమిలా థాపర్ మీద కేంద్ర ప్రభుత్వం 'దేశద్రోహి' అన్న ముద్ర వేసింది. రొమిలా థాపర్‌ను తెరమరుగు చెయ్యడానికి కావల్సిన అన్ని ప్రయత్నాలు చేసింది. దీనిమూలంగా వ్యక్తిగతంగా ఆమెకు జరిగిన నష్టం ఏమీలేదు. అధికారాన్ని ప్రశ్నించడాన్ని ఎంతమాత్రం సహించలేని భాజపా ప్రభుత్వం అసమ్మతిని అణిచివేసి ప్రతి ఒక్కరినీ తన దారికి తెచ్చుకోవాలని చూస్తోంది.

ఇంతటి సంక్లిష్ట పరిస్థితులలో కూడా ఆశాజనకమైన అనేక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. యువ స్త్రీవాదులు, దళితులు, కులవివక్ష వ్యతిరేక కళాకారులు, రచయితలు, డిజిటల్ యాక్టివిస్టులు, యువ ముస్లిం గళాలు – ఇలా అనేకులు దేశవ్యాప్తంగా పబ్లిక్ చర్చకు తిరిగి ప్రాణప్రతిష్ఠ చేస్తున్నారు. విమర్శనాత్మక ఆలోచనలను నలుదిశలా వ్యాపింపచేస్తున్నారు. ఇంటర్నెట్, వర్తమాన ప్రజా సంస్కృతి సంప్రదాయ అడ్డుగోడలను అధిగమించేదానికి తోడ్పడుతున్నది. ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా ప్రత్యామ్నాయ భావ జాలాన్ని బలంగా ప్రచారంలోకి తీసుకువస్తు న్నారు. వీళ్ళకి సంస్థాగత బలిమి లేకపోవచ్చు కానీ మేధోపర సహజ గుణాలయిన ప్రశ్నించే ధోరణి, విమర్శనాత్మక దృక్పథం మెండుగా ఉన్నాయి. ఇవే వారి బలం.

అయితే డిజిటల్ మాధ్యమం ఇలాంటి ప్రతిఘటనను ఎంతమేరకు అనుమతిస్తుంది అనేది కీలకమైన సవాలు. ఈ మాధ్యమం మూసధోరణులకు పెద్దపీట వేస్తోంది. భిన్న మైన, ప్రశ్నించే ధోరణులను లోపాయకారీగా అణిచివేస్తోంది. అసమ్మతి అనేది సౌందర్యాత్మ కంగా ఆహ్లాదాన్ని పంచే అంశం కాదు. ఆలోచనలు అనేవి సరుకులు కాదు, మేధోపరమైన ప్రక్రియలు. ఉమర్ ఖాలిద్, గౌతమ్ నవ్‌లఖా, ఆనంద్ తెల్తుంబ్డే వంటి స్కాలర్లు, రచయితలు, సామాజిక కార్యకర్తలు నిర్బంధానికి గురయి జైళ్ళ పాలయి ఉన్నారంటే దాని అర్థం భారతదేశ ప్రజారంగ మేధావులు యూట్యూబ్ వీడియోలోనో, ఇన్‌స్టా రీల్స్‌లోనో కనబడడానికి బదులు ఏ జైలుకొట్టంలోనో మనకు దర్శనమిస్తారు.

**(అనువాదం: కె. సత్యరంజన్)**

# కార్మికులకు ఏ హక్కులూ లేకుండా చేసే కుట్ర

(10వ పేజీ తరువాయి)

శ్లోకం చెబుతున్నది. మంగలిని తగిలితే స్నానం చేయాలని 6వ అధ్యాయంలోని 85వ శ్లోకం చెబుతున్నది. కానీ ఈ ఆధునిక సమాజంలో అన్ని కులాలకు చెందిన కుటుంబాల నుంచి కార్మికులుగా వస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కూడా మనుస్మృతిలో చెప్పిన సూత్రాలు ఆదర్శమా? కార్మికులలో మహిళల భాగస్వామ్యం పెంచాలంటూనే మనుస్మృతి ఆదర్శంగా చెప్పటం హాస్యాస్పదం. మనుస్మృతి ప్రకారం స్త్రీలు స్వతంత్రంగా ఏమీ చేయకూడదు. "బాలిక, యువతి లేక ముదుసలి యైనా, ఏ వయసులో ఉన్న స్త్రీ అయినా గృహ కార్యక్రములను కూడా స్వతంత్రించి చేయకూడదు. బాల్యమున తండ్రి ఆధీనమున, యౌవనమున భర్త ఆధీనమున, భర్త చనిపోయినప్పుడు పుత్రుల ఆధీనమున స్త్రీ ఉండవలెను. స్త్రీ ఎప్పుడూ స్వతంత్రంగా ఉండకూడదు. అనగా ఎవరి రక్షణ లేకుండా ఒంటరిగా ఉన్న స్త్రీ భర్త వంశమును, తల్లి వంశమును చెడగొట్టును". ఇదీ మనుస్మృతి ఐదవ అధ్యాయంలో 147, 148, 149వ శ్లోకాల్లో చెప్పిన విషయం. కుటుంబంలోని పురుషుల ఆధీనం నుంచి బయటపడితే ఆ మహిళ తన భర్త, తల్లి వంశాలను చెడగొడుతుం దంటే అర్థం ఏమిటి? ఈ అవగాహనతో పరిశ్ర మలలో మహిళలు పనిచేయడం సాధ్యమా? ఇప్పుడు రూపొందే కార్మిక విధానం కార్మికుల జీవితాలను మరింత వికసింపజేసేవిగా ఉండా లి. ఆధునిక పరిస్థితుల కనుగుణంగా అభివృద్ధి ఫలాలను అందరూ పొందే అవకాశం ఉండాలి. పని గంటలు తగ్గించడం, వేతనాలు, సౌకర్యాలు పెంచడాన్ని గ్యారంటీ చేసేదిగా ఉండాలి. ఇందుకు భిన్నంగా యజమానుల బొజ్జలు నింపేందుకు అవసరమైన విధానాన్ని మోడీ ప్రభుత్వం ప్రతిపాదించింది. మనుస్మృతి 2వ అధ్యాయంలో 94, 95వ శ్లోకాలు కోరికలకు హద్దులుండవని చెబుతున్నాయి. కోరికలు తీర్చే ప్రయత్నం వల్ల ఫలితం ఉండదని కోరికలే వదులుకోవాలని ఈ శ్లోకాలు చెబుతున్నాయి. అంటే, కార్మికులు తమ కోరికలను వదులు కోవాలి. యజమానులకు మాత్రం ఈ నీతి సూత్రాలు వర్తించవు. లాభ తృష్ణతో అనేక రెట్లు సంపద పోగేసుకునేందుకు యజమానులు ప్రయత్నించవద్దని మాత్రం బి.జె.పి. ప్రభుత్వం చెప్పదు. పైగా పెట్టుబడిదారుల లాభాపేక్షకు అనుగుణంగా విధానాలను, చట్టాలను రూపొం దిస్తున్నది. కార్మికులకు కోరికలుండకూడదు. యజమానులకు మాత్రం కోరికలుండవచ్చు. వాటిని నెరవేర్చుకునేందుకు ఏమైనా చేయవచ్చు. ఇదే మోడీ నీతి. యజమానులు చేసే నేరాలను కూడా నేరాల జాబితా నుండి తొలగించేందుకు ప్రయత్నిస్తున్నది. కార్మికుల సంఘటిత చర్యలను మాత్రం భారతీయ న్యాయ సంహితలో నేరాల జాబితాలో చేర్చుతున్నది. అంటే కార్మికులను ఆధునిక బానిసలుగా పడివుండమని చెప్పటమే. బాధ్యతలే తప్ప హక్కులు లేని స్మృతుల కాలం నాటి నీతి కార్మికులకు అమలులో ఉంటుంది. యజమానులకు మాత్రం ఆధునిక శాస్త్ర, సాంకే తిక పరిజ్ఞానాన్ని వినియోగించి లాభాలు దండు కునేందుకు వీలుగా ఆధునిక విధానాలే అమలు జరుపుతారు. ఇది దీర్ఘకాలిక విధానంగా ఉ ంటుంది. దీని అమలుకు అంతర్జాతీయ సహకా రం కూడా తీసుకుంటారట! జాతీయ, అంతర్జా తీయ విధానాల మధ్య అను సంధానం ఉ ంటుందంటున్నారు. అంటే, భారతీ య పెట్టు బడిదారుల ప్రయోజనాలు, బహుళ జాతి సంస్థలతో పాటు అంతర్జాతీయ ద్రవ్య సంస్థల ప్రయోజనాలు కూడా ఇమిడి ఉన్నా యన్న మాట! స్మృతులు, సాంస్కృతిక వారసత్వం పేరుతో ఆధునిక పెట్టుబడిదారుల సేవలో మోడీ ప్రభుత్వం తరిస్తున్నది. ఇందు కోసం కార్మికవర్గ పోరాటాలను నిరంకుశంగా అణిచి వేయడానికి సిద్ధపడుతున్నది. ఈ సవాల్‌ను ఎదు ర్కోవడానికి భారత కార్మికవర్గం సిద్ధం కావాలి. *

రాజకీయ పరిణామాలు

# రాష్ట్రాల హక్కులపై గవర్నర్ల దాడులు: సుప్రీంకోర్టు తీర్పు



రచయిత మార్క్సిస్టు పత్రిక ఎడిటోరియల్ బాధ్యులు

**ఎ.కోటిరెడ్డి**

గవర్నర్ల అధికారాలను అదుపు చేయటానికి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వమ్ముచేయటం కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ద్వారా పంపిన ప్రశ్నలపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించే విధంగా లేదు. తమిళనాడు గవర్నర్ ఆ రాష్ట్ర ప్రభుత్వం పట్ల శతృవైఖరితో వ్యవహరిస్తూ, శాసనసభ ఆమోదించిన బిల్లులకు ఆమోదం తెలుపకుండా నిలిపివేయటంపై ఆ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన బిల్లులను నిరవధికంగా నిలిపివేసే అధికారం గవర్నర్లకు లేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. శాసనసభ ఆమోదించిన బిల్లులను ఆమోదించటం, అభ్యంతరాలుంటే రాష్ట్ర ప్రభుత్వానికి తిప్పి పంపటం లేదా రాష్ట్రపతికి పంపించటం మినహా నిరవధికంగా తన వద్ద అట్టి పెట్టుకొనే అధికారం కేంద్ర ప్రభుత్వం నియమించిన గవర్నర్‌కు లేదని సుప్రీంకోర్టు తీర్పు నిచ్చింది. అప్పటి వరకు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఆమోదం పొందినట్లుగా పరిగణించాలని కూడా తీర్పులో పేర్కొంది.

సమాఖ్యవాదం, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి దోహదం చేసే ఈ తీర్పును వమ్ము చేయటం కోసం సలహా కోరటం (అడ్వైజరీ) పేరుతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ద్వారా సుప్రీంకోర్టుకు ప్రశ్నలను సంధించింది. ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం దానిపై విచారణ జరిపి, నవంబరు 20వ తేదీన తుది తీర్పు వెలువరించింది. బిల్లులను ఆమోదించటానికి గవర్నర్లకు కాలపరిమితిని విధించలేమని, కానీ గవర్నర్లు బిల్లులను తమ వద్ద నిరవధికంగా ఉంచుకోవటం కుదరదని పేర్కొంది. అపరిమితమైన జాప్యం జరిగితే, కోర్టులు పరిమితమైన ఆదేశాలు ఇవ్వవచ్చునని పేర్కొంది. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న గవర్నర్‌లను అదుపు చేయటానికి, ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయటానికి, రాజ్యాంగం రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చిన అధికారాలను అమలు జరపటానికి ఈ తీర్పు దోహదం చేయదు.

కేంద్ర ప్రభుత్వం నియమించిన గవర్నర్‌లు ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాలలోని ప్రభుత్వాల పట్ల శతృవైఖరితో వ్యవహరిస్తున్నారు. ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వాలపై అధికారం చలాయిస్తూ, రాజ్యాంగ స్ఫూర్తిని వమ్ము చేస్తున్నారు. రాష్ట్ర శాసనసభలు చేసిన చట్టాలకు ఆమోదం తెలుపకుండా నిరవధికంగా తమ వద్ద అట్టిపెట్టుకొని, పాలనకు విఘాతం కలిగిస్తున్నారు. పోటీ ప్రభుత్వాలుగా వ్యవహరిస్తూ, ఆయా రాష్ట్రాల ఆంతరంగిక వ్యవహారాలలో అనుచిత జోక్యం చేసుకొంటున్నారు. సమాఖ్యవాదం, ప్రజాస్వామ్యం పరిరక్షించబడాలంటే రాజ్యాంగం రాష్ట్రాలకు ఇచ్చిన అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాలు ఉపయోగించుకోవాలి. కానీ గవర్నర్లను అడ్డం పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కేంద్రం హరిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వాలకున్న హక్కులు, అధికారాలు కూడా కేంద్ర ప్రభుత్వం వద్ద కేంద్రీకృతం అవుతుండటంతో రాష్ట్రాలలో పాలన సక్రమంగా సాగటం లేదు. కేంద్ర ప్రభుత్వం చేతిలో అధికారం కేంద్రీకరణ కావటం దేశ సమైక్యతకు, అభివృద్ధికి విఘాతం కలిగిస్తుంది.

వివిధ జాతులు, భాషలు, సంస్కృతులతో కూడిన భారతదేశంలో ఆయా జాతుల ప్రజలు అభివృద్ధి చెందాలన్నా, వారి ఆకాంక్షలు నెరవేర్చుకోవాలన్నా అధికార వికేంద్రీకరణ తప్పనిసరి. దేశంలో విభిన్న ప్రాంతాలు, రాష్ట్రాలు, ఆయా రాష్ట్రాలలో కూడా వివిధ ప్రాంతాల మధ్య అసమానతలు ఉన్నాయి. ఢిల్లీ, మహారాష్ట్ర లాంటివి పారిశ్రామికంగా అభివృద్ధి చెందాయి. నాగార్జున సాగర్, భాక్రానంగల్ లాంటి ప్రాజెక్టుల వలన కొన్ని ప్రాంతాలు వ్యవసాయరంగంలో అభివృద్ధిని సాధించాయి. మరికొన్ని ప్రాంతాలు, ముఖ్యంగా గిరిజనులు ఎక్కువగా నివసిస్తున్న ప్రాంతాలు అన్ని విధాలుగానూ వెనుకబడి ఉన్నాయి. కొన్ని ప్రాంతాలలో ఎక్స్‌ప్రెస్ రహదారులు నిర్మిస్తుంటే, మరికొన్ని ప్రాంతాలలో సైకిల్‌పై వెళ్ళటానికి కూడా వీలైన రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదాహరణకు గిరిజన ప్రాంతంలో ప్రజలకు అత్యవసరంగా వైద్యం అవసరమైనపుడు వారు ఎదుర్కొనే బాధలు వర్ణనాతీతం. డోలీ కట్టుకొని, వాగులు, వంకలు దాటి రోగులను తీసుకొచ్చే సరికి పరిస్థితులు చేయి దాటిపోతున్నాయి. ఇటువంటి ప్రాంతాలలో అభివృద్ధిని గురించి చెప్పటం వలన ఉపయోగం లేదు. ఆ ప్రాంతాల అభివృద్ధికి, ప్రజల తక్షణ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు అత్యవసరంగా తీసుకోవాలి. అప్పుడే అభివృద్ధి అన్నమాటకు అర్థం ఉంటుంది.

విద్య పరంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలు, ప్రాంతాలు ఉన్నాయి. రాష్ట్రాలలో కూడా ప్రాంతీయంగా ఈ వ్యత్యాసం ఉన్నది. మన సమాజంలో ఉన్న కులపరమైన విభజనలు, ఆయా కులాలు నిర్వహించిన వృత్తులు తదితరాల వలన అభివృద్ధి చెందిన ప్రాంతాలలో కూడా కొన్ని కులాలకు చెందిన ప్రజలు వెనుకబడిన పరిస్థితులలోనే ఉన్నారు. విద్యావంతులు, ఉద్యోగాలు చేస్తున్న వారిలో కూడా ఈ వ్యత్యాసాలను మనం గమనించవచ్చు.

ఇంత భిన్నత్వం ఉన్న దేశంలో అధికారాలన్నీ ఒకే చోట కేంద్రీకరించబడటం అభివృద్ధికి విఘాతం కలిగిస్తుంది. వెనుకబడిన రాష్ట్రాలు, ప్రాంతాలు, తరగతుల ప్రజలను అభివృద్ధి చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన అధికారాలు, ఆర్థిక వనరులు ఉండాలి. తమ రాష్ట్రంలోని ప్రాంతాలు, ప్రజలను సమగ్రంగా అభివృద్ధి చేయటానికి తగిన విధంగా ఆ


**❝ అయితే పాలకవర్గాలు ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడులకు పూనుకున్నపుడు న్యాయవ్యవస్థ దానిని ఎదిరించి నిలబడ గలదా? రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, జాతీయో ద్యమ ప్రభావం తో సమాజంలో నెలకొన్న అభ్యుదయ భావాలను వమ్ము చేయటానికి, దేశాన్ని తిరోగమన మార్గంలో ప్రయాణింప జేయటానికి కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం పూను కున్నప్పుడు దానిని నిరోధించటం, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడ టం న్యాయవ్యవస్థకు సాధ్యమౌతుందా? ❞**

ప్రభుత్వాలు తమ అధికారాలను వినియో గించుకోవాలి. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలలోని గవర్నర్లు రాష్ట్రాలకు ఉన్న పరిమిత హక్కులను కూడా హరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు స్వతంత్రంగా పనిచేయటాన్ని నిరోధిస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని ఉల్లంఘిస్తున్నారు. ఇటువంటి పరిస్థితులలో సమాఖ్య తత్వాన్ని, రాష్ట్ర ప్రభుత్వాలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాపాడటానికి వీలుగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి ఉండాల్సిందని అభ్యుదయవాదులు భావిస్తున్నారు.

### సామాజిక వ్యవస్థను కోర్టులు పరిరక్షిస్తాయా?

అయితే పాలకవర్గాలు ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడులకు పూనుకున్నపుడు న్యాయవ్యవస్థ దానిని ఎదిరించి నిలబడ గలదా? రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, జాతీయో ద్యమ ప్రభావంతో సమాజంలో నెలకొన్న అభ్యుదయ భావాలను వమ్ము చేయటానికి, దేశాన్ని తిరోగమన మార్గంలో ప్రయాణింప జేయటానికి కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం పూనుకున్నప్పుడు దానిని నిరోధించటం, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటం న్యాయవ్యవస్థకు సాధ్యమౌతుందా? పెట్టు బడిదారీ వ్యవస్థను సరైన మార్గంలో నడపటం కోసం వ్యవస్థలో ఒక భాగంగా న్యాయ వ్యవస్థ ఏర్పాటైంది. స్వాతంత్ర్యానంతరం బడా పెట్టుబడిదారీవర్గం బాగా అభివృద్ధి చెందింది. తన లాభాలు, స్వప్రయోజనాల సాధన కోసం సామ్రాజ్యవాదులు, ద్రవ్య పెట్టుబడులతో మమేకమై వ్యవహరిస్తున్నది. అనేక సందర్భాలలో దేశ రాజ్యాంగం, పార్లమెంటరీ వ్యవస్థ, సమాఖ్య విధానం, ప్రజాస్వామిక భావజాలం తదితరాలు వీరికి ఆటంకంగా పరిణమిస్తున్నాయి. బడా పెట్టుబడిదారీ వర్గ ఆధిపత్యంలోని పాలకవర్గ కూటమి తనకు ఆటంకంగా పరిణమిస్తున్న వాటి నన్నింటినీ ధ్వంసం చేస్తున్నది.

జాతీయోద్యమంలో వెల్లివిరిసిన



రాజ్యాంగ పదవిని దుర్వినియోగం చేస్తూ నిత్యం తమిళనాడు ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్న రాష్ట్ర గవర్నర్ ఆర్ ఎన్ రవి

సమానత్వం, సహోదరత్వం, ప్రజలలో నెలకొన్న ఐక్యతా భావాలు కాలం గడుస్తున్న కొద్దీ పాలకవర్గాల అభివృద్ధికి విఘాతం కలిగిస్తున్నాయి. సమాఖ్య విధానం, అధికార వికేంద్రీకరణ, ప్రజాస్వామిక హక్కులు, ప్రజల మధ్య సౌహార్ద్ర సంబంధాలు, రైతు, కార్మికవర్గాల మధ్య పెరుగుతున్న ఐక్యత పెట్టుబడిదారులకు కంటకంగా మారాయి. వీటిని అధిగమించటం కోసం బడా పెట్టుబడి దారుల నాయకత్వంలోని బూర్జువా–భూస్వామ్య వర్గాలు వ్యవస్థపై దాడికి పూనుకున్నాయి. తమ లక్ష్యాన్ని సాధించుకోవటానికి మన సమాజంలోని అత్యంత అభివృద్ధి నిరోధక భావజాలానికి ప్రతినిధి అయిన బిజెపిని అధికారానికి తీసుకొచ్చారు. గతంలో అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వానికీ ఇవ్వనంత మద్దతును, ఆర్థిక వనరులను పాలకవర్గాలు ఈ ప్రభుత్వం చేతిలో పెట్టాయి. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాజ్యాంగాన్ని, స్వాతంత్ర్యానంతరం దేశంలో నెలకొల్పిన ప్రజాస్వామిక వ్యవస్థలను, ఆధునిక ప్రజాస్వామ్య భావజాలాన్ని సమూలంగా నాశనం చేయటానికి పూనుకున్నది. సమాజాన్ని తిరోగమన మార్గంలో పయనింపజేయటానికి, మనువాదాన్ని దేశానికి మార్గదర్శిగా చేయటానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నది. సామ, దాన, భేధ, దండోపాయాలను ప్రయోగించి సమాజంపై ఆధిపత్యం సాధించటానికి పూనుకున్నది. నయాన, భయానా ప్రధాన స్రవంతి మీడియాను గుపెట్లో పెట్టుకున్నది. తన విధానాలను వ్యతిరేకించే వార్తలు, విశ్లేషణలు ప్రచారంలోకి రాకుండా ఉండటానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకొంటున్నది.

కేంద్రంలోనూ, అత్యధిక రాష్ట్రాలలోనూ అధికారంలో ఉండి, సమాజంపై ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక ఆధిపత్యాన్ని ఛెలాయిస్తున్న ఆర్ఎస్ఎస్–బిజెపి కూటమిని, రాజ్యాంగంపై అది చేస్తున్న దాడులను న్యాయవ్యవస్థ మాత్రమే నిరోధించలేదు. కొన్ని సందర్భాలలో, కొన్ని అంశాలపై కోర్టులు సానుకూలమైన తీర్పులు ఇవ్వవచ్చు. అన్ని సందర్భాలలో అలాంటి తీర్పులు ఇవ్వాలని భావించటం అత్యాశే అవుతుంది. మరి రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థలపై ఆర్ఎస్ఎస్– బిజెపి దాడులను ఎలా ఎదుర్కోవాలి?

రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలలో ఆర్ఎస్ఎస్–బిజెపి భావజాలాన్ని తిప్పికొట్టకుండా రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, సమాఖ్య విధానాలపై పాలకవర్గాల దాడులను తిప్పికొట్టటం సాధ్యం కాదు. వామపక్షాలు, అభ్యుదయ శక్తులు ప్రత్యామ్నాయ విధానాలపై ప్రజలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థపై బరితెగించి దాడులు చేస్తున్న ప్రభుత్వాన్ని ఎదుర్కోవటానికి లౌకిక, ప్రజాస్వామ్య శక్తులన్నింటినీ సమీకరించాలి. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, లౌకిక, ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలంటే సామాజిక శక్తుల సమీకరణలో పైచేయి సాధించాలి. ఆ విధంగా కృషి చేయటం ద్వారానే ప్రతీఘాత శక్తులకు మద్దతిస్తూ, తిరోగమన విధానాలను బలపరుస్తున్న పాలకవర్గాల కుట్రలను తిప్పికొట్టి, ప్రజాస్వామ్యాన్ని, లౌకిక విధానాలను కాపాడుకోగలం.

సమాజంలో ప్రత్యామ్నాయ శక్తులు ఆ స్థాయికి ఎదిగినపుడే న్యాయవ్యవస్థ తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించగలుగుతుంది. గత చరిత్రను చూసినా ఇదే గోచరిస్తుంది. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు తిరోగమన మార్గంలో ప్రయాణిస్తున్నపుడు కోర్టులు కూడా ఎక్కువగా తిరోగమన తీర్పులే ఇచ్చాయి. ఎమర్జెన్సీలో అనేక అంశాలలో కోర్టులు

"రాష్ట్రంలోకి భారీగా విదేశీ పెట్టుబడులు వస్తాయని ప్రచారం చేస్తున్నారు. కానీ ప్రపంచంలో వివిధ దేశాలలోకి వస్తున్న ఎఫ్‌డిఐలు ప్రోత్సాహకరంగా లేవు. పెట్టుబడుల రాక క్రమంగా తగ్గిపోతున్నది. 2022 సంవత్సరం కన్నా 2023లో 10 శాతం పెట్టుబడులు తగ్గాయి. 2023వ సంవత్సరంలో ప్రపంచవ్యాపితంగా 1.3 లక్షల కోట్ల డాలర్లు-114లక్షల కోట్ల రూపాయలు- పెట్టుబడులు పెట్టారు. యూరప్ ఖండంలోకి వస్తున్న పెట్టుబడులు కొద్ది మేరకు పెరగగా, మనదేశంలోకి వస్తున్న పెట్టుబడులు తగ్గాయి."

ఇటువంటి తీర్పులు ఇవ్వటాన్ని చూశాం. జాతీయోద్యమం, సోషలిస్టు భావజాల ప్రభావంతో ప్రజా ఉద్యమాలకు ప్రతిబింబంగా అనేక అభ్యుదయ తీర్పులను కూడా కోర్టులు వెలువరించాయి. అందువలన ప్రత్యామ్నాయ భావజాలాన్ని, ప్రత్యామ్నాయ సంస్కృతిని, ప్రజా ఉద్యమాలను పెంపొందించకుండా న్యాయ వ్యవస్థ ప్రభుత్వాన్ని సరైన మార్గంలో పెట్టగలదని ఆశించటం అత్యాశ అవుతుంది. ఆర్‌ఎస్‌ఎస్-బిజెపిలు ప్రచారం చేస్తున్న తిరోగమన భావజాలాన్ని తిప్పికొట్టటానికి అభ్యుదయ భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేయటం, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను నిర్మించటం, సోషలిస్టు సమాజ నిర్మాణం కోసం ప్రజలను సన్నద్ధం చేయటం ద్వారా మాత్రమే బిజెపి ప్రభుత్వ విధానాలకు అడ్డుకట్ట వేయటం, వ్యవస్థలను సక్రమంగా పని చేయించటం, ప్రత్యామ్నాయ విధానాలను ముందుకు తీసుకువెళ్ళటం సాధ్యమౌతుంది.

**పెట్టుబడుల పేరుతో భూ దందా**

విశాఖపట్టణంలో జరిపిన సిఐఐ పెట్టుబడుల సదస్సులో రాష్ట్రంలో 13.25 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టటానికి 613 సంస్థలతో ఒప్పందాలు జరిగాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. తమ అంచనాలకు మించి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టటానికి విదేశాలలోని పెట్టుబడిదారులు ఉరుకులు పరుగులతో వస్తున్నారని, ఇదంతా తమ గొప్పేనని ముఖ్యమంత్రి, మంత్రులు జబ్బలు చరుచుకొంటున్నారు. ఐటి శాఖ మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా ప్రయత్నం చేయటం ద్వారా మరి కొన్ని సంస్థలు వస్తున్నాయని, ఈ పెట్టుబడుల వలన రాష్ట్రంలో 16 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని ఊదరగొడుతున్నారు. గత అనుభవాలు, పెట్టుబడుల తీరు తెన్నులను చూస్తే ప్రభుత్వం ప్రచారం చేస్తున్నట్లుగా పెట్టుబడులు, ఉద్యోగాలు రావటం అసంభవమని స్పష్టమౌతున్నది. అభివృద్ధి పేరుతో ప్రజలను మోసం చేయటానికి, రైతుల నుండి లక్షలాది ఎకరాల భూములు కాజేసి, పెట్టుబడిదారులకు కట్టబెట్టటానికి, కార్మికుల హక్కులను హరించటానికి ప్రభుత్వం ఈ విధంగా ప్రచారం చేస్తున్నది.

రాష్ట్రంలోకి పెద్దఎత్తున పెట్టుబడులు తీసుకు వచ్చామని తమ గత పాలనా కాలాన్ని టిడిపి ఆకాశానికి ఎత్తుతున్నది. 2014-19 సంవత్సరాలలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇలాగే ప్రచారం చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి కూడా ఇదే తరహా ప్రచారం కొనసాగించింది. కానీ వాస్తవాలు ఈ ప్రచారానికి విరుద్ధంగా ఉన్నాయి. 2014-19 మధ్య టిడిపి పాలనలో రాష్ట్రంలోకి పెట్టుబడులు పెడతామని అంగీకరించిన మొత్తం 1.70 లక్షల కోట్ల రూపాయలు. ఇందులో 67,000 కోట్ల రూపాయలు మాత్రమే వాస్తవంగా వచ్చాయని 2019, జులైలో విడుదల చేసిన శ్వేతపత్రంలో ప్రభుత్వం ప్రకటించింది. 2019-24 సంవత్సరాలలో వైసిపి పాలనాకాలంలో అంతకన్నా ఎక్కువగా 12.5 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టటానికి ఒప్పందాలు జరిగాయని, 1.26 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని చెబుతున్నారు. ఈ కాలంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం వెనుకబడినట్లు వివిధ సంస్థలు ఇచ్చిన వివరాలు స్పష్టం చేస్తున్నాయి.

**ప్రపంచంలో పెట్టుబడుల తీరుతెన్నులు**

టిడిపి మొదటి సంవత్సరం పాలన (2024 మే నెల నుండి 2025 మే నెల) కాలంలో రాష్ట్రం 9.4 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించిందని రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి టిజి భరత్ ప్రకటించారు. విశాఖ ఉక్కుఫ్యాక్టరీని నాశనం చేయటానికి వస్తున్న




విశాఖ ఉక్కు కార్మికుల ఆందోళన

ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ స్టీల్ కంపెనీ తెస్తున్నదని చెబుతున్న 61,780 కోట్ల రూపాయలు, భారీగా లంచాలు తీసుకొని, ప్రజలపై పెద్దమొత్తంలో భారాలు మోపటానికి ఆమోదం తెలిపి అదాని కంపెనీలతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలు, మన రాష్ట్రానికి దమ్మిడి ఉపయోగం లేకపోయినా వందల కోట్ల రూపాయల విలువైన భూములను ఉచితంగా ఇచ్చి తీసుకొస్తున్న లూలూ గ్రూప్ తదితరాలు ఈ పెట్టుబడులు పెట్టేవాటిలో ఉన్నాయి.

రాష్ట్రంలోకి భారీగా విదేశీ పెట్టుబడులు వస్తాయని ప్రచారం చేస్తున్నారు. కానీ ప్రపంచంలో వివిధ దేశాలలోకి వస్తున్న ఎఫ్‌డిఐలు ప్రోత్సాహకరంగా లేవు. పెట్టుబడుల రాక క్రమంగా తగ్గిపోతున్నది. 2022 సంవత్సరం కన్నా 2023లో 10 శాతం పెట్టుబడులు తగ్గాయి. 2023వ సంవత్సరంలో ప్రపంచవ్యాపితంగా 1.3 లక్షల కోట్ల డాలర్లు-114లక్షల కోట్ల రూపాయలు-పెట్టుబడులు పెట్టారు. యూరప్ ఖండంలోకి వస్తున్న పెట్టుబడులు కొద్ది మేరకు పెరగగా, మనదేశంలోకి వస్తున్న పెట్టుబడులు తగ్గాయి. ట్రంప్ పెడుతున్న ఆంక్షలు, ప్రపంచంలో

> **"రాష్ట్ర విభజన తర్వాత ఐదు సంవత్సరాల చంద్రబాబు పాలనలో వచ్చిన మొత్తం పెట్టుబడులు విశాఖపట్టణం ఉక్కు ఫ్యాక్టరీ విలువలో నాలుగవ వంతు కూడా లేవు. అంటే వీరు పరిశ్రమలను తీసుకొస్తున్నామన్న ప్రచారం మాటున రాష్ట్రాన్ని పారిశ్రామిక రహితం చేయటానికి ఉవ్విళ్ళూరుతున్నారు. బడా పెట్టుబడిదారులు విదిల్చే ఎంగిలి మెతుకుల కోసం రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేస్తున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని నాశనం చేసేవారు రాష్ట్రాన్ని పారిశ్రామికీకరణ చేస్తారంటే నమ్మేదెలా?"**

నెలకొన్న అనిశ్చితి, మార్కెట్లు కుంచించుకు పోతుండటం, ఎగుమతులు పడిపోవటం వంటి కారణాలతో పెట్టుబడులు పెట్టటానికి వెనుకాడుతున్నారు. ముఖ్యంగా ట్రంప్ మనదేశాన్ని లక్ష్యంగా చేసుకొని, టారిఫ్‌లు పెంచుతానని, పెనాల్టిలు విధిస్తానంటూ తీవ్రమైన బెదిరింపులకు పాల్పడటంతో పెట్టుబడిదారులు వెనుకడుగు వేస్తున్నారు. ఇటువంటి పరిస్థితులలో ఆంధ్రప్రదేశ్‌లోకి 13.25 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు-మొత్తం ప్రపంచ పెట్టుబడుల్లో 10 శాతం కన్నా ఎక్కువ రావటం ఆచరణ సాధ్యమేనా?

**విశాఖ ఉక్కుఫ్యాక్టరీ పరిశ్రమ కాదా?**

రాష్ట్ర ప్రభుత్వం, పాలకపార్టీ నాయకులు చేస్తున్న ప్రచారం చూస్తుంటే రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయటానికి అహర్నిశలూ పని చేస్తున్నారనే భ్రమలో పడిపోతాం. 13.25 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు ఆకర్షించామని చెబుతున్న ఈ పెద్దలు మూడు లక్షల కోట్ల రూపాయల విలువైన, రాష్ట్రాభివృద్ధికి వెన్నెముకగా ఉన్న విశాఖ ఉక్కుఫ్యాక్టరిని కేంద్రం ప్రైవేటీకరణ చేయబూనుకుంటే, ఉత్పత్తిని దెబ్బతీస్తూ, సంస్థ ఉనికినే ప్రమాదంలో పడవేస్తుంటే ఎందుకు వ్యతిరేకించరు? కేంద్రం కుట్రలో ఎందుకు భాగస్వాములౌతున్నారు? రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలలో విశాఖ ఉక్కుఫ్యాక్టరి భాగం కాదా! పెట్టుబడుల కోసం జరిపిన సదస్సులో జరిగిన ఒప్పందాల విలువ 13.25 లక్షల కోట్ల రూపాయలు. రాష్ట్ర విభజన తర్వాత ఐదు సంవత్సరాల చంద్రబాబు పాలనలో వచ్చిన మొత్తం పెట్టుబడులు విశాఖపట్టణం ఉక్కు ఫ్యాక్టరీ విలువలో నాలుగవ వంతు కూడా లేవు. అంటే వీరు పరిశ్రమలను తీసుకొస్తున్నామన్న ప్రచారం మాటున రాష్ట్రాన్ని పారిశ్రామిక రహితం చేయటానికి ఉవ్విళ్ళూరుతున్నారు. బడా పెట్టుబడిదారులు విదిల్చే ఎంగిలి మెతుకుల కోసం రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేస్తున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని నాశనం చేసేవారు రాష్ట్రాన్ని పారిశ్రామికీకరణ చేస్తారంటే నమ్మేదెలా? పారిశ్రామికీకరణ, పెట్టుబడుల ఆకర్షణ ముసుగులో పథకం ప్రకారం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటు పరం చేయటానికి, నాశనం చేయటానికి ప్రయత్నిస్తున్నారని స్పష్టమౌతున్నది. విశాఖ ఉక్కుఫ్యాక్టరీకి సమీపంలో ఇపుడు మిట్టల్ ఉక్కుఫ్యాక్టరీని పెట్టటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్నాహాలు చేస్తున్నాయి. మిట్టల్ ఉక్కుకు పోటీగా విశాఖ ఉక్కుఫ్యాక్టరీని వీరు ఉండనిస్తారా? అందువలన విశాఖ ఉక్కుఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయటం, తర్వాత మూసివేయటమే పాలకుల లక్ష్యంగా కనిపిస్తున్నది. అప్పుడు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి ప్రజలు ఇచ్చిన 20 వేల ఎకరాలకు పైగా భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అందుబాటులోకి వస్తాయి. ఫ్యాక్టరిని స్వాధీనం చేసుకొనే ప్రైవేటు సంస్థలు, కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న నాయకులు ఈ భూములను పంచుకొని వేలకోట్ల సంపాదించుకుంటారు. మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు భూముల సేకరణలో మళ్ళీ కొందరు నాయకులకు లాభాలు దక్కుతాయి. అబ్బ! ఏమి లాభసాటి బేరాలు! విశాఖ ఉక్కుఫ్యాక్టరిని ప్రైవేటువరం చేసినా, మూసివేయించినా లాభాలు! మిట్టల్ ఉక్కుఫ్యాక్టరికి భూమి, అనుమతులు, రాయితీలు, గనుల కేటాయింపు తదితరాలు చేయించినా లాభాలు! వారి లాభాల కోసం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ నష్టాలలో ఉన్నదని, తాము ప్యాకేజి ఇప్పించినా ప్రయోజనం లేదని, కార్మికులు పనిచేయటం లేదని ప్రజలను నమ్మింపజేయటానికి శత విధాలుగా ప్రయత్నం చేస్తున్నారు. వీరి అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మితే విశాఖ ఉక్కుఫ్యాక్టరీని ముక్కలు చేసి, పంచుకొని తింటారు. ప్రజలు చైతన్యవంతంగా ఈ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టి, ఫ్యాక్టరీ పరిరక్షణ కోసం పోరాడితే రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో విశాఖ ఉక్కుఫ్యాక్టరీ మకుటంగా కొనసాగుతుంది.

చంద్రబాబుగారు రాష్ట్ర ప్రజలకు రంగుల ప్రపంచాన్ని చూపిస్తున్నారు. కాకి-నక్క కథను గుర్తు చేసుకొండి. కాకి కష్టపడి సంపాదించుకున్న మాంసం ముక్కను కాజేయాలని భావించిన నక్క కాకిని పొగిడి, మాంసం ముక్కను కాజేసుకుపోయింది. నక్క పొగడ్తలకు ఉబ్బితబ్బిబ్బయిన కాకి తన శ్రమతో సంపాదించుకున్న మాంసం ముక్కను పోగొట్టుకుంది. పరిశ్రమలు, పెట్టుబడులు ప్రవాహం లాగా ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నాయన్న చంద్రబాబు ప్రచారాన్ని ప్రజలు నమ్మితే కాకిలాగా మోసపోయి భూములు, ఆస్తులు పోగొట్టుకుంటారు. రైతులను భయపెట్టి, మోసపుచ్చి, అభివృద్ధి పేరుతో వందల కోట్ల రూపాయల విలువైన భూములను బలవంతంగా తీసుకొని శత కోటీశ్వరులకు ఎకరం 99 పైసల లీజుకు కట్టబెడుతున్న చంద్రబాబునాయుడు, టిడిపి-జనసేన-బిజెపి ప్రభుత్వాలు ఎవరి తరఫున పని చేస్తున్నాయో స్పష్టంగానే తెలుస్తున్నది. ఇవాళ ఎక్కడో భూములు, ఆస్తులు లాక్కుంటున్నారని మిగతా చోట్ల ఉన్నవారు పట్టించుకోకపోతే రేపు మీ గ్రామంలోనే మీ భూములు, మీ ఆస్తులే లాక్కోవచ్చు. తస్మాత్ జాగ్రత్త! *


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

**అంతర్జాతీయం**

## చైనా 15వ పంచవర్ష ప్రణాళిక:

# శాస్త్ర-సాంకేతిక స్వావలంబన, వ్యవసాయ ఆధునీకరణకు ప్రాధాన్యత



రచయిత మార్క్సిస్టు ఎడిటర్

**ఎస్ వెంకట్రావు**

చైనా 15వ పంచవర్ష ప్రణాళిక ముసాయిదాను చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) కేంద్ర కమిటీ ఈ ఏడాది అక్టోబర్ 23వ తేదీన అమోదించింది. 2026 నుండి 2030 వరకు ఈ పంచ వర్ష ప్రణాళిక అమలు జరుగుతుంది. పంచవర్ష ప్రణాళికలు అనేవి సోషలిస్టు ఆర్థికాభివృద్ధికి ముఖ్యమైన మైలు రాళ్లు. పెట్టుబడిదారీ అరాచకాభివృద్ధి పంథాకు భిన్నంగా సోషలిస్టు దేశాలు ప్రజల ఆర్థిక, సామాజిక అవసరాలు తీర్చే విధంగా ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి పంథాను చేపడతాయి. ప్రపంచంలో తొలి సోషలిస్టు రాజ్యమైన సోవియట్ యూనియన్ పంచవర్ష ప్రణాళికల ద్వారా శీఘ్రమైన, ప్రజానుకూలమైన అభివృద్ధి చేపట్టి త్వరలోనే ప్రపంచంలో అత్యంత సంపద్వంతమైన పశ్చిమ దేశాలకు ధీటుగా ఆర్థిక, సామాజిక, శాస్త్ర సాంకేతిక రంగాలతోపాటు రక్షణ రంగంలో కూడా అభివృద్ధి సాధించింది.

చైనా కూడా 1949లో విముక్తి సంధించింది మొదలు పంచవర్ష ప్రణాళికల ద్వారా క్రమానుగతమైన ఆర్థిక, సామాజికాభివృద్ధి సాధిస్తూ ఈనాడు ప్రపంచంలోనే మేటి ఆర్థిక వ్యవస్థగా, ప్రజలందరినీ అతి శీఘ్రంగా పేదరికం నుండి విముక్తి చేసిన దేశంగా ముందుకు వచ్చింది.

భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మన పాలకులు కూడా సోవియట్‌ను ఆదర్శంగా తీసుకుని పంచవర్ష ప్రణాళికలు అమలు చేశారు. సోషలిస్టు వ్యవస్థలో మాదిరిగా కాకుండా పెట్టుబడిదారీ అభివృద్ధిలో ప్రణాళికలవల్ల ప్రజలకు చాలా పరిమితమైన ప్రయోజనాలు మాత్రమే దక్కాయి. అయితే, కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ప్రణాళికలను కూడా రద్దు చేసింది.

చైనా ఇప్పటివరకు 14 పంచవర్ష ప్రణాళికలు అమలు చేసింది. ఎప్పటికప్పుడు మారుతున్న అంతర్జాతీయ పరిణామాలను బేరీజు వేసుకుంటూ దేశ ఆర్థిక, సామాజికాభివృద్ధిని ముందుకు తీసుకుపోవడంలో ఈ ప్రణాళికలు ఎంతగానో తోడ్పడ్డాయి. నేడు కూడా అంతర్జాతీయంగా, జాతీయంగా ఎటువంటి పరిస్థితుల్లో 15వ పంచవర్ష ప్రణాళిక అమలు చేయవలసి వస్తున్నదో ప్రణాళిక ముసాయిదాలో చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ విశ్లేషించింది.

### ప్రణాళికాబద్ధ అభివృద్ధి

చైనా ప్రభుత్వం, కమ్యూనిస్టు పార్టీ దేశాభివృద్ధికి సంబంధించి కొన్ని దీర్ఘకాలిక లక్ష్యాలను రూపొందిస్తాయి. ఈ లక్ష్యాలను చేరుకునేందుకు పంచవర్ష ప్రణాళికలను మెట్లుగా ఉపయోగించుకుంటాయి. డెంగ్ సియావో పెంగ్ నాయకత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ, ప్రభుత్వం చైనా ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలు ప్రవేశ పెట్టినపుడు తమ దేశం సోషలిజం నిర్మాణంలో ప్రాథమిక దశలో ఉందని నిర్ధారించడం జరిగింది. సోషలిజం నిర్మాణం ఒక సుదీర్ఘమైన ప్రయాణమనీ, దాని నిర్మాణంలో జాతీయంగానూ, అంతర్జాతీయంగానూ అనేక ఒడిదుడుకులు అధిగమించాల్సి ఉంటుందని డెంగ్ నాడు చెప్పారు. 2049లో చైనా విముక్తి శతవార్షికోత్సవం నాటికి దేశాన్ని ఒక ఉన్నతమైన, ఆధునిక సోషలిస్టు దేశంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నారు. మార్క్సిజం-లెనినిజాన్ని చైనా పరిస్థితులకు వర్తింపజేసే బలమైన, కేంద్రీకృతమైన కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో మాత్రమే చైనా ప్రజలు ఆ లక్ష్యాన్ని సాధించగలరని కూడా చెప్పారు. ఆ లక్ష్యాన్ని అంచలంచెలుగా సాధించాలని అనుకున్నారు. దానిలో మొదటి అంచెగా 2,000 నాటికి చైనా ఆర్థికవ్యవస్థను ఒక మాదిరి ఐరోపా దేశాల ఆర్థిక వ్యవస్థల స్థాయికి తీసుకుపోవాలని నిర్ణయించారు. రెండో అంచెగా 2021 నాటికి అంటే చైనా కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ శతవార్షికోత్సవ సంవత్సరం నాటికి దేశంలో పేదరికాన్ని సంపూర్ణంగా నిర్మూలించాలని పథకం వేసుకున్నారు. ప్రపంచంలో పెరుగుతున్న ఆధునిక టెక్నాలజీని అంటే 4వ తరం శాస్త్ర-సాంకేతిక విప్లవ సాంకేతికతలను 2025వ సంవత్సరానికి చైనా అందుకోవాలని కూడా నిర్దేశించుకున్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీ సమర్థ నాయకత్వంలో దేశం ఈ లక్ష్యాలన్నిటినీ అనుకున్న విధంగా చేరుకుంది. 2025 నాటికే చైనా జిడిపి అమెరికా తరువాత రెండో స్థానానికి చేరుకుంది. కొనుగోలు శక్తితో పోల్చి (పిపిపి) చూస్తే చైనా నేడు ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించింది. ఇంక 2049 నాటికి అత్యంత ఆధునిక సోషలిస్టు దేశంగా ఆవిర్భవించాలన్న లక్ష్యం మిగిలి వుంది. దీన్ని కూడా రెండు దశల్లో సాధించాలని నిర్దేశించారు. 2035 నాటికే ఆర్థిక వ్యవస్థను పూర్తిగా ఆధునీకరించడం ఇందులో మొదటి దశ. ఆ తరువాత 14 ఏళ్ళలో పూర్తి ఆధునిక సోషలిస్టు వ్యవస్థగా అభివృద్ధి చేస్తారు.

### 14వ పంచవర్ష ప్రణాళిక విజయాలు

చైనా పార్టీ, ప్రభుత్వమూ ఒక్కో పంచవర్ష ప్రణాళికను విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా ఈ దీర్ఘకాలిక లక్ష్యాలను చేరుకుంటున్నది. అందువల్ల 15వ పంచవర్ష ప్రణాళికలో చైనా నిర్దేశించుకున్న లక్ష్యాలను పరిశీలించే ముందుగా 14వ పంచవర్ష ప్రణాళికలో అది సాధించిన ఆర్థిక, సాంకేతిక, సామాజికాభివృద్ధిని గురించి రేఖామాత్రంగా పరిశీలించడం అవసరం

14వ పంచవర్ష ప్రణాళిక 2021 నుండి 2025 వరకు నడిచింది. ఈ ప్రణాళికా కాలంలో చైనా జాతీయంగానూ, అంతర్జాతీయంగానూ పెద్ద గడ్డు సమస్యలు ఎదుర్కొన్నది.

> 14వ పంచవర్ష ప్రణాళిక ప్రారంభ సమయానికి చైనా జిడిపి 14.7 లక్షల కోట్ల (ట్రిలియన్) డాలర్లు. అయిదేళ్లలో ఇది 19.65 లక్షల కోట్ల డాలర్లకు పెరిగింది. అంటే అయిదేళ్లలో దాని జిడిపి సుమారు అయిదు లక్షల కోట్ల డాలర్లకు పెరిగింది. అంటే ప్రస్తుత మొత్తం భారత దేశ జిడిపి (4.2 లక్షల కోట్ల డాలర్ల) కన్నా ఎక్కువ. దేశంలో ప్రజల తలసరి ఆదాయం ఈ కాలంలో పెరిగి 13,000 డాలర్లకు చేరుకున్నది. పట్టణ గ్రామీణ ప్రజల ఆదాయాల మధ్య వ్యత్యాసం మరింత తగ్గింది.

చైనాకు ఆధునిక టెక్నాలజీని ముఖ్యంగా ఆధునిక పరికరాలన్నిటిలోనూ ఉపయోగించే చిప్స్ టెక్నాలజీని అందకుండా అమెరికా, దాని మిత్ర దేశాలు కట్టడి చేశాయి. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే చైనాతో రెండో దశ వాణిజ్య యుద్ధం ప్రారంభించారు. జో బైడెన్ హయాంలో ఆర్థికంగా, రాజకీయంగా, సైనికంగా చైనాను ఒంటరి చేసి, కట్టడి చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. ఈ అవరోధాలన్నిటినీ అధిగమించి చైనా ఈ అయిదేళ్ల కాలంలో ఏటా సగటున 5.5 శాతం ఆర్థికాభివృద్ధి సాధించింది. ఈ కాలంలో ప్రపంచ అభివృద్ధిలో 30 శాతం చైనాదే కావడం విశేషం. 2021లో 14వ పంచవర్ష ప్రణాళిక ప్రారంభ సమయానికి చైనా జిడిపి 14.7 లక్షల కోట్ల (ట్రిలియన్) డాలర్లు. అయిదేళ్లలో ఇది 19.65 లక్షల కోట్ల డాలర్లకు పెరిగింది. అంటే అయిదేళ్లలో దాని జిడిపి సుమారు అయిదు లక్షల కోట్ల డాలర్లకు పెరిగింది. అంటే ప్రస్తుత మొత్తం భారత దేశ జిడిపి (4.2 లక్షల కోట్ల డాలర్ల) కన్నా ఎక్కువ. దేశంలో ప్రజల తలసరి ఆదాయం ఈ కాలంలో పెరిగి 13,000 డాలర్లకు చేరుకున్నది. పట్టణ గ్రామీణ ప్రజల ఆదాయాల మధ్య వ్యత్యాసం మరింత తగ్గింది. 2020లో గ్రామీణ తలసరి ఆదాయం కన్నా పట్టణ తలసరి ఆదాయం 2.56 రెట్లు ఎక్కువ ఉండేది 2024 చివరికి అది 2.34 రెట్లకు తగ్గింది.

ఈ అయిదేళ్ల కాలంలో చైనా 1.2 కోట్ల పట్టణ ఉద్యోగాలను సృష్టించింది. దేశంలోని ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్య సదుపాయాలు అందుబాటులోకి తెచ్చింది. కోటి పది లక్షల గృహాలు నిర్మించింది. పట్టణ ప్రాంతాల్లోని 2.4 లక్షల నివాస ప్రాంతాలను ఆధునీకరించింది. కొత్తగా 34 లక్షల పబ్లిక్ పార్కులు నిర్మించింది. ఈ కాలంలో ఆరోగ్య రంగంలో చైనా గొప్ప కృషి చేసింది. పెద్ద ఎత్తున ఆరోగ్య సదుపాయాలు నిర్మించింది. ఈ రోజున చైనాలో 90 శాతం ప్రజలకు 15 నిమిషాల నడక దూరంలో ఆసుపత్రి అందుబాటులో ఉంది. శాస్త్ర–సాంకేతిక రంగంలో చైనా ఆధునిక సాంకేతిక తల స్వయం సమృద్ధివైపు అడుగులు వేయడం ప్రారంభించింది. స్వయంగా 7వ తరం చిప్స్ తయారు చేసుకుంది. స్వంత జెట్‌లైనర్ విమానం తయారు చేసి అమెరికా తరువాత ఇటువంటి సాంకేతిక పొందిన దేశంగా ఎదిగింది. చైనా పంపిన వ్యోమ నౌక ప్రపంచంలోనే మొట్టమొదటి సారి చంద్రుని రెండోవైపు (భూమికి కనిపించని వైపు) దిగి అక్కడి నుండి చంద్ర శిలలను క్రిందికి తెచ్చింది. గంటకు 300 కిలోమీటర్లకు పైగా వేగంతో పయనించే బుల్లెట్ రైల్వే లైన్లను 42 వేల కిలోమీటర్ల దూరానికి విస్తరించింది. దాదాపు చైనాలోని మధ్య స్థాయి నగరాలన్నీ స్పీడ్ రైళ్లతో అనుసంధానించబడ్డాయి. సోలార్ విద్యుత్, విద్యుత్ వాహనాలు, 5జి నెట్ వర్క్ విస్తరణ తదితర రంగాల్లో చైనా పశ్చిమ దేశాలను వెనక్కు నెట్టి పురోగమించింది. రక్షణ పాటవాన్ని ద్విగుణీకృతం చేసుకుంది.

**15వ పంచవర్ష ప్రణాళిక ముఖ్య లక్ష్యాలు**

సోషలిస్టు ఆధునీకరణను మరింత ఉన్నత స్థాయికి తీసుకుపోవాలని 15వ పంచవర్ష ప్రణాళికలో చైనా నిర్దేశించుకుంది. ఈ లక్ష్య సాధనలో 15వ ప్రణాళిక కీలకంగా ఉంటుదని


**చదవండి! చదివించండి!!**

# Marxist

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సైద్ధాంతిక త్రైమాస ఆంగ్ల పత్రిక

సంచిక 61, 1–2, జనవరి–జూన్ 2025

**ఎం.ఎ. బేబీ**

రాజకీయ తీర్మానం : బిజెపి–ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా బహుముఖ పోరాటానికి పిలుపు

**ప్రకాశ్ కరత్**

రాజకీయ సమీక్షా నివేదిక: పార్టీ స్వతంత్ర బలం పెంపుపై కేంద్రీకరణ

**బి.వి. రాఘవులు**

సిపిఐ(ఎం) 24వ మహాసభలు: పార్టీ నిర్మాణ పునరుత్తేజానికై పిలుపు

**సుదీప్ దత్తా**

ముట్టడిలో నయా–ఉదారవాద భారత దేశం

**పత్రం**

ప్రసంగం: కామ్రేడ్ తో లామ్, వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి

వెల: ఒక ప్రతి రూ. 50

ప్రతులకొరకు

*Order copies from:*

**The Manager,**

The Manager, Marxist, A. K. Gopalan Bhawan
27-29 Bhai Vir Singh Marg, New Delhi 110001
Phone: (91-11) 23348725; Email: pdpbln@gmail.com
Marxist is also available online at: https://cpim.org/the-marxist

పేర్కొంది. 'తీవ్రమైన రిస్కులు', 'అనేక అవకాశాలు' ఈ కాలంలో చైనాకు ఎదురవు తాయని, 'అంతర్జాతీయ బలాబలాల్లో శతాబ్దానికి ఒక్కసారి చూసే తీవ్రమైన మార్పులు జరుగుతాయని' పేర్కొంది. అంతర్జాతీయ వాణిజ్య క్రమం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొం టున్నది, ప్రపంచ ఆర్థికాభివృద్ధి ఉత్సాహాన్ని కోల్పోయింది. గతంలో ఎన్నటికన్నా ఎక్కువగా ప్రధాన దేశాల మధ్య ఘర్షణలు పెరుగు తున్నాయి అని 15 ప్రణాళిక ముసాయిదాలో చైనా పార్టీ కేంద్ర కమిటీ వివరించింది.

> **"'తీవ్రమైన రిస్కులు', 'అనేక అవకా శాలు' ఈ కాలంలో చైనాకు ఎదురవు తాయని, 'అంతర్జాతీయ బలాబలాల్లో శతాబ్దానికి ఒక్కసారి చూసే తీవ్రమైన మార్పులు జరుగుతాయని' పేర్కొంది. అంతర్జాతీయ వాణిజ్య క్రమం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొం టున్నది, ప్రపంచ ఆర్థికాభివృద్ధి ఉత్సాహాన్ని కోల్పోయింది. గతంలో ఎన్నటి కన్నా ఎక్కువగా ప్రధాన దేశాల మధ్య ఘర్షణలు పెరుగు తున్నాయి అని 15 ప్రణాళిక ముసాయిదాలో చైనా పార్టీ కేంద్ర కమిటీ వివరించింది."**

ఇలాంటి పరిస్థితుల్లో చైనా కమ్యూనిస్టు పార్టీ, ప్రభుత్వమూ మార్క్సిజం-లెనినిజం, మావో ఆలోచనా విధానాలను మార్గదర్శక సూత్రాలుగా తీసుకుని దేశంలో ఉత్పత్తి శక్తులను మరింత ఉన్నతమైన ఆధునిక సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం దిశగా తీసుకుపోవాలని కేంద్ర కమిటీ నిర్దేశించింది. 15వ ప్రణాళికలో ఆర్థిక సామాజికాభివృద్ధికి 12 ప్రధానమైన నిర్ణయాలను చైనా పార్టీ ప్రతిపాదించింది. అవి:

1. రియల్ ఎకానమీని బలోపేతం చేయడం: మాన్యుఫాక్చరింగ్, ప్రాథమిక సదుపాయాలు, డిజిటల్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం ద్వారా బలమైన ఆధునిక పారిశ్రామిక పునాదిని ఏర్పాటు చేయడం

2. సాంకేతిక స్వావలంబన సాధించడం: సాంకేతిక రంగంలో స్వయం సమృద్ధి, స్వావలంబన సాధించడం కోసం శాస్త్ర-సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణలు జరపడం, కొత్త సాంకేతికతలను అభివృద్ధి చేయడం.

3. దేశవాళీ మార్కెట్‌ను విస్తరించడం: దేశంలో వినియోగం, పెట్టుబడులను పెంచడం ద్వారా స్వదేశీ మార్కెట్‌ను విస్తరించడం.

4. సోషలిస్టు మార్కెట్ యంత్రాంగాన్ని మెరుగుపరచడం: మార్కెట్ సంస్కరణలను మరింత లోతుగా అమలు పరచడం ద్వారా దీర్ఘకాలిక అభివృద్ధి సామర్థ్యాన్ని పెంచడం.

5. ప్రపంచ వాణిజ్య భాస్వామ్యాన్ని పెంపొందించడం: బెల్ట్ అండ్ రోడ్ పథకం ద్వారా, ఇతర మార్గాల్లో బహుళపక్ష వాణిజ్యాన్ని పెపంపొందించడం.

6. గ్రామీణాభివృద్ధిని ఆధునీకరించడం: వ్యసాయాన్ని ఆధునీకరించడం, పట్టణ, గ్రామీణ ప్రాంతాలను అనుసంధానించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని చురుకెత్తించడం.

7. ప్రాంతీయ సమతుల్యత సాధించడం: పట్టణీకరణను వేగవంతం చేయడం, అభివృద్ధి చెందిన చైనా తీరప్రాంతాలను లోతట్టు ప్రాంతాలతో అనుసంధానించడం ద్వారా ప్రాంతీయ సమతుల్యత సాధించడం.


ప్రపంచ వాణిజ్య కేంద్రంగా మారిన చైనా వాణిజ్య రాజధాని షాంఘై నగరం

8. సాంస్కృతిక సృజనను పెంపొందించడం: ప్రజల్లో సృజనాత్మకతను పెంపొందిండం, సాంస్కృతిక రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా సామాజిక స్థిరత్వాన్ని సాధించడం.

9. సంపదను పంచడం, సాంఘిక సంక్షేమాన్ని పెంచడం : ప్రజలందరి సంక్షేమం కోసం ఆదాయాలను పంచడం, ప్రజల ఆరోగ్యం, సాంఘిక సంక్షేమ పథకాలను మెరుగుపరడం.

10. హరిత చైనాను సాధించడం: కర్బన ఉద్గారాలను తటస్థ స్థాయికి తగ్గించడం, పునరుత్పాదక ఇంధనాలను పెంపొందించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షిండం.

11. జాతీయ భద్రతకు భరోసా కల్పించడం: జాతీయ స్థిరత్వాన్ని సాధించడం కోసం ప్రజాభద్రతను, పరిపాలనా రంగాన్ని ఆధునీకరించడం.

12.రక్షణ రంగాన్ని ఆధునీకరించడం: రక్షణరంగంలో ఆధునిక, డిజిటల్ వ్యవస్థలు ప్రవేశపెట్టడం, సైన్యాన్ని ఆధునీకరంచడం.

**శాస్త్ర-సాంకేతిక స్వావలంబన**

ముఖ్యంగా ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో సాంకేతిక స్వావలంబన సాధించాలని పంచవర్ష ప్రణాళిక ముసాయిదా నొక్కిచెప్పింది. దాంతోపాటు వ్యవసాయాన్ని ఆధునీకరించడం మీద కూడా కేంద్రీకరించింది. నూతన దశ సాంకేతిక విప్లవం కల్పిస్తున్న చారిత్రాత్మక అవకాశాలను అందిపుచ్చుకుని చైనా విద్య, శాస్త్ర-సాంకేతికత, మానవ వనరుల మధ్య చక్కని సమన్వయాన్ని ఏర్పరచుకుని పురోగమించాలని ప్రణాళిక నొక్కి చెప్పింది. ఆ విధంగా కొత్త, నాణ్యమైన ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేయాలని కోరింది. కోర్ టెక్నాలజీల్లో ఉన్నతమైన, ఒరిజినల్ ఆవిష్కరణలను ప్రోత్స హించాలంది. ఈ రంగాన్ని కొత్తపుంతలు తొక్కిం

> **" వ్యవసాయ ఆధునీకరణతోపాటు గ్రామీణ ప్రాంతాలను ఆధునీకరించి పట్టణాలకూ, గ్రామాలకూ మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాలని 15వ పంచవర్ష ప్రణాళిక పత్రం సూచించింది. పేదరికాన్ని సంపూర్ణంగా నిర్మూలించడం ద్వారా సాధించిన విజయాన్ని మరింత ముందుకు తీసుకుపోవడం కోసం గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఆధునిక జీవన పరిస్థితులను సృష్టించాలని సూచించింది. "**

చాలంది. దీనికిగాను పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డి) పై ఖర్చు మరింత పెంచాలంది. నూతన సాంకేతికతలను పరిశ్రమలతో సమర్ధవంతంగా జోడించాని ప్రతిపాదించింది. వ్యూహాత్మకమైన శాస్త్ర-సాంకేతికతలమీద కేంద్రీకరించాలని చెప్పింది. జాతీయ డేటా వనరులను ఉపయోగించుకోవాలని, ఎఐ వంటి మౌలిక, కోర్ టెక్నాలజీలో కొత్త ఆవిష్కరణలు చేయాలని చెప్పింది. శాస్త్ర పరిశోధనలకు మంచి ఊపుతేవాలని చెప్పింది.

### వ్యవసాయ ఆధునీకరణ

వ్యవసాయ ఆధునీకరణతోపాటు గ్రామీణ ప్రాంతాలను ఆధునీకరించి పట్టణాలకూ, గ్రామాలకూ మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాలని 15వ పంచవర్ష ప్రణాళిక పత్రం సూచించింది. వ్యవసాయ ఆధునీకరణలో చైనా వెనుకబడి ఉందనీ, ఆ లోటును ఈ ప్రణాళికా కాలంలో పూడ్చుకోవాలని పేర్కొంది. పేదరికాన్ని సంపూర్ణంగా నిర్మూలించడం ద్వారా సాధించిన విజయాన్ని మరింత ముందుకు తీసుకుపోవడం కోసం గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఆధునిక జీవన పరిస్థితులను సృష్టించాలని సూచించింది. వ్యవసాయంలో ఉత్పాదకతను మరింత పెంచడంతోపాటు గ్రామీణ ప్రజల ఆదాయాలు పెంచడంపై కేంద్రీకరించాలని ప్రణాళిక నిర్దేశించింది. చైనాలో వ్యవసాయం సాంకేతికతతో నడవాలనీ, అదే సమయంలో పర్యావరణ హితంగా ఉండాలని నిర్దేశించింది. "వ్యవసాయోత్పత్తుల నాణ్యతపై కేంద్రీకరించాలి, దానివల్ల వ్యవసాయం అనేది చైనా ఆర్థికాభివృద్ధిలో ఒక "ఆధునిక స్తంభం"గా అమరుతుంది" అని పేర్కొంది. ప్రస్తుతం ఉత్పత్తి అవుతున్న ధాన్యాలకన్నా మరో 5 కోట్ల టన్నుల ధాన్యాలు అదనంగా ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని పెంపొందించాలని సూచించింది. గ్రామీణ ప్రాంతాలను అందమైన, నివాసానికి అత్యంత యోగ్యమైన ప్రాంతాలుగా మార్చాలంది. గ్రామీణ ప్రాంతాలను మరింత సుందరంగా, మరింత ఉత్పాదకంగా, మరింత పర్యావరణ యోగ్యంగా మార్చేందుకు గాను వ్యవసాయంపై పెట్టుబడులు పెరగాలని పేర్కొంది. ఆధునిక స్మార్ట్ వ్యవసాయ యంత్రాలను ప్రవేశపెట్టాలంది. వ్యవసాయదారులకు వారి పంటకు మంచి ధరలు వచ్చేట్లు చూడాలంది. ఆహార ధాన్యాల కొనుగోళ్లను పెంచాలని చెప్పింది. గ్రామీణ పేదలు మళ్లీ పేదరికంలోకి జారిపోకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించింది. బాగా అభివృద్ధి చెందని ప్రాంతాల అభివృద్ధిపై కేంద్రీకరించాలంది.

### ప్రజానుకూల పట్టణీకరణ

చైనాలో ప్రజలు కేంద్రంగా పట్టణీకరణ జరగాలని 15వ పంచవర్ష ప్రణాళిక సూచించింది. గ్రామీణ ప్రాంతాలనుండి పట్టణాలకు వలస వచ్చేవారికి శాశ్వతమైన పట్టణ నివాసాలు ఏర్పాటు చేయాలని సంకల్పించింది. మెగా సిటీల్లో పరిపాలనను ఆధునీకరించాలని సూచించింది.

మార్క్సిజం-లెనినిజం, మావో ఆలోచనా విధానం ఆధారంగా చైనా లక్షణాలతో కూడిన సోషలిస్టు సంస్కృతిని మరింతగా అభివృద్ధి చేయాలని ప్రణాళికలో నొక్కి చెప్పారు. ప్రజల్లో సోషలిస్టు విలువలను మరింతగా పాదుకొల్పాలని సూచించింది.

*

---

# సావర్కర్ విచ్ఛిన్నకర వాదనలు

(35వ పేజీ తరువాయి)

హిందువులతో పాటు ముస్లిములు లక్షలాది మంది పాల్గొన్నారు. అనేకమంది ప్రాణత్యాగం చేశారు. వేలాది మంది జైలు పాలయ్యారు. దీనితో బ్రిటిష్ వలనవాదులు, ఇలా హిందువులు ముస్లింలు కలిసి ఐక్యంగా పోరాడితే మనం తట్టబుట్ట సర్దుకుని పోవాల్సిందేనని భావించారు. అప్పటినుండి హిందూ ముస్లింల మధ్య చీలికలు, బేధాలు, విద్వేషాలు సృష్టించ మొదలుపెట్టారు. ఆ కాలంలోనే అంటే 1861 ప్రాంతంలో "మిస్ బేవరేజ్"అనే బ్రిటిష్ రచయిత్రి "ఫైజాబాద్"అనే చరిత్ర పుస్తకం రాసింది. అందులో బాబ్రీ మసీదు ఉన్న స్థలంలో అంతకుముందు రామజన్మభూమి ఉన్నది అనటానికి ఆధారం ఉంది అని రాసింది. ఈ పుస్తకం హిందూ ముస్లింల మధ్య విభేదాలను రాజేసింది. అదే రామజన్మభూమి ఉద్యమానికి తొలిమెట్టుగా మారింది. అక్కడనుండి హిందూ ముస్లిం విభజన తేవటానికి, బ్రిటిష్ వలసవాద వ్యతిరేక ఉమ్మడి పోరాటంలో చీలికలు తేవడానికి మొదటి ప్రయత్నం ప్రారంభమైంది. దానితో సమాజంలో ముస్లిం వ్యతిరేకత కల్పించడం 1857 తర్వాత నుండి ప్రారంభమైంది. అది బాలగంగాధర తిలక్, గోఖలే, దయానంద సరస్వతి నుండి ప్రారంభించి మదన్మోహన్ మాలవ్య దాకా 1910 వరకు సాగింది. అయితే భారత స్వాతంత్ర పోరాటంలో రెండు మతాల ప్రజలు ఉమ్మడిగా పాల్గొనడంతో వారిమధ్య ఐక్యత వెల్లివిరిసింది. దీనిని ఆనాటి హిందూ మహాసభ పూర్తిగా వ్యతిరేకించింది. అప్పటినుండి ఇప్పటివరకు హిందూ ముస్లిం మధ్య ఐక్యతను చెడగొట్టటానికి అలానే ముస్లిం వ్యతిరేక విద్వేష ప్రచారాలు చేయటం సంఘ పరివారం ముఖ్యమైన ఎజెండాగా పెట్టుకున్నది. బ్రిటిష్ వలసవాద ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలలో ఆర్ఎస్ఎస్ ఎన్నడూ పాల్గొనలేదు సరి కదా బ్రిటిష్ ప్రభుత్వంతో షరీకై వారికి అనుకూలంగా పనిచేసింది. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో వాజపేయి కూడా అప్రూవర్‌గా మారి స్వాతంత్ర ఉద్యమ నాయకులను కార్యకర్తల అరెస్టుకు సహకరించాడు. జాతీయ ఉద్యమ కాలంలో ఆర్ఎస్ఎస్ సంఘపరివార్‌లు వీలైనంత చోట్ల మత కలహాలు, అల్లర్లు సృష్టించడమే పనిగా పెట్టుకున్నారు.

*

ఇంటర్వ్యూ

# వెనిజులా కమ్యూనిటీ ప్రాజెక్టు




**ఏంజెల్ ప్రాడో**

**(ఏంజెల్ ప్రాడో వెనిజులాలో 'కమ్యూన్'ల ఉద్య మాన్ని ఆరంభించాడు. 2022-24 మధ్య కాలంలో సైమన్ ప్లానస్ టౌన్‌షిప్ మేయర్‌గా పనిచేసాడు. 2024లో నికోలాస్ మదురో ప్రభుత్వంలో 'కమ్యూన్'ల శాఖామంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టాడు. 2025 మార్చి 11న కారకాస్‌లో సిరా పాస్కల్ మార్క్వినా వెనిజులాలో కమ్యూన్ వ్యవస్థల మీద ఏంజెల్ ప్రాడోతో కూలంకుషంగా జరిపిన ఇంటర్వ్యూ పూర్తి పాఠం ఇది)**

**ప్రశ్న :** మన ఇంటర్వ్యూ ముందుగా ఒక మౌలిక ప్రశ్నతో మొదలుపెడదాం. వెనిజులా కమ్యూన్ అంటే అర్థం ఏమిటి?

**జవాబు :** ఇది వెనిజులా రాజకీయ పరిణామాలలో మార్పులను అర్థం చేసుకోవడానికి ఎంతైనా ఉపకరించే ప్రశ్న. వెనిజులాలో సోషలిస్టు నిర్మాణానికి ముందు మెట్టుగా ఈ 'కమ్యూన్'ల స్థాపన అవసరం అని కమాండెంట్ హ్యూగో ఛావెజ్ ఒక ప్రణాళిక రూపొందించాడు.

'కమ్యూన్' అంటే నిర్దిష్ట భౌగోళిక పరిధిలో పనిచేసే క్షేత్రస్థాయి సంస్థ. ఇది స్థానిక స్వయం పాలనా సంస్థ అని చెప్పుకోవచ్చు. తన పరిధిలో ఉన్న వనరులను, ఉత్పత్తి సాధనాలను అక్కడి ప్రజా ప్రయోజనాలు, అవసరాలకు అనుగుణంగా నిర్వహించుకునే చట్టబద్ధమైన రాజకీయ నిర్మాణ రూపమే కమ్యూన్.

ప్రతి కమ్యూన్‌లో వివిధ స్థాయిలలో పనిచేసే ప్రజా సంఘాలు ఉంటాయి. కమ్యూనిటీ పార్లమెంటు, కమ్యూనిటీ బ్యాంక్ ఇలా ఆర్థిక వ్యవహారాల నుండి ఆటల వరకూ అన్ని జీవన కార్యకలాపాలను సమన్వయం చేసుకునేందుకు రకరకాల కమిటీలు ఉంటాయి. పునాది స్థాయిలో ప్రతి కమ్యూన్‌లో కమ్యూన్ కౌన్సిళ్లు ఉంటాయి. ఈ కౌన్సిళ్లు మౌలిక నిర్మాణ సంస్థలు.

అసెంబ్లీ సమావేశాలు కమ్యూన్‌కు గుండెకాయ వంటివి. కమ్యూన్‌లకు ప్రాణాధారాలు ఇవి. కమ్యూన్‌లో అత్యున్నత నిర్ణాయక సంస్థ కమ్యూన్ అసెంబ్లీ. కమ్యూన్ పరిధిలో జీవిస్తున్న ప్రతి పౌరుడుకీ ఈ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొని మాట్లాడేందుకు, ప్రశ్నించేందుకు, డిమాండ్ చేసేందుకు, ఓటు వేసేందుకు హక్కు ఉంటుంది. కమ్యూన్‌కి సంబంధించి ఏ అంశం మీదయినా తుది నిర్ణయం చేసే హక్కు ఈ అసెంబ్లీలకు ఉంటుంది.

ఏ కమ్యూన్‌కి ఆ కమ్యూన్ అది ఎదుర్కొంటున్న సమస్యలను విస్తృతంగా చర్చించి పరిష్కారాలు రూపొందించుకుని, అభివృద్ధి ప్రణాళికలకు రూపకల్పన చేసుకుని శాంతియుత సహజీవనాన్ని పెంపొందించుకోవడానికి ప్రతీకలే ఈ కమ్యూన్‌లు. సమిష్టి పనివిధానం ద్వారా 'ఉమ్మడి స్ఫూర్తి'ని పెంపొందిస్తూ కమ్యూన్‌లోని ప్రజాజీవితాలను ప్రభావితం చెయ్యడానికి ఈ అసెంబ్లీలు ఎంతగానో ఉపకరిస్తాయి.

**ప్రశ్న :** కమ్యూన్‌ల ద్వారా నూతన సామాజిక ఉత్పత్తి సంబంధాలను పెంపొందించాలని కదా ఛావెజ్ భావించింది?


**జవాబు :** నిజమే, కమ్యూన్ అంటే ఒక భౌగోళిక అస్థిత్వమే కాదు, ఆర్థిక వ్యవస్థ కూడా. కమ్యూన్‌ల ద్వారా ప్రజలు ఉమ్మడి పట్టుతో సమస్యలను పరిష్కరించుకుని జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకుంటారు. నిర్దిష్టమైన ప్రణాళికలు రూపొందించుకుని సకల శ్రామిక శక్తిని ఉపయోగపెట్టుకుని కమ్యూనిటీ ఆర్థిక వ్యవస్థను నిర్మించుకుంటారు. ప్రజలకు ఆహారం తదితర అవసరాలతో పాటు పౌరసేవలు కూడా అవసరం. ఏ కమ్యూన్‌కి ఆ కమ్యూన్ వీటిని అంతర్గతంగానే పరిష్కరించుకుంటాయి. ఇందుకు తగిన కమ్యూనిటీ ప్రణాళికలు రూపొందించడంలోనే కీలకం అంతా ఇమిడి ఉంటుంది.

ప్రస్తుతం ఈ కమ్యూన్‌లలో ఆస్తులు, యాజమాన్య హక్కుల గురించి చర్చలు నడుస్తున్నాయి. కమ్యూన్‌లోని ప్రభుత్వ, కుటుంబ, ప్రైవేటు ఆస్తుల వరకూ అన్ని విషయాలూ చర్చిస్తున్నారు. ప్రతి కమ్యూన్‌లోనూ కమ్యూనిటీ ఉమ్మడి యాజమాన్య హక్కుదే పైచెయ్యిగా ఉండాలనే లక్ష్యం పెట్టుకున్నప్పటికీ ఈ దిశగా పురోగతి ఇంకా కొనసాగుతూనే ఉన్నది.

కమ్యూన్‌లో ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి అవసరమైన భూమి, ఫ్యాక్టరీలు, వనరుల వంటి ఉత్పత్తి సాధనాల మీద నియంత్రణ కోసం పోరాటం కొనసాగుతూ ఉన్నది. అలాగే 'మిగులు' పంపిణీ, పున: పెట్టుబడుల గురించి కూడా కమ్యూన్‌లలో చర్చ నడుస్తున్నది. సామాజిక పెట్టుబడి, ఉత్పాదక పెట్టుకబడుల మధ్య సమతుల్యత సాధించాల్సిన అవసరం ఇంకా ఎంతైనా ఉన్నది.

**ప్రశ్న :** అమెరికా ఆంక్షల మూలంగా ఆర్థిక దిగ్బంధనంలో చిక్కుకున్న ఈ దేశంలో కమ్యూన్‌లు అక్కడి ప్రజల తక్షణ అవసరాలను తీర్చగలుగుతున్నాయా? ఆర్థిక దిగ్బంధనాన్ని అధిగమించి కమ్యూన్‌లు విజయం సాధించిన దాఖలాలు ఉన్నాయా?

**జవాబు :** కమ్యూన్ అనుసరించే ఆదర్శ విలువలు, సూత్రీకరణలే అక్కడి ప్రజాజీవితాన్ని తీర్చిదిద్దుతాయి. ప్రజలు కమ్యూన్‌నే తమకు అత్యంత సమీపంగా ఉన్న ప్రభుత్వంగా భావిస్తారు.




వెనిజులా కమ్యూన్ ఉద్యమంపై క్రిస్ గిల్బర్ట్ రాసిన పుస్తకం. మంత్లీ రివ్యూ ప్రెస్ వారు దీన్ని ప్రచురించారు.

కాబట్టి వాళ్ల సమస్యలను కమ్యూన్ పరిష్కరించాలని కోరుకుంటారు. కోవిడ్ ఉత్పాతం సందర్భంగా మాకు ఎదురైన అనుభవం ఇదే. ఆరోగ్య కార్యకర్తలు, మోటార్ బైక్ కొరియర్ వలంటీర్లు, కమ్యూనిటీ సభ్యులు అందరూ కలిసి సంఘీభావ స్ఫూర్తితో ప్రజలకు మందులు చేరవేయ్యడం, వ్యాక్సిన్‌ల గురించి ప్రచారం చేసి వేయించడం, బాధితులకు ఆహారం అందించడం వంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ప్రజలందరికీ ఆరోగ్య సంరక్షణ అందేలా చూసారు. ఎన్నిక కాబడిన కమ్యూనిటీ అధికార ప్రతినిధులు ఈ మొత్తం కార్యక్రమంలో కీలక పాత్ర పోషించారు. కమ్యూన్‌లో ఉన్న ప్రజల బాగోగుల పట్ల వీరు చూపించిన శ్రద్ధ, ప్రదర్శించిన నాయకత్వ పటిమ ఎన్నదగినవి. ఎటువంటి సంక్షోభ పరిస్థితులు ఎదురయినా భుజం కాసేందుకు కమ్యూనిటీ నాయకులు ఉన్నారనే భరోసా ప్రజలలో నెలకొల్పడంలో కమ్యూన్ నిర్మాణం విజయం సాధించింది.

అది కోవిడ్ ఉత్పాతం కానీయండి, అమెరికా ఏకపక్షంగా విధించిన ఆంక్షలు కానీయండి, ఆర్థిక సంక్షోభం కానీయండి వెనిజులాలో ఏ జిల్లా, ఏ వార్డు కూడా క్షేత్రస్థాయి సంస్థలు లేకుండా లేవు. కమ్యూన్‌లు నెలకొల్పిన చోట ఈ స్థానిక స్వయం పాలిత ప్రభుత్వాలే పరస్పర సహకారానికి కావలసిన ప్రణాళికలు రూపొందించి అమలు చేసాయి. కమ్యూన్‌లలో నివసిస్తున్న జనాభాకు చెందిన సమస్త సమాచారం అందుబాటులో ఉండడం మూలంగా అక్కడి ప్రజల అవసరాలను తీర్చడంలో కమ్యూన్‌లు విశేష పాత్ర పోషించాయి.

**ప్రశ్న :** ఐదేళ్ళ క్రితం కమ్యూన్ వ్యవస్థలకు బొలివార్ ప్రభుత్వానికి మధ్య ఉద్రిక్తతలు, వైరుధ్యాలు నెలకొని ఉన్న పరిస్థితులు ఉండేవి. ఇవాళ చూస్తే కమ్యూన్‌లు, బొలివార్ ప్రభుత్వం విస్తృత సమన్వయంతో పనిచేస్తున్నట్లు కనబడుతోంది. ఇది ఎలా సాధ్యమయ్యింది?

**జవాబు :** కమాండెంట్ ఛావెజ్ భౌతికంగా మమ్మల్ని వీడి వెళ్ళిపోయాక 'ఛావెజ్ ఇజం' లోనే కాదు జాతీయ బూర్జువావర్గం అమెరికన్ సామ్రాజ్యవాదం మధ్య ఉన్న సంబంధాలలో కూడా వైరుధ్యాలు తలెత్తాయి. ఇవి దేశ సార్వభౌమత్వానికి ప్రమాదంగా పరిణమించాయి.

ఇవాళ సిరియాలో ఏం జరిగిందో మనం చూసాం. వెనిజులాలో మెజారిటీ ప్రజానీకం సామ్రాజ్యవాద వ్యతిరేకులే అయినప్పటికీ సిరియా పరిణామాలను ఈ దేశ ప్రజానీకం ఒక హెచ్చరికగా స్వీకరించాలి. 20వ శతాబ్దపు మధ్యకాలంలో అర్జెంటీనా అధ్యక్షుడు జువాన్ పెరోన్ సామాజిక న్యాయం, కార్మిక వర్గ హక్కులు, పరిరక్షణ, ఆర్థిక స్వాతంత్రం, రాజకీయ సార్వభౌమాధికారం కాపాడుకోవడానికి అనుసరించిన రాజకీయ ఉద్యమం 'పెరోనిజం' మాదిరే 'ఛావెజ్ ఇజం'లో కూడా వేర్వేరు సైద్ధాంతిక భావజాలాలతో ఉన్న అనేకానేక శక్తులు కలిసి పనిచేస్తున్నాయి. అయితే ఒకటి మాత్రం సత్యం. వెనిజులాలో నేను 'ఛావెజ్‌వాది'ని అని చెప్పుకుని కమ్యూన్‌లో ఏ బాధ్యతలూ తీసుకోకుండా, క్షేత్రస్థాయి పనిలో లేకుండా ఉన్న ఎంతటి వ్యక్తి అయినా అతన్ని సామ్రాజ్యవాదాన్ని నికరంగా వ్యతిరేకించే జాతీయ ఫ్రంట్‌లో పైసాకు కొరగాని వ్యక్తిగా పరిగణిస్తారు. ఇది ప్రజలందరికీ తెలిసిన విషయమే.

సామ్రాజ్యవాద వ్యతిరేక, అభ్యుదయకాముక ప్రభుత్వాలను కూలదోసినప్పుడల్లా ఆయా దేశాల్లో ఊచకోత, అణిచివేత, పెను వినాశనం చోటు చేసుకున్నాయి. అందుకే ప్రజల మధ్యన గరిష్ఠ ఐక్యత నెలకొనాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. అంతర్గతంగా ఎంతయినా విభేదించుకోవచ్చు, చర్చలు కొనసాగించవచ్చు కానీ అంతిమంగా ఐక్యంగా నిలబడాలి. ప్రజా ఉద్యమాల ద్వారా మేం కమ్యూన్‌లను మరింత బలోపేతం చెయ్యడానికి కృషి చేస్తున్నాం. కమ్యూన్‌లు నిర్మాణపరంగా మరింత బలోపేతం అయి, మరింత దృఢతరంగా మారి ప్రజల స్వయం పాలనకు వాస్తవ ప్రతిరూపంగా నిలిచేందుకు ప్రయత్నిస్తూ ఉన్నాయి.

ప్రస్తుతం ప్రభుత్వ నాయకులు, కమ్యూన్ ఉద్యమం మధ్యన బంధం బలోపేతం అయ్యింది. ప్రభుత్వం కమ్యూన్‌లను బలోపేతం చెయ్యడానికి ముందుకు వస్తోంది. అయితే ఛావెజ్ ఇజం ద్వారా ప్రజల మధ్య గరిష్ఠ ఐక్యత పెంపొందించడానికి సాగుతున్న కృషిని నీరుగార్చడానికి అవకాశవాదులు, సంస్కరణ వాదులు కాచుకుని ఉన్నారని కూడా మా గ్రహింపులో ఉన్నది. అయితే సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం మమ్మల్ని అందరినీ ఐక్యంగా నిలిపి ఉంచుతోంది. ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించే శక్తులకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

**ప్రశ్న :** ఆర్థిక దిగ్బంధనం, సంక్షోభం వంటి అత్యంత క్లిష్ట పరిస్థితులలో కమ్యూన్‌లు బలోపేతం అయ్యాయి. అయినప్పటికీ ఇప్పటికీ చాలామంది జనం తమ సమస్యలకు ఉమ్మడి పరిష్కారం కన్నా వ్యక్తిగత పరిష్కారాన్ని ఆశిస్తున్నారు. ఈ ధోరణి ఇప్పటికీ కొనసాగుతున్నది. కమ్యూనిటీ ప్రాజెక్టుతో మమేకం కానివారితో వ్యవహరించాల్సిన సరైన పద్ధతి ఏమిటి?

**జవాబు :** యుద్ధం అన్నాక రకరకాల నష్టాలు జరుగుతాయి. వెనిజులాలో గత దశాబ్దకాలంగా మేం ఆర్థిక యుద్ధంలో నిమగ్నమై ఉన్నాం. వెనిజులా సమాజాన్ని నైతికంగా దెబ్బతీసి, కూల్చేసి ప్రజలు ఎవరి బతుకు వాళ్ళు చూసుకునేలా చేసేందుకు ఉద్దేశించిన క్రూరమైన యుద్ధం ఇది. ఈ క్రమంలో కొంతమంది సమిష్టి కార్యాచరణ నుండి జారిపోయారు. తమ

తక్షణ అవసరాలు, కుటుంబ అవసరాల కోసం తాత్కాలికంగా క్షేత్రస్థాయి ఉద్యమం నుండి వెనుకంజ వేశారు.

అయితే ఇప్పటికీ సమిష్టి తత్వానికి కట్టుబడి పోరాటంలో కొనసాగుతున్నవారి సంఖ్య, తప్పుకున్న వారికన్నా చాలా ఎక్కువ. ఎన్ని ఆటుపోట్లు ఎదురయినా ప్రతి వార్డులో, ప్రతి పల్లెలో, ప్రతి కమ్యూన్‌లో విప్లవాదర్శంతో మార్గదర్శకులుగా నిలబడిపోయిన వారు ఎందరో ఉన్నారు. నికరంగా నిలబడి, ప్రతిఘటిస్తూ, నాయకత్వం వహిస్తూ ప్రజా సంఘాల స్ఫూర్తిని జ్వాజ్వలమానంగా రగిలిస్తూ ఉన్నారు.

అందుకే వెనిజులా విప్లవం తిరిగి పురోగమిస్తోంది. 2016–2021 నాటి క్లిష్ట పరిస్థితులు వెనక్కి కొట్టబడ్డాయి. దేశం మళ్ళీ నూతన ఆర్థిక శక్తి సామర్థ్యాలను సంతరించుకున్నది. ఇందుకు గాను బొలివార్ ప్రభుత్వం కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకున్నది. వాటిని మేం ప్రశ్నించాం. కానీ సదరు నిర్ణయాలు వెనిజులాలో అమెరికా జోక్యాన్ని, అంతర్యుద్ధాన్ని నిలవరించాయన్న వాస్తవాన్ని అంగీకరించి తీరాలి.

ప్రతిఘటనా పోరాటం మమ్మల్ని బలోపేతం చేసింది. ఎదురుదెబ్బలు తిన్నాం అయినా నైతికంగా, రాజకీయంగా స్థిరంగా నిలబడ్డాం. లక్షలాది మంది క్షేత్రస్థాయి నాయకులు, ముఖ్యంగా మహిళలు కమ్యూనిటీని పరిరక్షించుకోవడం ద్వారా అత్యున్నత స్థాయి నాయకత్వ లక్షణాలను ప్రదర్శించారు.

కమ్యూన్‌లు ఆవిర్భవించి, పునరావిర్భవించి అత్యంత క్లిష్ట కాలానికి ఎదురొడ్డి మరీ బలోపేతం అయ్యాయి. క్షేత్రస్థాయి ఆర్థిక వ్యవహారాలు చక్కదిద్దుకుంటూ, రాజకీయ విద్య గరుపుతూ, యువతను నిర్మాణయుతంగా సమీకరిస్తున్నాయి.

**ప్రశ్న :** ప్రభుత్వానికి, కమ్యూన్‌లకు మధ్యన 2024 మే తర్వాత అత్యంత సన్నిహిత సహకార సంబంధాలు ఏర్పడ్డాయి. చర్చలు నడుస్తున్నాయి. ఇదెలా సాధ్యపడింది? ఈ చర్చల ద్వారా కమ్యూన్‌లకు బదిలీ అయ్యే అధికారాలు ఏమన్నా ఉన్నాయా?

**జవాబు :** ప్రస్తుత దశలో ప్రభుత్వానికి, కమ్యూన్‌లకు మధ్య నడుస్తున్న చర్చల ప్రక్రియకు చాలా ప్రాధాన్యత ఉన్నది. ఈ చర్చలకు ముందస్తు అడుగుగా కమ్యూన్‌ల అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తారు. దేశవ్యాప్తంగా జరిగే ఈ సమావేశాల్లో ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి ప్రాధాన్యతా క్రమంలో ఏ సమస్యలను పరిష్కరించుకోవాలో నిర్ణయిస్తారు. తదనంతరం దేశవ్యాప్తంగా జరిగే ఓటింగ్ ద్వారా ప్రతి కమ్యూన్ అసెంబ్లీ అత్యంత ప్రాధాన్యతగా భావించిన ఏదో ఒక ప్రాజెక్టును ఎంచుకుంటాయి.

ఓటింగ్ ముగిసాక ఏ కమ్యూన్‌కు ఏ ప్రాజెక్ట్ కేటాయించబడిందో ప్రకటిస్తారు. ఒక్కో ప్రాజెక్టుకు ప్రస్తుతానికి 10,000 అమెరికన్ డాలర్ల నిధులు ప్రభుత్వం కేటాయిస్తుంది. ఈ నిధులతో ఆ ప్రాజెక్టును పూర్తి చెయ్యాలి. అవసరాన్ని బట్టి మున్సిపల్, ప్రాంతీయ ప్రభుత్వాలు కూడా ఈ ప్రాజెక్టు పూర్తి చెయ్యడానికి తగిన ఆర్థిక సహకారం అందించాలని దేశాధ్యక్షుడు ఆదేశించాడు.

ఆ రకంగా ప్రతి కమ్యూనిటీ అంతర్గత ప్రణాళిక ద్వారా ఒక్కో ప్రాజెక్టు దక్కించుకోవడంతో గతంలో కమ్యూనిటీ కార్యకలాపాల నుండి వెనక్కి తగ్గిన వారు తిరిగి కార్యకలాపాలలో భాగస్వాములు అయ్యారు. కమ్యూనిటీ కౌన్సిళ్ళు, కమ్యూన్‌ల మీద విశ్వాసం పునరుద్ధరించబడింది. కమ్యూన్ ద్వారా ఉమ్మడి సమస్యలను పరిష్కరించుకోవచ్చు అన్న విశ్వాసం అనుమడించింది. అలాగే గత ఏడాది కాలంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రభుత్వానికి, కమ్యూన్‌లకు మధ్య చర్చలు నడుస్తుండడంతో ఒక్కో సమావేశంలో పాల్గొనే కమ్యూన్‌ల సంఖ్య క్రమేపీ పెరుగుతూ వచ్చింది. ప్రజలలో ఈ ప్రక్రియ పట్ల విశ్వాసం పెరిగింది.

ఈ ప్రక్రియ ద్వారా కార్మికుల, కష్టజీవుల ఆకాంక్షలను ప్రభుత్వం నేరుగా తెలుసుకోగలుగుతోంది. ప్రజలు కమ్యూన్‌ల ద్వారా తమ అస్తిత్వాన్ని బలోపేతం చేసుకుంటూ కమ్యూనిటీ సాధికారతను పెంపొందించుకుంటున్నారు. 'ప్రజలు స్వయం పాలన ద్వారా విప్లవకర సామాజిక మార్పులను సాధించుకోవాలి' అన్న కమాండెంట్ ఛావెజ్ ఆశయాన్ని నెరవేర్చేదానికి అనువుగా ఈ కమ్యూన్‌ల పని పద్ధతులను మరింత పదును తేల్చడం మా ముందున్న తక్షణ కర్తవ్యం. ఆరోగ్య సంరక్షణ, మౌలిక సౌకర్యాల కల్పన, విద్య తదితర ప్రజాక్షేత్రాలను మెరుగుపరుచుకోవడానికి ప్రజలు తమంతట తామే తగిన ప్రణాళికలు రూపొందించుకుని అమలులోకి తీసుకువచ్చి నిర్వహణా బాధ్యతలు చేపడుతున్నారు.

క్లుప్తంగా చెప్పుకోవాలంటే ప్రస్తుతం నడుస్తున్న చర్చల ప్రక్రియ సాధికారత కల్పించేందుకు దోహదం చెయ్యడంతోపాటు అనేక అనుభవాలను అందిస్తుంది. కమ్యూనిటీలు తమకు అందిన వనరులు వృథా పోనీయకుండా, ప్రాజెక్టుకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా అనుకున్న రీతిలో పూర్తి చెయ్యడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఏ ప్రాజెక్టు అమలుకయినా ఎదురయ్యే రెండు సమస్యలు – బ్యూరోక్రసీ, అవినీతి. అయితే ప్రాజెక్టు నిర్ణయం, నిధుల ఖర్చు వంటి అన్ని బాధ్యతలూ ప్రజల చేతుల్లోనే ఉండడంతో ఆ రెండు సమస్యలకు విరుగుడు దక్కినట్లయ్యింది.

ప్రజాస్వామ్యం అంటే పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొంఇంచడం. వెనిజులాలో ఈ ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతున్నది. ప్రజల భాగస్వామ్యం రూపొందించడం ద్వారా ఏ వార్డు, ఏ గ్రామం అయినా ఒక ప్రభుత్వ విభాగం సాధించే దానికన్నా ఎక్కువ పని, ఫలితాలను సాధిస్తున్నాయి.

**ప్రశ్న :** ఈ ఏడాదిలో రాజ్యాంగ సవరణలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఇందులో కమ్యూన్‌లకు తగినంత ప్రాముఖ్యత కల్పించాలని చాలామంది బలంగా వాదిస్తున్నారు. బొలివార్ రాజ్యాంగంలో వీటికి స్థానం కల్పిస్తే రాజ్యానికి – కమ్యూన్‌లకు మధ్య ఉండే సంబంధాల గురించి అనేక ప్రశ్నలు తలెత్తే అవకాశం ఉన్నది కదా. దీన్ని మీరు ఎలా అర్థం చేసుకున్నారు?

**జవాబు:** 1999లో బొలివర్ రాజ్యాంగాన్ని మెరుగుపరచుకునే సందర్భంతో వెనిజులా ప్రజానీకం భాగస్వామ్య ప్రజాస్వామ్యం దిశగా కీలకమైన అడుగు వేసారు. ప్రజలు ఫ్యాక్టరీలలో, విశ్వవిద్యాలయాల్లో, భౌగోళిక పరిధిలో సంఘాలుగా ఏర్పడడానికి అవసరమైన న్యాయపరమైన హక్కులను బొలివార్ రాజ్యాంగం కల్పించింది.

అది ఒక అసాధారణ విజయం. అయితే 2007లో చేపట్టిన రాజ్యాంగ సవరణలలో క్షేత్రస్థాయి కమ్యూన్‌లను నిర్ద్వంద్వంగా గుర్తించి తీరాలి అన్న ప్రతిపాదన నెగ్గుకు రాలేకపోయింది.

2012లో 'నాయకత్వంపై గురిపెట్టండి' పేరిట దేశవ్యాప్తంగా జరిగిన చర్చల నేపథ్యంలో కమాండెంట్ ఛావెజ్ 'కమ్యూన్‌లు ఎక్కడున్నాయి?' అంటూ తన మంత్రివర్గ సహచరులను ప్రశ్నించాడు. ఇవాళ అదే ప్రశ్నకు వెనిజులా ప్రజానీకం 'ఇదిగో ఇక్కడ మేం కమ్యూన్‌గా ఉన్నాం. ఇది మా హద్దు. కమ్యూన్‌గా మేం నిర్మాణయుతంగా, సమర్థవంతంగా పనిచేసే రీతిగా, పోరాటస్ఫూర్తితో ఉన్నాం' అని ధీటుగా జవాబు ఇచ్చేదానికి సిద్ధంగా ఉన్నారు.

అయినప్పటికీ రాజ్యాంగం ఈ కమ్యూన్‌లను నిర్ద్వంద్వంగా గుర్తిస్తుందా లేదా అనేది మా ముందున్న అతి పెద్ద సవాలు. అందుకే

మేం సంబంధిత మంత్రివర్గ బాధ్యులతో కలిసి పరస్పర విశ్వాసంతో విశాల ప్రాతిపదికన ఏకాభిప్రాయ సాధనకు కృషి చేస్తున్నాం. రాజ్యాంగ సవరణలలో కమ్యూన్‌లకు స్థానం కల్పించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం.

ఇప్పుడు చర్చ 'గుర్తింపు' పరిధిని మించిపోయింది. కమ్యూన్‌లకు రాజ్యాంగంలో స్థానం కల్పించడమే కాదు, రాజ్యంతో దానికి ఉండాల్సిన సంబంధాలను గురించి కూడా చర్చిస్తున్నాం. కమ్యూన్‌లను ప్రభుత్వం క్షేత్రస్థాయి సంఘంగా గుర్తిస్తున్నది. కానీ వీటిని ప్రభుత్వంలో ఒక విభాగంగా, పాలనావ్యవహారాలలో భాగంగా పరిగణించాలని మేం కోరుతున్నాం.

అందుకే 'కమ్యూనా ఓ నాడా ఇస్తే' (కమ్యూన్ లేదంటే ఏదీవొద్దు) అన్న నినాదానికి కట్టుబడి ఉన్నాం. ఇవాళ కమ్యూన్‌లు అటు గ్రామీణ, ఇటు పట్టణ ప్రాంతాలు రెండింటా తక్షణ, ప్రత్యక్ష నిర్మాణాత్మక సంస్థలుగా నెలకొని ఉన్నాయి. అయితే వీటిని రాజ్యాంగ బద్ధంగా గుర్తించడం ద్వారా కమ్యూన్‌లు మరింత బలోపేతం కావాలి. ప్రజలకు మరింత సాధికారత సమకూరాలి అనేదే మా ఆకాంక్ష. ఈ ప్రభుత్వం పట్లా, విప్లవం పట్లా సంపూర్ణంగా ఏకీభావం లేనివారు కూడా 'కమ్యూన్'ల చట్టబద్ధతను నిరాకరించడం లేదు. కమ్యూన్‌లు ఆయా ప్రాంత ప్రజాసమస్యలను ఎలా పరిష్కరించుకుంటున్నాయో ప్రత్యక్షంగా చూస్తున్నారు కాబట్టి వారు ఆ అభిప్రాయానికి వచ్చారు.

వెనిజులాలో మెజారిటీ ప్రజానీకం కార్మికవాద కమ్యూన్‌లలో నివసిస్తున్నారు. వాళ్ల అవసరాలు తీరడానికి రాజ్యం సహాయసహకారాలు కావాల్సి ఉన్నది. టౌన్‌షిప్‌లకు, రాష్ట్రప్రభుత్వాలకు రాజ్యాంగ పరంగా ఏమేం హక్కులు ఉన్నాయో 'కమ్యూన్'లకూ ఆ హక్కులు ఇవ్వాలని అడుగుతున్నాం. ఈ హక్కులు మేయర్ల, గవర్నర్ల, మంత్రుల రాజకీయ చిత్తం మీదా, దయాధర్మాల మీద ఆధారపడి కాకుండా రాజ్యాంగపరంగా సంక్రమించాలని ఆశిస్తున్నాం. రాజ్యం ప్రభుత్వ నిధులలో కమ్యూన్‌లకూ వాటా కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం.

రాజ్యాంగం మీద కూడా కమ్యూన్‌లలో చర్చించడం ప్రారంభించాం. ఈ ఏడాది ఆఖరుకి మేం ఒక నిర్ణయానికి వస్తాం. అయితే 'కమ్యూన్'ను రాజ్యాంగబద్ధ సంస్థగా గుర్తించాలనే డిమాండ్ మీద విస్తృత ఏకాభిప్రాయం కుదిరింది. అలాగే రాజ్యానికి – కమ్యూన్‌లకు మధ్య ఉండాల్సిన సంబంధాలు, నిధుల కేటాయింపు వంటి కీలక అంశాల మీద మాకు స్పష్టత ఉన్నది.

**ప్రశ్న :** ఛావెజ్, కమ్యూన్, సోషలిజం – వీటి మీద చివరిగా మీరేం చెప్పదలచుకున్నారు?

**జవాబు :** దేశ సంపదను శతాబ్దాలుగా కొల్లగొట్టుకుపోయిన సామ్రాజ్యవాద శక్తులతో అమీతుమీ తేల్చుకునే పోరాటంలో వెనిజులా గత మూడు దశాబ్దాలుగా మునిగిపోయి ఉన్నది. కమాండెంట్ ఛావెజ్ పిలుపు ఇచ్చినట్లు – 'ఇది మానవీయ గౌరవం, అసలైన విముక్తి కోసం నికరంగా నిలబడాల్సిన సమయం. స్వాతంత్ర్యం, స్వీయ నిర్ణయాధికార పతాకలను రెపరెపలాడిస్తూ ఎత్తి పట్టాల్సిన సమయం!

సామ్రాజ్యవాద శక్తులు దాడి చేస్తున్నాయనే నెపంతో మన రాజకీయ నమూనా పట్ల మితవాద వైఖరితో ఉండకూడదు. మనం సామ్రాజ్యవాద శక్తుల నకిలీ ప్రజాస్వామ్య నమూనాను అనుకరించాల్సిన అవసరం, అగత్యం అంతకన్నా లేదు. ఇవాళ ఆఫ్రికాఖండంలో ఉత్తరాన ఉన్న సహారా ఎడారి దగ్గర నుండి దక్షిణాన సూడాన్‌లోని సవన్నా గడ్డి ప్రాంతాల వరకు, అట్లాంటిక్ నుండి ఎర్రసముద్రం



వెనిజులా కమ్యూన్ ఉద్యమ ప్రయోగానికి బీజాలు వేసినవాడు హ్యూగో చావెజ్

వరకు మధ్య ఉన్న 5000 కిలోమీటర్ల ప్రాంతంలోని అనేక దేశాల్లో బహుళజాతి కార్పొరేషన్లకు వ్యతిరేకంగా, నయా–వలసవాద సంస్థలకు వ్యతిరేకంగా తిరుగుబాట్లు చెలరేగి ఆయా దేశాల్లోని పరాయి సైనిక స్థావరాలను తరిమికొట్టి తమ సార్వభౌమత్వాన్ని నిలబెట్టుకుంటున్నాయి. మా దేశ సార్వభౌమత్వాన్ని సమున్నతంగా నిలబెట్టడానికి ఛావెజ్ చేసిన కృషిని ఈ సందర్భంగా మేం ఆదర్శంగా స్వీకరిస్తున్నాం.

ఛావెజ్ ఆరంభించిన ఈ పోరాటాన్ని మేం ముందుకు తీసుకుపోతాం. ఇవాళ ఈ పోరాటం మరింత తీవ్రతరమయ్యింది. మా ముందున్నవి రెండే మార్గాలు. ఒకటి – ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించుకుంటూ, మా సహజ వనరులు దోపిడికి గురికాకుండా చూసుకుంటూ సోషలిజం నిర్మాణాన్ని ముందుకు కొనిపోవడం, లేదూ ఇప్పుడున్న రాజ్యాంగ నిర్మాణాలను అభ్యుదయ మార్గాన నవీనీకరించడంలో విఫలమై సంస్కరణవాద ప్రభుత్వంగా మిగిలిపోవడం. ఛావెజ్ చూపిన బొలివార్ విప్లవ పథాన మా దేశ రాజకీయ నమూనాను నడిపించలేకపోతే సామ్రాజ్యవాదం మమ్మల్ని నాశనం చేసి పారేస్తుంది. సామ్రాజ్యవాద శక్తులు నిర్మించిపోయిన నిర్మాణాలను మేం గనుక ధ్వంసం చెయ్యలేకపోతే వాళ్లు ఇప్పటి వరకూ మేం నిర్మించుకున్న నమూనాలను ధ్వంసం చేసి పారేస్తారు.

ప్రస్తుతం అర్జెంటీనాలో జరుగుతున్నది ఇదే. అభ్యుదయ ప్రభుత్వం దేశాన్ని ఆర్థిక విధ్వంసం నుండి పునర్నిర్మించింది కానీ రాజకీయ పునాదిలో మార్పులు తీసుకురావడాన్ని విస్మరించింది. పాత రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాణాలను యథావిధిగా కొనసాగించింది. క్షేత్రస్థాయిలో ప్రజలకు అధికారాలు బదలాయించడంలో విఫలమయ్యింది. పర్యవసానంగా ఆ ప్రభుత్వం కూలదోయబడింది. లాటిన్ అమెరికాలో అత్యంత సంపద్వంతమైన ఆ దేశాన్ని ఐఎమ్ఎఫ్, సామ్రాజ్యవాద కార్పొరేట్ సంస్థలు కలిసి కొల్లగొట్టి బికారుల దేశంగా దిగజార్చాయి.

వెనిజులా రాజ్యాంగ స్వభావాన్ని మార్చుకుని, నూతన సమాజాన్ని నిర్మించడానికి, అసలు సిసలైన ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పడానికి, దేశ స్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకోవడానికి కట్టుబడి ఉన్నది. సోషలిజం నిర్మాణానికి కంకణబద్ధురాలై ఉన్నది. వెనిజులా ప్రజలే ఈ లక్ష్యాలను ముందుకు తీసుకువెళతారు అన్న ఆశాభావం నాకు ఉన్నది.

*

# గాంధీజీ హత్య : సావర్కర్ కపట నాటకాలు

(2వ పేజీ తరువాయి)

సమాధానం ఇస్తూ, మా అన్నదమ్ములు నలుగురం నాథూరామ్ గాడ్సే, దత్తాత్రేయ, నేను, గోవింద్ మేమందరం ఆర్ఎస్ఎస్ వారమే. ఆర్ఎస్ఎస్సే మా కుటుంబం. నాథూ రామ్ గాడ్సే ఆర్ఎస్ఎస్ లో "బౌద్ధిక్ కార్య వాహక్"(మేధో కార్యకర్తగా) పనిచేశాడు. గాంధీ హత్యానంతరం గోల్వాల్కర్, ఆర్ఎస్ఎస్ అప్పటికే ఇబ్బందుల్లో ఉన్న కారణంగా మరింత ఇబ్బందుల్లోకి నెట్టకూడదు అన్న ఉద్దేశంతోనే ఆయన కోర్టులో ఆర్ఎస్ఎస్‌ను ఏనాడో విడిచి పెట్టాను అని తప్పుడు వాంగ్మూలం ఇచ్చాడు. అంతేగాని వాస్తవానికి గాడ్సే ఏనాడూ ఆర్ఎస్ ఎస్‌ను విడిచి ఉండలేదు అని కూడా చెప్పాడు. వీడి సావర్కర్ మా గురువు అనీ, గాంధీజీ హత్యకు అతని ప్రోత్సాహం ఉందని కూడా విలేకరుల సమావేశంలో కుండబద్దలు కొట్టినట్టు చెప్పాడు. మరి నాథూరామ్ గాడ్సే కు ఆర్ఎస్ ఎస్ కు సంబంధం లేదని ఎల్ కె అద్వానీ చెబుతున్నారు కదా అన్న ప్రశ్నకు బదులిస్తూ, అవి పిరికితనంతో చెప్పిన మాటలు అని కొట్టి పారేశాడు గోపాల్ గాడ్సే. ఆర్ఎస్ఎస్ ఎంత కపటత్వంగా సందర్భాన్ని బట్టి ఎన్ని మాటలు మారుస్తుందో, క్రూరమైన హత్య చేసి దాని నుండి తప్పించుకోవటానికి ఎన్ని రకాల అబద్ధాలు పుట్టిస్తారో ఈ ఉదంతం ద్వారా ఆర్ఎస్ఎస్ నిజస్వరూపం బయటపడుతుంది. అబద్ధాలకు ఆర్ఎస్ఎస్ పుట్టినిల్లు. వీళ్లు సందర్భోచితంగా ఎలా అబద్ధాలు ఆడగలరో, అబద్ధాల మీదనే చరిత్రను ఎలా నిర్మిస్తారో చెప్పడానికి ఈ ఉదంతం చక్కని ఉదాహరణ.

1923లో సావర్కర్ జైలు నుంచి విడుదలయ్యాడు. ఆయన రచన "హిందుత్వ" చదివి దాని ప్రేరణతో కేశవ బలిరాం హెడ్గేవార్ అనే ఆయన సావర్కర్ ను కలిసేందుకు మహారాష్ట్రలోని రత్నగిరి వచ్చాడు. రత్నగిరి శివార్లలో ఉండే "షిరిగాన్"అనే చోట వీరి సమావేశం జరిగింది. డాక్టర్ మూంజి, సావర్కర్ ఆశీస్సులతో ఆర్ఎస్ఎస్ పురుడు పోసుకుంది. దాని నిర్మాణం, రూపం, సంస్థ భవిష్యత్తు గురించి మాట్లాడుకున్నారు. నీవు కలకత్తా వెళ్లి, మెడిసిన్ చదువుకుంటున్నాననే పేరుతో అప్పటికే అక్కడ తీవ్రంగా జరుగుతున్న బ్రిటిష్ వ్యతిరేక తీవ్రవాద ఉద్యమాల్లో చేరి వాళ్ళ దగ్గర ఆయుధ శిక్షణ తీసుకొని రా అని సావర్కర్, హేడ్గే వార్‌ను ఆదేశించాడు. పైకి నీవు డాక్టర్ చదువు కుంటున్నట్లు చేస్తూనే, ఆయుధ శిక్షణ తీసుకోవటం అన్నది ముఖ్యమైన విధిగా పెట్టుకోమని చెప్పాడు. ఆయన డాక్టర్ చదువు చదివినా ఎన్నడూ ప్రాక్టీస్ చేయలేదు. మతోన్మాద ఉద్యమ నిర్మాణ మెలకువలు నేర్చుకుని వచ్చాడు. డాక్టర్ బి ఎస్ మూంజి, సావర్కర్ల ఆశీస్సులతో వాళ్ళ సలహాలతో 1925 విజయదశమి రోజున ఆర్ఎస్ఎస్‌ను ప్రారంభించాడు హెడ్గేవార్.

డాక్టర్ హేడ్గేవార్ 1889లో పుట్టి 1940 లో చనిపోయారు. 15 ఏళ్ల పాటు ఆయనే ఆ సంస్థకు మొదటి సర్ సంఘ సంచాలక్ గా పని చేశాడు. ఈ 15 ఏళ్లలో దేశంలో అనేక ముఖ్యమైన ఘటనలు జరిగాయి. ఉప్పు సత్యాగ్రహం, సహాయ నిరాకరణ ఉద్యమం, వలసవాద బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేక ఉద్యమాలు దేశంలో నాలుగు చెరగులా విస్తరించాయి. ఈ ఉద్యమాలలో ఆర్ఎస్ఎస్ ఎక్కడ పాల్గొన్న పాపాన పోలేదు. ఉప్పు సత్యాగ్రహం తొలి రోజుల్లో హెడ్గేవార్ పాల్గొని, అరెస్టయి ఆరు నెలలు జైల్లో ఉన్నాడని వారి సాహిత్యంలో రాసుకున్నారు. దానికి ఎక్కడా సాక్ష్యాధారాలు లేవు. సందేహాస్పదమైన ఇది మినహా ఏ ఒక్క వలస వ్యతిరేక ఉద్యమాల లోనూ, ఎన్నడూ ఆర్ఎస్ఎస్ పాల్గొనలేదు. పైగా బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమాలలో పాల్గొని మీ సమయాన్ని వృధా చేసుకోవద్దని యువకులకు బోధించారు. హేడ్గే వార్ తర్వాత సర్ సంఘ సంచాలక్ గా మాధవ సదాశివ గోల్వాల్కర్ నియమించబడ్డాడు.

ఆర్ఎస్ఎస్‌లో సర్ సంఘ సంచాలక్‌కు ఒక డిక్టేటర్ స్థాయి ఉంటుంది. అతని మాటకు ఎవరూ ఎదురు చెప్పటానికి వీల్లేదు. ఈయన ఎన్నికల ద్వారా ఎన్నుకోబడరు. కేవలం నియామకం ద్వారా మాత్రమే వస్తాడు. గోల్వాల్కర్ 1906 లో పుట్టి 1978లో చనిపోయారు. 33 సంవత్సరాల పాటు ఆర్ఎస్ఎస్ నాయకుడిగా ఉన్నాడు. ఆర్ఎస్ ఎస్‌లో ఇవాళ ఉన్న సంస్థల భావజాలం ఏమిటి? వాటి నిర్మాణం ఎలా ఉండాలి? ఆచరణ ఎలా ఉండాలి? ఇలాంటి విషయాలన్నింటినీ రూపొందించిన వాడు గోల్వాల్కర్. అందువల్లనే ఆర్ఎస్ఎస్ వారు ఆయనను గురూజీ అని సంబోధిస్తారు. ఈయన రెండు పుస్తకాలు రాశాడు. ఒకటి 1939లో "ఉయ్ అండ్ అవర్ నేషన్ హుడ్ డిఫైన్డ్" అనేది. దీనిలో ఆయన సావర్కర్ చెప్పిన మాటలనే మరొక రూపంలో వివరించాడు. దానికన్నా ముఖ్యమైనది "బంచ్ ఆఫ్ థాట్స్" గ్రంథం. ఇది తెలుగులో "పాంచ జన్యం"అనే పేరుతో అనువాదం అయింది. ఈరోజు మనం వాట్సాప్ యూనివర్సిటీ వారి అబద్ధాల ప్రచారాన్ని కళ్లారా చూస్తున్నాం. చెవులారా వింటున్నాం. ఈ పుస్తకం అలాంటి అబద్ధాలకు పుట్టినిల్లు. వక్ర సిద్ధాంతాలకు కొదవలేదు. కమ్యూనిస్టుల మీద, ముస్లింల మీద, క్రైస్తవుల మీద, అలానే బౌద్ధులు, జైనుల మీద కూడా విషం చిమ్మటమే ఈ పుస్తకం ముఖ్య ఉద్దేశం. వీరికి వ్యతిరేకంగా హిందువులను రెచ్చగొట్టడం ఈ పుస్తక కర్తవ్యం.

1925 నుండి ఇప్పటివరకు ఆరుగురు సర్ సంఘ సంచాలక్ లు వచ్చారు. వారిలో ఒక్క రాజేంద్ర సింగ్ తోమర్ అనే క్షత్రియ (రాజపుట్) రెండు సంవత్సరాల పాటు ఆర్ఎస్ఎస్‌ు నాయకుడుగా ఉన్నాడు. ఇతన్ని మినహాయిస్తే మిగిలిన వాళ్ళందరూ బ్రాహ్మణులే. మొదటివాడైన హెడ్గేవార్ దేశస్థ ఋగ్వేద బ్రాహ్మణుడు, మరాఠీవాడు. రెండవ వాడైనా గోల్వాల్కర్ మరాఠీ కర్హడే బ్రాహ్మణుడు. మూడో వాడు బాలా సాబ్ దేవరస్ (మధుకర్ దత్తాత్రేయ దేవరస్) ఈయన కూడా మళ్లీ దేశస్థ ఋగ్వేది బ్రాహ్మణుడు. నాలుగో వాడైన రాజేంద్ర సింగ్ తోమర్ పంజాబ్‌కు చెందిన రాజపుట్ (క్షత్రియుడు). ఐదో వాడు కుప్ప హళ్లి సీతారామయ్య సుదర్శన్. ఈయన సంకేతి సారస్వత కన్నడ శాఖకు చెందిన బ్రాహ్మణుడు. ఆరోవాడు ఇప్పుడున్న మోహన్ మధుకర్ రావు భగవత్, మరాఠీ బ్రాహ్మణుడు. ఆర్ఎస్ఎస్ నాయకత్వంలోకి ఇతరులకు ప్రవేశం లేదు. బ్రాహ్మణుల చేతిలో మాత్రమే ఈ సంస్థ ఉంటుంది. పురుషులు మాత్రమే నాయకత్వానికి అర్హులు. మను ధర్మశాస్త్రాన్ని, బ్రాహ్మణాధిపత్యాన్ని ఆర్ఎస్ఎస్ గట్టిగా నమ్ముతుంది. దొంతరల సమాజాన్ని నిలవడానికి ప్రయత్నిస్తుంది. దీనికి వారు భారతీయ సనాతన సంస్కృతి అనే ముద్దు పేరు పెట్టి ప్రజలను మభ్యపెడుతున్నారు.

### హిందూ ముస్లింలకు మధ్య విద్వేషాలకు బీజాలు

మనం ఒక్కసారి ప్రథమ స్వాతంత్ర పోరాట (సిపాయిల తిరుగుబాటు) కాలానికి వెళ్దాం. 1857 ప్రథమ స్వతంత్ర పోరాటంలో హిందువులు ముస్లింలు ఐక్యంగా ఉండి దేశంలో ఉన్న అనేక సంస్థానాలన్నీ కలిసి బహదూర్షా జాఫర్‌ను ఢిల్లీ సింహాసనం మీద చక్రవర్తిగా ప్రతిష్టించి, బ్రిటిష్ వలసవాదులకు వ్యతిరేకంగా యుద్ధం చేశారు. ఈ యుద్ధంలో

(మిగతా 30వ పేజీలో)

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 21, issue: 7 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# కార్మికులచేత అత్యధిక గంటలు పనిచేయించుకునే దేశాల్లో 15 స్థానంలో భారత్



కార్మికుల చేత అత్యధిక గంటలు చాకిరీ చేయించుకునే దేశాల్లో భారత దేశం 15వ స్థానంలో ఉంది. ప్రపంచ జనాభా సమీక్ష 2025 ప్రకారం ప్రపంచంలోని 150 దేశాలకుగాను అత్యధిక గంటలు పనిచేసే దేశాల్లో మొదటి స్థానాన్ని భూటాన్ అక్రమించింది. ఈ దేశంలో శ్రామికులు వారానికి 54 గంటలు శ్రమిస్తుండగా అత్యల్పంగా నెదర్లాండ్స్‌లో వారానికి 26.8 గంటలు పనిచేస్తున్నారు. ప్రపంచ వ్యాపితంగా కార్మికులు సగటున వారానికి 38.7 గంటలు పనిచేస్తుండగా భారత దేశంలో సగటు కన్నా 7.1 గంటలు ఎక్కువగా వారానికి 45.8 గంటలు పనిచేస్తున్నారని జనాభా సమీక్ష తెలిపింది. దక్షిణాసియాలో మనతోపాటు బంగ్లాదేశ్, మాల్దీవుల్లో కూడా ప్రజలు మన జనాభాతో సమానంగా  పనిచస్తేన్నారు. బంగ్లాదేశ్‌లో 45.8 గంటలు, మాల్దీవుల్లో 45.9 గంటలు పనిచేస్తున్నారు. దక్షిణాసియాలో మనకన్నా ఎక్కువ కాయకష్టం చేసే తొలి 15 దేశాల్లో భూటాన్‌తో పాటు పాకిస్థాన్ ఉంది. ఈ దేశంలో శ్రామికులు వారానికి 47.5 గంటలు పనిచేస్తున్నారు. విశేషమేమిటంటే  అత్యధిక గంటలు పనిచేసే తొలి పదిహేను దేశాల్లో 10 ఆసియా ఖండంలో మిగిలిన అయిదు ఆఫ్రికా ఖండంలో ఉన్నాయి. అవి ర్యాంకుల వారీగా: 1. భూటాన్ (54.5 గం॥), 5. యుఎఇ (48.4 గం॥), 7. జోర్డాన్ (47.8), 9. పాకిస్థాన్ (47.5), 10. క్వతర్ (46.8) 11. లెబనాన్ (46.4), 12. కాంబోడియా (45.9), 13, మాల్దీవులు (45.9), 14. బంగ్లాదేశ్ (45.8), 15. భారత్ (45.8) ఇక మిగిలిన అయిదు దేశాలు ఆఫ్రికా ఖండంలో ఉన్నాయి. అవి ర్యాంకుల వారీగా 2. సూడాన్, 3. లెసోతో, 4. రిపబ్లిక్ ఆఫ్ కాంగో, 6. సావో టోమ్, ప్రిన్సిపె 8. లైబీరియా.

అతి తక్కువ గంటలు పనిచేసే దేశాల్లో నెదర్లాండ్స్ తరువాత నార్వే (27.1గం॥), డెన్మార్క్ (28.8) ఉన్నాయి.

ఆసియాలోనూ, ఆఫ్రికాలోనూ అతి ఎక్కువ గంటలు పనిచేయడానికి కారణం అక్కడి ఆర్థిక వ్యవస్థల వెనుకబాటు తనమే. భారత దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో నాలుగో అతి పెద్దది అయినప్పటికీ ప్రజల తలసరి ఆదాయాల్లో చాలా వర్ధమాన దేశాలకన్నా వెనుకబడి ఉంది. లేబర్ ఇంటెన్సివ్ పరిశ్రమలు, పార్ట్ టైమ్ ఉద్యోగాలు తక్కువగా ఉండడం, సాంఘిక భద్రత నెట్‌వర్క్ బలహీనంగా ఉండడం, ఎక్కువ మంది చిన్నచిన్న పనులు స్వంతంగా చేసుకోవడం ఈ దేశాల్లో ఎక్కువ పనిగంటలు ఉండడానికి కారణమని  జనాభా సమీక్ష 2025 తెలిపింది. చైనాలో వారానికి 44.8 గంటలు, వియత్నాంలో 41.5 గంటలు పనిచేస్తున్నారు. ఉత్తర కొరియా, క్యూబాల్లో 40.8 గం॥ చొప్పున పనిచేస్తున్నారు.

అమెరికాలో కార్మికులు వారానికి 36.1 గంటలు పనిచేస్తున్నారు. ఇది ప్రపంచ సగటు కన్నా కొంచెం తక్కువ అయినప్పటికీ చాలా అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే ఎక్కువ. కెనడాలో 32.3 గంటలు, బ్రిటన్‌లో 31, ఫ్రాన్స్‌లో 30.8 గంటలు పనిచేస్తున్నారు.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా **రూ. 180**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు..........................................................
వీధి.......................................................................
గ్రామం....................................................................
మండలం లేదా పట్టణం.............................................
జిల్లా.......................................................................

email: marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd.  D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.